ఆరోగ్యమార్గ ప్రకాశకథ

Madras, 1916

Record no. 502

Ārōgyamārgaprakāśakatha

Madras, 1916

Record no. 502

Bibliographic Record Target

ఆరోగ్యమార్గప్రకాశకథ : ఈ ఆరోగ్యబోధిని ప్రథమపాఠశాలలలో చదువు బాలురకుపయోగమునకుగాను సులభశైలిలో వ్రాయఁబడి ఇండియాలో అనుభవముగల వైద్య శిఖామణులచే అంగీకరింపఁబడినది.- Madras : Macmillan and Co., Limited, 1916.

2 volumes :ports. ;18 cm.

Record no. 502

Ārōgyamārgaprakāśakatha : Ī ārōgyabōdhini prathamapāṭhaśālalalō caduvu bālurakupayōgamunakugānu sulabhaśaililō vrāyam̐baḍi Iṃḍiyālō anubhavamugala vaidya śikhāmaṇulacē aṃgīkarimpam̐baḍinadi.- Madras : Macmillan and Co., Limited, 1916.

2 volumes :ports. ;18 cm.

Record no. 502

35 mm microfilm

Image placement: IA (IIA) IB IIB   Date filming began:

ఆరోగ్యమార్గప్రకాశిక

రెండవపుస్తకము

ఆరోగ్యబోధిని

ప్రథమపాఠశాలలలో చదువు

బాలురకుపయోగమునకుగాను సులభశైలిలో

వ్రాయఁబడి

ఇండియాలో అనుభవముగల

వైద్యశిఖామణులచే

అంగీకరింపఁబడినది.

MACMILLAN & CO., LIMITED
MADRAS, BOMBAY, CALCUTTA AND LONDON

1916

Price, 6½ Annas.] [వెల, ౬½ అణాలు.

విషయసూచిక.

మూడవ భాగము.


నాలుగవ భాగము.

ఆరోగ్యమార్గప్రకాశకథ.

రెండవ పుస్తకము.

మూడవ భాగము.

పాఠము 1.



ఎలుకలను పట్టుట.

రెండవ భాగమునందు ఆరోగ్యదేశమును గురించి మీరు చదివితిరి. ఆరోగ్యసంబంధమగు చట్టములును

విధులును అనేకములు ఆ దేశమందు ఆచారముగ ఉండెను. వాని ప్రకారము అక్కడి జనులు నడుచుకొనుచుండిరి. అందుచే అచ్చటి జనులు ఆరోగ్యముగాను సుఖముగాను ఉండినట్లు మీరు తెలుసుకొంటిరి. ఆ విధులను నేర్చుకొనుటకు వారియొక దేశపు యువరాజును అతని తండ్రి పంపినట్లుకూడ చదివితిరి. అతను కోరినట్లు ఆరోగ్య దేశపు మహారాజు తన వైద్యులలో ఒక బుద్ధిమంతుని అతని దేశమునకు పంపెననియుకూడ మీకు తెలుసును. కలరా, జ్వరము, మశూచికము రాకుండుటకును, వచ్చినపుడు వీనిని మాన్పుటకు చేయవలసిన పనులను గురించియు, దేశమును పరిశుభ్రముగనుంచుటను గురించియు, క్వైనాను చేయు విధమును గురించియు, దోమలవలన మన్యపు జ్వరము కలుగుటను గురించియు, రాజునకు ఆ వైద్యుడు చెప్పిన సంగతులను మీరు నేర్చుకొంటిరి.

ఈ విధముగ ఒకటి రెండు వారములు గడచెను. తర్వాత ఒకనాడు వైద్యుడు రాజుదగ్గరకు వచ్చెను.

రాజు:—(వైద్యుని జూచి) వైద్యశాస్త్రజ్ఞుడా! మనుష్యులకు బొబ్బరోగము (ప్లేగు) ఎట్లు తగులుచున్నది?

వైద్యుడు:—బొబ్బరోగము ఎలుకలకు మొదట తగులును. ఎలుకలనుండి మనుష్యులకు వచ్చును. ఒక పట్టణమందుగాని, గ్రామమునందుగాని ఎలుకలు లేనియెడల అచ్చటి జనులకు బొబ్బరోగము రాదు.

రాజు:—బొబ్బరోగము ఎలుకల సంబంధమగు జాడ్యమనియు ఎలుకలనుండి మనుష్యులకు వచ్చుననియు ఎప్పుడు కనిపెట్టిరి?

వైద్యుడు:—అనేక వేల సంవత్సరములకు ముందే బొబ్బరోగము ఎలుకల సంబంధమగు జాడ్యమనియు ఎలుకలనుండి మనుష్యులకు వచ్చుననియు తెలిసికొనిరి. అనేక ప్రాత గ్రంథములలో ఈ విషయమును వ్రాసియున్నారు; ఒక గొప్ప కలీఫాను (మహమ్మదీయ గురువును) గురించిన కథ ఒకటి ఉన్నది. ఈ విషయము పూర్వకాలమందే తెలియునని ఆ కథవలన మనము నేర్చుకొనుచున్నాము. దేవరవారికి ఇష్టమున్నయెడల, ఆ కథను చెప్పెదను.

రాజు:—ఆ కథను చెప్పుము.

వైద్యుడు:—కలీఫా, బొబ్బరోగము, ఎలుకలు వీనిని గురించిన కథ ఇదియే.

అనేకవందల సంవత్సరములకు ముందు ఒక గొప్ప నగరమందు ఒక కలీఫా యుండెను. అతడు మంచి బుద్ధిమంతుడు. ఈ కథ జరిగినకాలమందు అతని దేశములో బొబ్బరోగము కనబడెను. కలీఫానగరమునకు చుట్టుప్రక్కల నుండు గ్రామములకు ఆ జాడ్యము వ్యాపించెను.

ఆ రోగము తన నగరమునకు వచ్చినయెడల అనేకులు చనిపోవుదురనియు పట్టణమంతయు జనులులేనిదిగ అగుననియు అతనికి తెలియును. అందుచే అతడు మిగుల

దుఃఖముతో ఉండెను. తన మంత్రిని పిలిపించి అతనితో ఇట్లు చెప్పెను:—

కలీఫా:—ఈ జాడ్యము మన పట్టణమునకు మిక్కిలి దగ్గర వ్యాపించుచున్నది. దానిని రాకుండ ఆపకపోయినయెడల కొన్ని వారములలో మన పట్టణమున బొబ్బరోగము వ్యాపించును. కనుక ఈ రోగము మన పట్టణమునకు రాకుండునట్లు ఏమి చేయవలెనో చెప్పుము.

మంత్రి:—కలీఫా ఇంతవరకు ఎప్పుడును ఈ రోగమును నేను జూడలేదు. కనుక దీని స్వభావము నాకు ఏమియు తెలియదు. చీనా టిబేట్టు దేశములందు జనులు విశేషముగ బొబ్బరోగముచే బాధపడుచుందురని చెప్పుదురు. ఆ తూర్పు దేశములందు తిరిగిన ఒక బాటసారి కొన్ని దినముల క్రిందట ఈ పట్టణమునకు వచ్చెను. అతడు మిక్కిలి తెలివి గలవాడు. బాగుగ చదివినవాడు. ఆ బాటసారి మన పట్టణమును వదలియుండనియెడల బొబ్బరోగము ఇక్కడకు రాకుండచేయు మార్గమును అతను చెప్పగలడు. అతని బసకు మనిషిని పంపి అతడున్నాడేమో కనుగొనెదను.

ఆ బాటసారి పట్టణమునందే ఉన్నట్లు మంత్రికి సమాచారము తెలిసెను. మంత్రి అతనిని పిలిపించి కలీఫా యొద్దకు పిలుచుకొనిపోయెను.

కలీఫా:—(బాటసారిని చూచి) ఓ బాటసారీ! ఇతర దేశములందు బొబ్బరోగము విశేషముగ ఉన్నదా? ఆ

రోగము ఈ పట్టణమునకు రాకుండ ఏమి చేయవలెనో దయచేసి చెప్పుము.

బాటసారి:— ఇతరదేశములందు బొబ్బరోగమును విశేషముగ జూచితిని. నేను చెప్పినప్రకారము మంత్రి చేయవలసినట్లు మీరు ఆజ్ఞాపించవలసినది. అట్లు చేసినయెడల ఈ పట్టణమునందు బొబ్బరోగము రాదని నేను నిశ్చయముగ చెప్పగలను.

కలీఫా:—నీవు మిక్కిలి సాహసమైన మాటలు మాట్లాడితివి. అయినను నీవు చెప్పినదంతయు మంత్రి చేయును. ఈ పట్టణమందు బొబ్బరోగము రాకుండ చేసినయెడల విశేష ధనమును నీకు ఇచ్చెదను. లేనియెడల నీకు హాని కలుగును.

బాటసారి:—ఈ పట్టణమందు రత్నాలవర్తకులు ఎందఱు ఉన్నారు.

మంత్రి:—అయిదువందలకంటె ఎక్కువమంది ఉన్నారు.

బాటసారి:—మిక్కిలి భాగ్యవంతులగు రత్నాలవర్తకులలో రెండువందలమందిని పిలిపించుము. ప్రతివారును కలీఫావద్దకు ఒక వజ్రమును తెచ్చునట్లు ఉత్తరువుచేయుము. ఆ వజ్రము అలసందె ధాన్యపు గింజంత ఉండవలెను. అది మిక్కిలి ప్రకాశముగలదిగాను ఎక్కువ విలువగలదిగాను ఉండవలెను.

బాటసారి చెప్పినప్రకారము ఆ మంత్రి నడచుకొనెను. వర్తకులు రెండువందల వజ్రములను కలీఫావద్దకు తెచ్చిరి.

పట్టణమునుండి బ్రతికియున్న ఎలుకలను రెండువందలను తెప్పించమని బాటసారి మంత్రితో చెప్పెను. ఒక్కొక్క యెలుకను ఒక్కొక్క పంజరములో ఉంచి తేవలసినట్లు కూడ ఉత్తరువుచేసెను.

బాటసారి ఒక పంజరములోనుండు ఎలుకను బయటికి తీసెను. దాని పొట్టమీది చర్మమును మంచి పదునైన కత్తితో మిక్కిలి నేర్పుతో కొంచెము కోసెను. చర్మము లోపలికి ఒక వజ్రమును దోపి ఆ యెలుకను మఱల పంజరములో నుంచెను. ఇదేప్రకారము రెండువందల యెలుకల చర్మములో వజ్రములను దోపి ఆ యెలుకల మఱల పంజరములో నుంచెను. కొంచెము ధాన్యమును, నీటిని, ప్రతి పంజరమందు ఉంచునట్లును, ఈ పంజరము లన్నిటిని ఒక గదిలో పెట్టి తలుపును మూసి ముద్రవేసి ఆ గదిని కాపాడుటకై రక్షకభటులను ఉంచునట్లును, బాటసారి మంత్రికి ఆజ్ఞచేసెను. బాటసారి చేసిన పనులకు మంత్రి ఆశ్చర్యపడెను. అయినను అతడు చెప్పినట్లే చేసి గదికి ముద్రవేసి తాళముచెవిని తన వద్దనే పెట్టుకొనెను.

రెండు రాత్రులైన పిదప బాటసారి నడిరాత్రి మంత్రి దగ్గరకు వచ్చెను.

బాటసారి:—నీవు లేచి నమ్మకముగల పదిమంది బానిసవాండ్రను పిలిపింపుము. వారిని నాతో తీసికొనివచ్చి ఆ పంజరములున్న గది తలుపులు తీయుము. బానిసవాండ్రలో ఒకరిని మనతో దీపము తెమ్మని ఆజ్ఞాపించుము.


బాటసారి చెప్పిన ప్రకారము మంత్రి చేసెను. వారు గదివద్దకు వచ్చిరి. తలుపు ముద్రలువేసిన ప్రకారము ఉండెను. ముద్రలను పగులగొట్టి తలుపును తెరువమని బాటసారి ఉత్తరువుచేసెను. అందరును గదిలోనికి వెళ్లిరి. బాటసారి అప్పుడు దీపపు వెలుతురున ఎలుకలను చూడగా వాని గాయములు మాని వజ్రములు చర్మములోనుండెనని కనుగొనెను. "ఒక్కొక్క బానిసె యిరువది పంజరములను పుచ్చుకొని నాతో పట్టణములోనికి వచ్చునట్లు ఉత్తరువుచేయుము" అని బాటసారి మంత్రితో చెప్పెను. మంత్రియు, యెలుకల పంజరములను తీసికొనిన పదిమంది బానిసవాండ్రును బాటసారితో పట్టణపు వీధులలోనికి పోయిరి. కొంచెము దూరము పోగానే బాటసారి ఒక బానిసచేతనున్న పంజరము తీసికొని దానిని తెరచి లోపలనున్న ఎలుకను వదలివేసెను. అప్పుడది చీకటిలోనికి పరుగెత్తిపోయెను. తర్వాత బాటసారి పట్టణమందలి ప్రతి వీధికిని పోయి ఒక్కొటొక్కటిగా ఎలుకలన్నిటిని వదలివేసెను. మంత్రియు బానిసవాండ్రును బాటసారి చేసిన పనులకు ఆశ్చర్యపడిరి. మఱునాటి ఉదయమున బాటసారి మంత్రివద్దకు వచ్చెను.

బాటసారి:—ఈ పట్టణమందు రెండువందల ఎలుకలను వదలియున్నాము. ప్రతి ఎలుక పొట్టక్రిందను ఒక వజ్రమున్నది. అది అలసందధాన్యపు గింజంత ఉన్నది. అది మిక్కిలి ప్రకాశముగలది. ఎక్కువ విలువ వజ్రము. ఈ

ఎలుకలలో ఒక్కదానిని చంపి దాని పొట్టక్రిందనుండు ఆ వజ్రమును ఎవరు కనుగొనుదురో వారు దానిని దాచి యుంచుకొనవచ్చును" అని ఊరివారికందరికి తెలియునట్లు దండోరా వేయించుము.

ఈ దండోరాను విన్నవారిలో అనేకులు నవ్విరి. అటువంటి పని జరిగియుండదని కూడ నమ్మిరి. అయినను కొందరు బీదవాండ్రు ఎలుకలను వెదకి చంపుచు వజ్రములను సంపాదించుకొనుటకు ప్రారంభించిరి. ఆ రోజు సాయంత్రము ఒక ఎలుకను చంపగా ఒక బీదవానికి వజ్రము దొరకెను. వాడు అప్పుడే దానిని అమ్మి ఒక ఇంటిని కొనెను. ఈ సంగతి ఊరియందు తెలియగానే జనులకందరికి తత్తరపాటు గలిగెను. గుమాస్తా తన పనిని మానివేసెను. వర్తకుడు తన దుకాణమును చాలించెను. గొప్పవారును, చిన్నవారును, భాగ్యవంతులును, బీదవారును, యజమానుడును, బానిసయు, మగవాండ్రును, ఆడవాండ్రును, బిడ్డలును, అందరును తమ పనులను మాని ఎక్కువ తొందరతో ఎలుకలను వేటాడి వానిని చంపి వాని కడుపుక్రిందనుండు వజ్రములను సంపాదించుటకు ప్రారంభించిరి. ఇంటి కప్పులలోనుండు ఎలుకలను పయికి దోలిరి. గోడలక్రిందను, నేలక్రిందను, ఉన్న ఎలుకలను కొందరు పట్టిరి. కొందరు ధాన్యపు గాదెలలోని ఎలుకలను వెదకితీసిరి. మరికొందరు కాల్వలలో నీరు పెట్టి అక్కడనున్న ఎలుకలను

కొందరు పట్టుకొని, వానిని రాళ్లతోను, కర్రలతోను, కత్తులతోను చంపిరి.



ఎలుకలును, ఒక ఎలుకల బోను.

కొన్ని దినములవరకు పట్టణమందు ఇతరపనులు నిలిచిపోయెను. బరువును మోసికొనిపోవుటకు కూలివాడుకూడ దొరకలేదు. ఎలుకల బోనులను చేసిన వడ్రంగులకు పని హెచ్చయి విశేష ద్రవ్యము దొరికెను. ఒంటెల ఖరీదునకు పిల్లులను అమ్మిరి. ఒక్క వారములోపల అనేకవేల ఎలుకలను చంపిరి. ఇంకను ప్రతిదినము అయిదు, ఆరు, ఏడెనిమిది వజ్రములు దొరుకుచున్నట్లు సంగతి తెలియుచుండెను. రెండు వారములయిన తర్వాత పట్టణమందు ఒక్క ఎలుక అయినను కనుపడలేదు. అయినను వజ్రములలో అనేకము ఇంకను కనబడలేదు. కనుక ఒక ఎలుక కనబడినతోడనే దానిని పట్టుకొని చంపుచుండిరి. పట్టణములోని ఎలుకలన్నియు నశించినతర్వాత చాటసారి కలీఫావద్దకు పోయెను.

బాటసారి:—ఈ పట్టణములోనికి బొబ్బరోగము రాకుండ ఆపుదునని నేను చెప్పలేదా? బొబ్బరోగము కొంచెము కూడ వచ్చునని భయపడకుము. పట్టణమందలి ఎలుకలను అన్నిటిని జనులు చంపునట్లు చేసితిని. బొబ్బరోగము ఎలుకలవలన కలుగు రోగము. పట్టణమందలి ఎలుకలకు బొబ్బరోగము మొదట తగులును. తర్వాత ఎలుకలనుండి జనులకు వ్యాపించును. పట్టణమందు ఎలుకలు లేనియెడల బొబ్బరోగము అచ్చటి జనులకు రానేరదు. అచ్చటి ప్రజలు క్షేమముగ ఉందురు. అయినను చాలకాలము ఆ పట్టణమునకు బొబ్బరోగము రాలేదు. దీనివలన బాటసారి చెప్పిన మాటలు నిశ్చయమని కలీఫా తెలిసికొనెను. అప్పుడు అతనికి తన ధనాగారమునుండి విశేష ధనమును ఇయ్యుమని కలీఫా ఆజ్ఞాపించెను. బాటసారి ఆ పట్టణమందే ఉండెను. జనులందరు అతనికి మర్యాదచేసిరి. అతడు విశేషకాలము బ్రతికెను. ఆ పట్టణమునకు వచ్చినవారు ఎవరైన "ప్రజలచేత ఇంత మర్యాదను పొందుచు ఇక్కడ ఉండునట్టి ఇతడు ఎవరు?" అని అడిగినయెడల వారిట్లు జవాబుచెప్పుచుండిరి. "ఈ పట్టణములోనికి బొబ్బరోగము వచ్చునట్టి సమయమందు ఈ ప్రసిద్ధికెక్కిన బాటసారి పట్టణమందలి ఎలుకలను అన్నిటిని యుక్తిచే చంపించెను. దీనిచే భయంకరమగు బొబ్బరోగమునుండి జనులను కాపాడెను."

రాజు:—(వైద్యుడి కథను చెప్పినమీదట వైద్యునితో) బొబ్బరోగముగల ఎలుకనుండి ఏవిధముగ మనుష్యునకు ఆ రోగము వచ్చునో చెప్పుము.

వైద్యుడు:—మరియొక దినమున దేవరవారు నన్ను పిలిపించినయెడల బొబ్బరోగము తగిలిన ఎలుకలనుండి మనుష్యులకు ఆ రోగము ఎట్లు వ్యాపించునో బొబ్బరోగమునుండి కాపాడుకొనుటకు జనులు ఏమి చేయవలెనో విన్నవించెదను.

పాఠము 2.


ఎలుకలును, దోమలును, ప్లేగును.

మరునాడు వైద్యుడు రాజువద్దకు వచ్చెను.

రాజు:—(అతనిని చూచి) ప్లేగువలన బాధపడు ఎలుకలనుండి మనుష్యులకు ఆ రోగము ఎట్లు వచ్చునో చెప్పుము.

వైద్యుడు:—నెత్తుటిలో నివసించు కొన్ని బీజములచే బొబ్బరోగము కలుగును. ఒక ఎలుకకు బొబ్బరోగము తగిలినప్పుడు దాని రక్తములోని ప్రతి చిన్నబిందువునందును ఈ బీజములు అనేకవేలు ఉండును. అన్ని ఎలుకలమీదను మిణ్ణల్లులు ఉండును. ఇవి ఎలుకలను కొరుకుచు నెత్తురును పీల్చుచుండును. బొబ్బరోగము తగిలిన ఎలుకను మిణ్ణల్లులు కొరికినపుడు అవి పీల్చు రక్తములో అనేకవేల ప్లేగు బీజములును లోపలికి తీసికొనును. ఆ

ఎలుక చావగానే ఆ మిణ్ణల్లులు దానిని వదలి వేరు ఎలుకలమీదికి వెళ్లి వానిని కొరుకును. కొరుకుటకు వేరు ఎలుకలు దొరకనపుడు అవి మనుష్యులమీదికి వెళ్లి వారిని కొరుకును.



అనేక రెట్లు పెద్దదిగ చూపబడిన ప్లేగు బీజములు

రాజు:—బొబ్బరోగము ఎలుకలకు మొదట తగులును. వానిమీదనుండు మిణ్ణల్లులు వాని రక్తమును, ప్లేగు బీజములను పీల్చును. ఈ మిణ్ణల్లులు మనుష్యులను కొరికిన యెడల జనులకు ప్లేగు తగులును. నేను గ్రహించినది సరేనా?

వైద్యుడు:—అవును సరిగానే గ్రహించితిరి.

రాజు:—ఎలుకలమీదనుండు మిణ్ణల్లులు మనుష్యుల మీదనుండు మిణ్ణల్లులును ఒకటియేనా?

వైద్యుడు:—కాదు. ఎలుకలమీద నుండునవి ఒక జాతి; మనుష్యులమీద నుండునవి వేరొక జాతి.

రాజు:—ఎలుకలమీదనుండు మిణ్ణల్లులు వేరు జాతివి అయినయెడల అవి మనుష్యులను ఎందుకు కొరుకును?

వైద్యుడు — ఎలుకలమీదనుండు మిణ్ణల్లులు, కొరుకుటకు వేరు ఎలుకలు దొరికనప్పుడే, మనుష్యులను కొరుకును

రాజు —కన్నములో ఒక ఎలుక ఉన్నప్పుడు దానిలోనే మరికొన్ని ఎలుకలుకూడ ఉండును ఒక ఎలుక బొబ్బరోగమువలన చనిపోయినప్పుడు దానినుండి వచ్చు మిణ్ణల్లులు మిగిలిన ఎలుకలను చేరక మనుష్యులమీదికి ఎందుకు వచ్చును?

వైద్యుడు —బొబ్బరోగమున చచ్చిపోవు ఎలుక మిగిలిన ఎలుకల మధ్యను సాధారణముగ తన కన్నములో [illegible]వదు కన్నమును వదలి వయికి వచ్చి నేలమీద చచ్చును. దానిమీదనుండు మిణ్ణల్లులు అప్పుడు నేలమీదకు వ్యాపించి ఆ గదిలో నివసించు మనుష్యుల పాదములమీదకు గాని శరీరములమీదకుగాని తర్వాత చేరును

రాజు —ప్లేగు తగిలిన ఎలుకలు తమ కన్నములను వదలినతర్వాత చచ్చునని మా గ్రామములందలి ప్రజలు చెప్పగా నేను విన్నాను ఇది విచిత్రమైన సంగతి. చచ్చుటకు అవి తమ కన్నములనుండి ఎందుకు వయికి వచ్చునో తెలియునా?

వైద్యుడు —తమ రోమజాతులలో చేరియుండు జంతువులకు ఏ కీడును రాకుండునట్లు చేయు విషయములందు



తేనెటీగలును వాని ఇండ్లును.

ఎక్కువబుద్ధియు, నేర్పరితనమును జూపు మృగములు అనేకములు కలవు. ఓ రాజా! చీమలనుగూర్చియు తేనెటీగలనుగూర్చియు కొంత తెలిసికొనుము. తాము నివసించు ఇండ్లను ఏర్పాటుచేసికొనుటయందును వానిని కట్టుటయందును ఎంత తెలివిని కనుపరచుచున్నవి! తమ జాతిలో చేరిన జీవుల క్షేమమును వృద్ధిపరచు విధులను అనుసరించి అవి ఎంత జాగ్రత్తతో నడుచుకొనుచున్నవి! ఎలుకలుగూడ నదేప్రకారము నడుచుకొనును. ఒక ఎలుక బొబ్బరోగమువలన చచ్చినయెడల దానిమీదనుండు మిణ్ణల్లుల వలన తమకు అందరికిని ఆ రోగము వ్యాపించునని వానికి తెలియును. కనుక బొబ్బరోగము తగిలిన ఎలుకను తమ

కన్నమునుంచి బయటికిత్రోసి నేలమీద అది చచ్చునట్లు చేయును.

రాజు:—ఆహా! మృగములకున్నంత తెలివి మనుష్యునికికూడ నున్న యెడల ఎంత బాధ, ఎన్ని రోగములవలని చావు తప్పును!


వైద్యుడు:—తక్కువజాతి మృగములకున్న తెలివి మనుష్యునికి లేకున్నను, వానికి లేని కొన్ని శక్తులు అతనికి ఉన్నవి. అతనికి బుద్ధియు సంకల్పము ఉన్నవి. బుద్ధిని ఉపయోగించి రోగములు ఎట్లు కలుగుచున్నవో కనుగొనవచ్చును. వానినుండి తప్పించుకొను జ్ఞానమునుకూడ సంపాదించుకొనవచ్చును. సంకల్పము అను రెండవ శక్తిచే ఆ జ్ఞానమును ఉపయోగించి రోగములనుండి తప్పించుకొనవచ్చును.

రాజు:—నీవు చెప్పునది నిశ్చయము. రోగములనుండి తప్పించుకొను జ్ఞానము నా ప్రజలకు కలిగినతర్వాత వారు తమ సంకల్పములచే ఆ జ్ఞానమును ఉపయోగించి దేశమందు రోగము లేకుండుటకు ప్రయత్నించుదురుగాక! అయితే ఒక గ్రామమునుండి మరియొక గ్రామమునకు ఈ బొబ్బజాడ్యము ఎట్లు వ్యాపించుచున్నదో తెలియపరుచుము

వైద్యుడు:—ఒక గ్రామమునుండి మరియొక గ్రామమునకు ఈ క్రిందజెప్పు విధముగా బొబ్బరోగము వ్యాపించును. ప్లేగు తగిలిన ఒక గ్రామమునుండి ఒకడు బయ

చేరి ప్లేగులేని మఱియొక గ్రామమునకు వెళ్లును. ప్లేగు తగిలిన ఎలుకలనుండి వచ్చిన కొన్ని మిణ్ణల్లులు అతని దుస్తులలోగాని, పడకగుడ్డలలోగాని ఉండవచ్చును. ఈ మిణ్ణల్లులలో ప్లేగుబీజములు ఉండును.

♂ Pulex cheopis



ఎలుకమీదనుండు మిణ్ణల్లి—అనేకరెట్లు ఎక్కువగ చూపబడినది.

అతను రెండవ గ్రామమునకు పోగానే తన పడకను ఒక ఇంటియందు ఉంచును. నేలమీద దానిని పరచినప్పుడు రోగబీజములుగల మిణ్ణల్లులు ఆ పడకను వదలి ఆ ఇంటియందలి కొన్ని ఎలుకలను కొరుకును. అప్పుడు ఈ ఎలుకలకు ప్లేగు తగులును. ఎలుకలన్నియు చచ్చిన తర్వాత ఆ గ్రామమందలి మనుష్యులకు ప్లేగు తగులుట ఆరంభించును. పడకలోనుండు మిణ్ణల్లులు పడకపై పండుకొనువానినే తరుచుగా కొరకవచ్చును. ఆ గ్రామమును వదలుటకు పూర్వమే ప్లేగు తగిలిన ఎలుకలమీది మిణ్ణల్లులే అతనిని కొరికియుండవచ్చును. అందువలన ప్లేగు తగిలి అతను చనిపోవును.

రాజు:—ప్రజలు బొబ్బరోగమునుండి ఎట్లు తప్పించుకొనగలుగుదురో చెప్పుము?

వైద్యుడు:— దేవరవారు మరియొకదినము నన్ను పిలిపించినయెడల బొబ్బరోగము రాకుండ జనులు ఏవిధముగ తప్పించుకొనవచ్చునో నేను మనవిచేసెదను.

పాఠము 3.

ప్లేగును పోగొట్టు ఉపాయములు.


మరునాడు వైద్యుడు రాజుగారివద్దకు వచ్చెను.

రాజు:—(వైద్యునితో) ప్లేగునుండి తప్పించుకొనుటకు జనులు ఏమిచేయవలెనో చెప్పుము?

వైద్యుడు:—బొబ్బరోగము తగలకుండ జనులు కాపాడుకొను మార్గములు అయిదు ఉన్నవి.

మొదటిది:—ఎలుకలులేని గ్రామమందు బొబ్బరోగము వ్యాపించదు. కనుక గ్రామమందలి ఎలుకల సంఖ్యను మిక్కిలి తక్కువగ ఉంచవలెను.

రెండవది:—ప్లేగు తగిలిన గ్రామమునుండి ప్లేగును ఎవరైన తీసికొనిపోయినగాని ప్లేగులేని గ్రామమందలి ఎలుకలకు ఆ రోగము తగులదు. కనుక ప్లేగు తగిలిన గ్రామమునుండి ప్లేగు తగులని గ్రామమునకు జనులను పోనీయగూడదు.



మనుష్యుడును, ఎలుకలును.

మూడవది: — ఎలుకలకు బొబ్బరోగము తగిలినను వానిమీదనుండు మిణ్ణల్లులు జనులను జేరి వారిని కొరకకయే జనులకు ఆ రోగము రాదు. కనుక ఎలుకలలో ప్లేగు కనబడగానే వానిమీదనుండు మిణ్ణల్లులు తమను చేరకుండునట్లు తమ ఇండ్లను వదలి పొలములలో నివసించవలెను. ఇండ్లలోని మిణ్ణల్లులన్నిటిని వేడిమిచే చంపిన

తర్వాత మఱల ఇండ్లలోనికి రావచ్చును. అంతకుముందు రాకూడదు.

నాల్గవది: — ఒక పట్టణమందుగాని గ్రామమందుగాని బొబ్బరోగము కనబడినను ప్లేగు టీకాలను వేయించుకొననివారిలోకంటె ప్లేగు టీకాలను వేయించుకొన్నవారికి మిక్కిలి తక్కువ హాని కలుగును. కనుక ప్రతివారును ప్లేగు టీకాలను వేయించుకొనవలెను.

అయిదవది:—జనులకు ప్లేగు తగిలినవెంటనే తొందరపడక ఓర్పుగలిగి మంచి వైద్యసహాయమును, చికిత్సను పొందినవారిలో అనేకులకు రోగము కుదురును. కనుక ప్లేగు తగిలినవారందరు ఓపిక గలిగియుండవలెను, మంచి వైద్యసహాయమును పొంది, చికిత్సను చేసికొనుటకు కూడ ప్రయత్నించవలెను.

రాజు:—ఎలుకలు లేనిదే బొబ్బరోగము వ్యాపించదు. కనుక ఎలుకల సంఖ్యను తగ్గించవలసినదని నీవు చెప్పితివి. దేనివలన ఒక స్థలమునందు ఎలుకలు విశేషముగ చేరునో నాకు చెప్పుము.

వైద్యుడు: — ఎలుకలకు ధాన్యము ఇష్టము. కనుక ధాన్యము ఉండుచోట ఎక్కువ ఎలుకలు చేరును. ఇంటిలో ధాన్యమును అజాగ్రత్తగ ఉంచినయెడల ఎలుకలు అచ్చట విశేషముగ ఉండును. కనుక ఎలుకలు దూరుటకు వీలులేని గాదెలందు ధాన్యమును నిలువచేసికొనవలెను. ఇం


కను జనులు కాపురము ఉండునట్టియు నిద్రపోవునట్టియు గదులందు ధాన్యపుగాదెలను ఉంచకూడదు. ఇంటి ముంగిలియొక్క ఒక ప్రక్కన ఉండు వెల్లడి వసారాలో ధాన్యపుగాదెలను ఉంచవలెను. జనులు కాపురముండు గదికి దూరముగ ఈ వసారా ఉండవలెను. తినునట్టి వస్తువులు ఇక్కడక్కడ పడియున్న గదులందుకూడ ఎలుకలు విశేషముగ చేరును. కనుక ఎలుకలు అందుకొనుటకు వీలులేకుండ ఆహారపువస్తువులను ఉంచవలెను. ఇంతేకాక ఎలుకలకు మురికిపై ఇష్టము. మురికికుప్పలక్రింద రంధ్రములను చేసికొని ఎలుకలు బ్రతుకుచుండును. కాబట్టి అన్ని ఇండ్లను, గ్రామములను శుభ్రముగా ఉంచవలెను. వానియందుగాని, వాని దగ్గరగాని చెత్తకుప్పలు లేకుండ చూడవలెను.

బొబ్బరోగములు కలుగజేయుడమేకాక ధాన్యమును బస్తాలను తినుటవలనకూడ జనులకు ఎలుకలు ఎక్కువ నష్టమును కలుగజేయుచున్నవి. ఒక ఎలుక వారమునకు నాలుగు చటాకులవంతున ధాన్యమును తిన్నయెడల సంవత్సరమునకు అది 12 సేర్లు తినును. 1 సంవత్సరమునకు ఒక ఎలుక 12 సేర్ల ధాన్యమును తినినయెడల నలుబది ఎలుకలు చేరి 480 సేర్లు లేక 40 మణుగుల ఎత్తు ధాన్యమును తినును. అనేక యిండ్లయందు నలుబది ఎలుకలైనను ఉండును. ఈవిధముగ ఎలుకలవలన విశేష నష్టము కలుగుచున్నది. మనుష్యుడును, ఎలుకలను గురించి పురాతనమైన కథ యొకటి కలదు. ఒకప్పుడు ఒక

మనుష్యుడు తన యింటిలోనున్న ఎలుకలు అన్నిటిని పిలిచెను. అవి వచ్చినవెంటనే వానిని జూచి,

మనుష్యుడు:—ఓ ఎలుకలారా! మీరు వచ్చి నా యింటియందు ఎందుకు నివసించియున్నారు? నా సంసారమును పోషించుటకు నేను పొలమునందు కష్టపడి ధాన్యమును పండించుకొనుచున్నాను. ఆ ధాన్యమునందు పదియవ భాగమును మీరు ప్రతి సంవత్సరము తినుచున్నారు.

ఇది విని ఎలుకలన్నియు నవ్వెను.



ఇంటి ఎలుక.


ఎలుకలు:—నీ యింటియందలి ధాన్యములో పదియవ భాగమును మేము తినుచున్నామని ఎందుకు విసుగుకొనెదవు? మేము నీ యింటికి బొబ్బరోగమును తెచ్చి ఏటేట నీ కుటుంబములో పదిమందికి ఒకరువంతున చనిపోవునట్లు చేయుటలేదా? మేము నీ ధాన్యమును తినుట నిజమేకాని నీవు పోషింపవలసిన జనమునుకూడ తగ్గించుచున్నాము.

అప్పుడు అతనికి కోపమువచ్చి ఇంటినుండి ఎలుకలను అన్నిటిని వెడలగొట్టెను. అతని ఇంటిలోనికి ఎలుక ఏదైనను రాగానే అతను దానిని చంపుచుండెను. అప్పటినుండి

అతని ధాన్యము తగ్గలేదు. అతని సంసారములోనివారు ఎవరును ప్లేగువలన చావలేదు.

రాజు:—(వైద్యుడు పైకథను చెప్పినతోడనే) తన యింటి యందలి ఎలుకలను ఎందుగాని ఎట్లు నశింపజేయవచ్చును?

వైద్యుడు:—ఎలుకలను బోనులచే పట్టుకొనిగాని విషము పెట్టిగాని చంపవచ్చును. సంవత్సరము పొడుగునను బోనులను ఉపయోగించుచుండవలెను. బియ్యపు రొట్టె ముక్క, నెయ్యి, చక్కెర, కాయగూరలు, నేతిలో వేచిన మాంసము మొదలగునవి ఎలుకలకు ఇష్టము. వానికి ఇష్టమగు ఆహారమును బోనులో ఉంచుటవలన ఎలుకలను రప్పించవచ్చును. ఎలుక మిక్కిలి టక్కులమారి. కనుక ప్రతి రాత్రియు క్రొత్త ఎరను పెట్టవలెను. కొంచెము తియ్యని చమురును బోనులకు రాచి వానిని శుభ్రముగ ఉంచవలెను. అగ్గిపుల్లల పైనుండు భాస్వరమును గోకి దానిలో పిండిని, బెల్లమును చేర్చి మాత్రలుగ చేసి ఎలుకలకు విష



నది ఎలుక.

ముగ పెట్టవచ్చును. లేదా ఎలుకలను చంపు విషమును తగరపు డబ్బీలలో తెప్పించవచ్చును. ఒక డబ్బీ విషము

నకు ఒక సేరు బెల్లమును గట్టిముద్ద అగుటకు కావలసినంత పిండిని కలపవలెను. ఈ ముద్దతో పదహారువందల మాత్రలు కట్టవచ్చును. సాయంత్రమున ఎలుకల కన్నములందును, ధాన్యపు గాదెలక్రిందను, ఇంకను ఎలుకలువచ్చు స్థలములందును ఈ మాత్రలను ఉంచుదురు. అయితే పిల్లులును ఇతర జంతువులును తిరుగు స్థలములందును వానిని ఉంచగూడదు. ఎందువల్లననగా అవి విషవస్తువులు. ఎలుకలు వచ్చి ఆ మాత్రలను అన్నిటిని తినువరకు వాటిని అచ్చటనే ఉంచవలెను.

రాజు:—ఈ విషము ఎలుకలను అన్నిటిని తత్క్షణమే చంపునా?

వైద్యుడు:—అట్లు జరుగదు. ఆ విషము ఎలుకలనన్నిటిని తత్క్షణమే చంపదు. కొన్ని తప్పించుకొనిపోవును. అవి త్వరలో వృద్ధి అయి ఎలుకల సంఖ్య మరల ఎక్కువ అగును. ఒక గ్రామమందు ఎలుకల సంఖ్యను తక్కువగ నుంచవలసినయెడల తప్పక నెలకొకసారి గ్రామములోని వారందరు ఒక్క రాత్రియందే తమ యిండ్లయందు ఎలుకలకు విషమును పెట్టవలెను

రాజు:—విషమును తిని ఎలుకలు చచ్చినపుడు మిణ్ణల్లులు వానిని వదలి ఇంటియందు ఉండువారిని కొరకవా?

వైద్యుడు:—అవి పుట్టినను హాని కలుగదు. ప్లేగుచే [illegible] చచ్చు ఎలుకలమీదినుండి వచ్చిన మిణ్ణల్లు [illegible]

జేయును. విషమువలన చచ్చిన ఎలుకలమీదినుండి వచ్చు మిణ్ణల్లులు వానిని కలుగజేయవు.

రాజు:—సాధారణముగ ఒక గ్రామమందు ప్లేగు ఒకసారి తగిలినయెడల ఆ గ్రామమందు ప్రతి చలికాలమునందు ప్లేగు సర్వసాధారణముగ వచ్చుచుండును.

వైద్యుడు:—అవును. ఈ సంగతి నిశ్చయమే. ప్లేగు బీజములు దాగియుండును. గనుక ప్రతి చలికాలమందును ప్లేగు కనబడుచుండును. ప్లేగు వ్యాపించుటకు అనుకూలమగు ఋతువు రాగానే దాగియున్న ప్లేగు బీజములు ఎలుకల నెత్తురులో ప్రవేశించును. ప్లేగువలన ఎలుకలు మొదట చచ్చును. అటుతర్వాత ప్లేగు మనుష్యులకు తగులును. గ్రామము శుభ్రముగాను ఎలుకలు లేకను ఉన్నయెడల ఈ స్థితి రానేరదు. ప్లేగు అక్టోబరు నవంబరు నెలలలో అధికమగును. కనుక సెప్టెంబరు నెలలో ఎలుకలకు విషము పెట్టుట అవసరము. వసంతఋతువునందుకూడ ప్లేగు విశేషముగ కనబడును. కనుక ఫిబ్రవరి నెలలోకూడ ఎలుకలకు విషము పెట్టవలెను.

రాజు:—బొబ్బరోగమువలన కలుగు నాశనమునుండి తప్పించుకొను మార్గములు అయిదు. వానిలో మొదటి దానిని నీవు చక్కగ నాకు చెప్పితివి. ఈ రోగము తగిలియుండు గ్రామమునుండి అట్టి రోగములేని గ్రామమునకు ఎవ్వరుగాని పోయి అక్కడి ఎలుకలందు ఈ వ్యాధిని [illegible] ఉండవలెననెడి రెండవ మార్గమునుకూడ

నీవు చెప్పితివి. కాని ఈ దేశమందలి జనులు అతిథులను మర్యాదచేయుట పుణ్యమని తలచెదరు. ఇది మిక్కిలి మంచి సంగతి. ఈ మర్యాదకు లోపము రాకుండ ఒక గ్రామములోని జనులు మఱియొక గ్రామమునుండి వచ్చు వారిని గ్రామములోపలికి ఏ విధముగ రాకుండ చేయవచ్చునో నాకు చెప్పుము.



గ్రామము వెలుపల కట్టబడు ఇండ్లు.

వైద్యుడు:—దానిని ఈ క్రిందివిధముగ జేయవచ్చును. ప్రతి గ్రామమందలి జనులును వారి గ్రామమునకు వెలుపల ఒకటి రెండు ఇండ్లను కట్టవలెను. ప్లేగు ఉన్న గ్రామము

నుంచి వచ్చినవానిని ఈ యింటియందు అయిదారు రోజులవరకు ఉండమనవలెను. ఈ కాలమునందు అతడు ప్రతిరోజు తన పడుకను దుస్తులను విప్పి గాలిలోను ఎండలోను వేయవలెను. సూర్యునియొక్క ప్రకాశమువలనను వేడిమివలనను అతని పడుకలోను, బట్టలలోను ఉండు మిణ్ణల్లులు చచ్చిపోవును. నాలుగైదు దినములైన తర్వాత అతను గ్రామములోనికి వచ్చినను భయముండదు.

పాఠము 4.

ప్లేగును పోగొట్టు ఉపాయములు. (శేషము.)

మరునాడు వైద్యుడు రాజుగారియొద్దకు మరల వచ్చెను.

రాజు:—(అతనితో) ప్లేగునుండి తప్పించుకొను రెండు మార్గములను నాకు బాగుగ ఇదివరకు తెలియచెప్పితివి. ప్రతి యింటియందు ఉండు ఎలుకలను అన్నిటిని చంపుట మొదటి పని. ప్లేగున్న ప్రదేశమునుంచి ఎవరినిగాని రానియ్యకుండుట రెండవ పని. ఈ రెండు విషయములు నాకు బాగుగ తెలిసినవి. గ్రామమునందలి ఎలుకలకు ప్లేగు తగిలినపుడు వానిమీాదనుండు మిణ్ణల్లులు మనలను కొరకకుండ చేసికొనుట మూడవ మార్గమని నీవు చెప్పితివి. ఇది ఎట్లు చేసికొనవచ్చునో నాకు బోధించుము.

వైద్యుడు:—ఒక గ్రామమందు ప్లేగువలన ఒక ఎలుక చావగానే ప్రతివాడును తన యింటిని వదలి పొలములలో

వెలుపల నివసించవలెను. ఎందువలన అనగా గ్రామమందలి ఎలుకలు ప్లేగువలన చచ్చునపుడు వానిమీాదనుండు మిణ్ణల్లులు ఎలుకలయొక్క శరీరములను వదలును. పిమ్మట అవి ఇండ్లయందలి నేలమీాదకు వచ్చి మనుష్యులను కొరుకుటకు సిద్ధముగా ఉండును. ఈ యిండ్లయందు మనుష్యులు ఉన్నయెడల కొన్ని మిణ్ణల్లులు వారిని కొరుకును. అప్పుడు వారికి ప్లేగు రావచ్చును.

రాజు:—ఇండ్లను వదలి పొలములలో కొన్ని వారములవరకు ఉండుట మిక్కిలి కష్టమని ప్రజలు అందురు.

వైద్యుడు:—ఇంటిలోనే యుండి ప్లేగువలన చనిపోయి ఇంటికి తిరిగి వచ్చునట్టి ఆశలేక శవముగా ఇంటినుండి వెడలుటకంటె కొన్ని వారములు పొలములలో నివసించి ప్రాణముతో ఇంటికి తిరిగివచ్చి బ్రదుకుట మంచిదని మీారు వారికి సెలవిండు.

రాజు:—అవును. నీవు చెప్పినది మిక్కిలి తెలివిగల విషయము. అయితే గ్రామమునకు బయట ఎన్నిరోజులు జనులు ఉండవలెను?

వైద్యుడు:—ఒక యింటియందు ఎలుకలు చచ్చినయెడల పదిరోజులకు తక్కువకాకుండ ఎవరును ఆ యింటియందు కాపురముండకూడదు. లోపలికికూడ పోకూడదు. పగటికంటె రాత్రియందు మిణ్ణల్లులు విశేషముగ కొరుకును. కనుక రాత్రులందు ఆ యిండ్లలోనికి పోవుట మిక్కిలి అపాయకరము. తప్పక పదిదినములవరకు ఇండ్లను

బయట జనులు ఉండవలెను. అయితే రెండు మాసముల వరకు బయట ఉండుట మంచి పద్ధతి.

రాజు: — అటుతర్వాత ఇండ్లలో వారు ప్రవేశించవచ్చునా? లేక ముందేమయినను ఇండ్లకు చేయవలెనా?

వైద్యుడు:—ఇండ్లయందలి మిణ్ణాల్లులను అన్నిటిని చంపక లోపల ప్రవేశించకూడదు. అన్ని గదులలోను మంటలువేసి మండుచున్న నిప్పులను మూలమూలలకును అంచులకును పరచవలెను. దీనిచే నేలమీదనుండు మిణ్ణాల్లులు అన్నియు చచ్చును. తరువాత ఎలుక కన్నములను పూడ్చివేసి గదులనన్నిటికి మట్టిపూత పూయవలెను. ఈ పనులన్నియును చేసిన తరువాతగాని ఆ యిండ్లు నివసించుటకు తగినవికావు.

రాజు:—ప్లేగు రాకుండ చేసికొను నాలుగవమార్గము టీకాలను వేయించుకొనుటయని నీవు సెలవిచ్చితివి.

వైద్యుడు:—అవును. ప్లేగున్న హిందూదేశపు భాగములందు ప్రతి సంవత్సరము అనేకవేలమంది ప్లేగు టీకాలను వేయించుకొనుచున్నారు. అట్లు టీకాలను వేయించుకొన్నవారిలో కొద్దిమందిమాత్రము బొబ్బరోగమువలన చనిపోవుచున్నారు. టీకాలను వేయించుకొననివారిలో చాలమంది చనిపోవుచున్నారు.

రాజు:—ప్లేగు టీకాలను వేయించుకొనుటవలన హాని ఏమైన కలుగునా?

వైద్యుడు:—టీకాలవలన ఏ హానియు కలుగదు. బాధ మిక్కిలి కొంచెము. ప్లేగువలన చచ్చుటకంటె కొంచెము బాధపడుట మంచిది. కనుక టీకాలను ప్రతివారును వేయించుకొనవలెను. ఈ టీకాలవలన చూపు బలహీనమగుననియు బలము తగ్గుననియు కొందరు అందురు. అది కేవలము అబద్ధము. ప్రతి సంవత్సరము వేలకొలది జనులు టీకాలు వేయించుకొని ప్రాణమును కాపాడుకొనుచున్నారు. వీరిలో ఎవ్వరికినిగాని ఏ హానియు కలుగుట లేదు. తెలివి లేనివారును చెడ్డవారునుమాత్రమే చూపు బలహీనమగుననియు బలము తగ్గుననియు కథలు చెప్పుదురు. టీకాలను వేయించుకొనుటచే ప్లేగు సాధారణముగ రానేరాదు. కనుక ప్లేగున్న దేశభాగమందు నివసించు జనులందరు టీకాలను వేయించుకొనవలెను.

రాజు: — బొబ్బరోగమువలన చావక తప్పించుకొను మార్గములను నాకు తెలిపితివి. వానిలో బొబ్బరోగము తగిలినవారు నెమ్మదిగానుండి మంచి చికిత్సను పొందుట అయిదవ మార్గమని నాకు చెప్పితివి.

వైద్యుడు:—అవును. చీకటి గదులలో నుండుటవలనను తగిన చికిత్స లేనందువలనను ప్లేగు తగిలినవారిలో అనేకులు చనిపోవుచున్నారు. ప్లేగు తగిలిన ప్రతివానిని ఇంటినుండి బయటికి తీసికొనిపోవలెను. ముంగిలిలోగాని ఇంటి కప్పుమీదగాని మంచిగాలి బాగుగ తగులుచోట పడకమీద అతనిని ఉంచవలెను. రోగిని చంపుటకు చీకటి సహాయ

పడును; వెలుతురును, మంచిగాలియు అతనిని కాపాడుటకు తోడ్పడును.

ప్లేగు తగిలినవారినందరిని మంచిగాలి వీచు స్థలమునకు తీసికొనిపోయి వారు బాగగువరకు రాత్రింబగళ్లు అచ్చటనే ఉంచవలెను. చీకటిగది మిక్కిలి అపాయకరమైనది. రోగి బయట ఉన్నప్పుడు వానికి ఉపచారము చేయువారికి ఏ హానియు కలుగదు. ప్లేగు తగిలినవారు బహు త్వరగా బలహీనులగుదురు. కనుక వారిని పడకమీదనే ఉంచవలెను. ఒక చోటనుంచి మరియొక చోటునకు వారిని కదల్చినయెడల వారు తత్క్షణము చనిపోదురు. ప్లేగు రోగులకు నిస్త్రాణ రాకుండుటకు పాలను, బలమునిచ్చు వస్తువులను వేసికాచిన చారును విశేషముగ నివ్వవలెను. చీకటి గదులలో నుంచినయెడల చనిపోవు ప్లేగు రోగులు పైనిచెప్పిన వానివలన చావునుండి తప్పించుకొనవచ్చును. ఇంతేకాక ప్లేగునకు పనికివచ్చు మంచి మందులు అనేకములున్నవి. కాబట్టి దగ్గర వైద్యుడు ఉన్నయెడల అతనిని పిలిపించవలెను.

రాజు:—బొబ్బరోగము రాకుండుటకును, అది వచ్చినయెడల మాన్పుటకును మీరు చెప్పిన అయిదు మార్గములను చక్కగ తెలిసికొంటిని.

మొదటిది:—ప్లేగు తగిలిన ప్రదేశమందల్లి ఎలుకలను చంపుట

రెండవది:—ప్లేగున్న ప్రదేశమునుండి ప్లేగులేని ప్రదేశమునకు మిణ్ణల్లులను తెచ్చి అచ్చటనుండు ఎలుకలకు ఈ రోగమును కలుగకుండజేయుట.

మూడవది:—ఒక పట్టణమందుగాని గ్రామమునందుగాని ప్లేగు తగిలినయెడల ఎలుకలమీది మిణ్ణల్లులు తమ్మును చేరకుండ యిండ్లను వదలి పొలములలో నివసించుట.

నాల్గవది:—తమ చుట్టుప్రక్కలను బొబ్బరోగము కనబడినప్పుడు ప్లేగు టీకాలను వేయించుకొనుట.

అయిదవది:—ప్లేగు తగిలినపుడు రోగులను నెమ్మదిగనుంచి తగిన చికిత్సచేయుట.

మిక్కిలి బీదవారును తక్కువజాతివారుకూడ నీ విధులప్రకారము నడుచుకొనవచ్చును. వీనిప్రకారము నడుచుకొనుటయందు ఏ విధమైన కష్టము లేదు. ప్రాణమును కాపాడుకొనుటకు నిష్టమున్నవారందరును పై విధుల ప్రకారము ప్రవర్తించి ప్లేగువలన చావును తప్పించుకొనవచ్చును.

వైద్యుడు:—ఓ రాజా! నీవు చెప్పినది నిజము. హిందూదేశమునందు బొబ్బరోగము తగులునను భయముగలవారందరును ఈ విధుల ప్రకారము నడుచుకొనుటకు నిశ్చయము చేసికొన్నయెడల రేపటినుండి బొబ్బరోగము నిలిచిపోవును. ఈ విధులను తెలిసినవారు మిక్కిలి కొద్దిమందియే. ఇది విచారకరమగు సంగతి. వీని నిజమును నమ్మువారి సంఖ్య యింకను మిక్కిలి స్వల్పము. పైదానికంటె

ఇది విచారకరమగు విషయము. ఈ విధుల ప్రకారము నడుచుకొనుటకు నిష్టమున్న వారిసంఖ్య యింకను స్వల్పముగనుండుట మిక్కిలి విచారకరమగు విషయము. ఇట్లున్నను, ఎవరుగాని నిరాశను పొందవలసిన పనిలేదు. ఈ బొబ్బరోగ విషయమందు ఎవరి మోక్షమును వారే సాధించి సంపాదించుకొనునదిగా ఉండును.

ఓ రాజా! ఈ దేశమునందుండు ఇంగ్లీషువారిని జూడుము. తమ చుట్టుప్రక్కలను విశేషముగ ప్లేగు వ్యాపించినను ఆ రోగమువలన వారు బాధపడకుండుటయు చనిపోవకుండుటయు చూడుము. దీనికి కారణమేమి? వారి క్షేమముకొరకు చేయదగిన పనులను వారు చేయుటవలననే ఈ రక్షణ కలుగుచున్నది. వారి యిండ్లయందెలుకలు లేకుండ జేసికొందురు. ముఖ్యముగా వారిండ్లను శుభ్రముగా నుంచుకొని సూర్యుని వెలుతురును మంచిగాలిని బాగుగ లోనికి రానిత్తురు. వారికి సమీపమున ప్లేగు కనబడగానే ప్లేగు టీకాలను వేయించుకొందురు. ఇంతేకాక ఎప్పుడైన ప్లేగు తగిలినపుడు వైద్యుని తత్క్షణము పిలిపించి తగిన మందును పుచ్చుకొని రోగమును కుదుర్చుకొందురు. ఈ నిబంధనములన్నియు వారికి చక్కగ తెలియును. వీని నిజమందు వారికి విశేష నమ్మకము. వీని ప్రకారము నడుచుకొనుటకు వారు ఎప్పుడును ప్రయత్నించుచుందురు. ఈ కారణముచేతనే హిందూదేశమందుండు ఇంగ్లీషువారు ప్లేగువలన చనిపోవుట లేదు. ఈ స్థితికి వేరు కారణము ఏది

యు లేదు. ఇంగ్లీషువారిని ప్లేగునుండి కాపాడగలిగిన మార్గములు హిందూదేశమందలి జనులనుకూడ నే భేదము లేక ప్లేగునుండి కాపాడును. ఈ విషయమందు కొంచెమైన సందేహముపడవలసిన పనిలేదు. ఈ విధులను గ్రహించి, వీనిని నిజమని నమ్మి, వీని ప్రకారము నడుచుకొన్నయెడల ఇంగ్లీషువారినైనను, హిందూదేశస్థులనైనను, గొప్పవారినైనను, కొద్దివారినైనను, భాగ్యవంతులనైనను, బీదవారినైనను, జనులనందరిని యీ విధులు ప్లేగునుండి నిశ్చయముగా కాపాడును.

పాఠము 5.

కలరా, అది వచ్చు విధము.

బొబ్బరోగమును గురించి వైద్యుడు మాట్లాడి, రాజుగారివద్ద సెలవుపుచ్చుకొను సమయమునందు మంత్రి గది లోనికి వచ్చెను.

మంత్రి:—(రాజుతో) ఓ రాజా! ఈ పట్టణముయొక్క కొత్త్వాలు ఇప్పుడే తొందరగా గుఱ్ఱముపైని ఎక్కివచ్చి పట్టణములో కలరా ప్రారంభించెనని నాతో చెప్పినాడు.

రాజు:—(మంత్రితో) కొత్త్వాలును పిలిపింపుము.

మంత్రి కొత్త్వాలును పిలిపించెను.

రాజు:—(కొత్త్వాలు వచ్చినపిమ్మట అతనితో) పట్టణమందలి కలరా సమాచారము ఏమి?


కొత్వాలు:—ఈ రోజున నిద్దరు కలరావలన చనిపోయిరని ఇప్పుడే నేను వింటిని. వీరిద్దరు పట్టణమందలి వేరు భాగములందు నివసించువారు. కనుక కలరా యిదివరకే వ్యాపించినదియని భయపడుచున్నాను. దీనివలననే ఈ ముఖ్యమగు విషయమును మంత్రిగారితో చెప్పి వారి యుత్తరువును పొందుటకొరకు గుఱ్ఱము నెక్కి తొందరగా స్వారిచేసి ఇచ్చటికి వచ్చితిని.

రాజు:—నీవు ఈ సంగతిని మాకు తక్షణమును తెలియజేసినది మంచిది. పట్టణములోగాని గ్రామములోగాని కలరా మొట్టమొదట తగిలినవారి విషయమునుగురించి వెంటనే శ్రద్ధతీసికొనవలెను. అట్లు తీసికొన్నయెడల ఈ భయంకరమగు రోగమును వ్యాపించకుండ జేయవచ్చును. కనుక చనిపోయిన వీరిద్దరి యిండ్లకు మంత్రిని, వైద్యుని ఇప్పుడే తీసికొనిపొమ్ము. వారు ఇచ్చు ఉత్తరువులను ఆలస్యములేకయే అమలులోనికి తీసికొనిరమ్ము.

తర్వాత వైద్యుడును మంత్రియు గుఱ్ఱమునెక్కి కొత్వాలుతో నూరిలోనికి వెళ్లిరి.

కొత్వాలు:—మనము మొదట రామచంద్రుడు అను వర్తకుని యింటికి పోవుదము. ఇతని కొడుకు, గోవిందుడు, ఈ రోజు కలరావల్ల చనిపోయెను.

వారు రామచంద్రుని యింటికి పోయిరి. గోవిందుడు మధ్యాహ్నము చనిపోయినట్లును, అతని బంధువులు శవమును దహనమునకు తీసికొనిపోయినట్లును తెలిసెను.



వైద్యుడును మంత్రియు కొత్వాలును ఊరిలోనికి పోవుట.

ఇంటియందు గోవిందుని తమ్ముడు సుబ్రహ్మణ్యము ఉండెను. వీడుకూడ కలరావల్ల విశేషము జబ్బుపడెను. కాని అప్పుడు కొంచెము నెమ్మదిగానుండెను.

మంత్రి:—(సుబ్రహ్మణ్యముతో) నీకును నీయన్న రామచంద్రునకును కలరా ఎట్లు వచ్చెనో నాకు చెప్పుము.

సుబ్రహ్మణ్యము:—అది యిట్లు జరిగినది. పోయిన నెలాఖరున మా తండ్రి రామచంద్రుడును, మా యన్న

గోవిందుడును, నేనును ఒక సంతకు పోతిమి. ఆ సంత యిక్కడకు నాలుగు దినముల ప్రయాణము. మాతోకూడ ఈ పట్టణమందు బంగారు పనివాండ్రగు శివదయాళుడును కర్మచంద్రుడును వచ్చియుండిరి. మేము నలుగురము సంతకు దగ్గర బసచేసియుంటిమి. మా స్నేహితుడగు దేవదాసుడను పేరుగల ఒక సిపాయి మమ్ములను అక్కడ కలిసికొనెను.

అతని పటాలము బర్మాదేశమందున్నది. అతడు సెలవు పుచ్చుకొని యింటికి వెళ్లుచుండెను. మేమందరము కలిసి ఒక చిన్న ముంగిలిగల గదిని అద్దెకు తీసికొంటిమి. అచ్చట వంటచేసికొనుచు నివసించుచుంటిమి. ఆ సంతవద్ద మేమున్నపుడే కలరాతగిలి అనేకులు చనిపోవుచున్నారని వింటిమి. కాని మేము క్షేమముగ నుంటిమి. అయితే ఒక దినము మధ్యాహ్నమందు వాంతులును విరేచనములు కలిగి మా తండ్రి రామచంద్రులవారికి చాల జబ్బుచేసెను. మూడు గంటల లోపలనే వారు చనిపోయిరి. వారు కలరావలననే చనిపోయిరి, దానికి సందేహములేదు.

మంత్రి:—మీ తండ్రి యే రోజున చనిపోయెను?

సుబ్ర:—ఈ నెలలో నేడు పండ్రెండవదినము. ఈ నెల అయిదవరోజు సాయంకాలమున మా తండ్రి రామచంద్రులవారు చనిపోయిరి. ఆయన చనిపోయిన సాయంకాలమే శవమును దహనముచేసితిమి. ఆరవరోజు ఉదయమున మేము ఇంటికివచ్చుటకు బయలుదేరితిమి. ఈ నెల

ఏడవరోజు మధ్యాహ్నము ఇక్కడికి రెండు దినములు ప్రయాణమగు ఒక స్థలమందు ఆగితిమి. మాతో వచ్చిన ఇద్దరు బంగారు పనివాండ్రలో ఒకడగు శివదయాళునకు ఆ సాయంత్రమే కలరా తగిలెను. కొన్ని గంటలలో వాడు చనిపోయెను. ఆ సాయంకాలమే అతని శవమును దహనముచేసితిమి.

శివదయాళుడు చనిపోయిన మరుసటి ఉదయమున మేము ప్రయాణమైతిమి. సిపాయియైన దేవదాసుని యిల్లు ఇంకొక రస్తామీద ఉండెను. కనుక అతను మమ్ములను ఆ రోజు విడిచి వెళ్లెను. ఈ నెల తొమ్మిదవరోజు మధ్యాహ్నమందు మిగిలియుండిన ముగ్గురము అనగా వడ్రంగియగు కర్మచంద్రుడు, నేను, నా అన్నయును పట్టణమును చేరితిమి. కర్మచంద్రుడు తన యింటికి వెళ్లెను. మేము ఇచ్చటికి వచ్చితిమి. ఆ రాత్రియందే నాకును గోవిందునకును కలరా తగిలి మిక్కిలి జబ్బుపడితిమి. ఈ రోజు మధ్యాహ్నము గోవిందుడు చనిపోయెను. మా స్నేహితులు అతని శవమును దహనముచేయుటకు తీసికొని వెళ్లిరి. అయితే దేవుని దయవలన నాకు రోగము కొంచెము కుదురుచున్నది. ఇంకను నాకు నీళ్లవిరేచనములు మాత్రము అగుచున్నవి.

మంత్రి:—వడ్రంగియగు కర్మచంద్రుడు ఎక్కడ నివసించుచున్నాడు?

వీరభానుడు:—కూరగాయల అంగళ్లకు దగ్గరనున్న వీధిలో అతడు ఉన్నాడు.

కోత్వాలు:—అయితే ఈ రోజు కలరావలన చనిపోయిన రెండవవాడు అతడే. అతని పేరుకూడ అదియే. అతను ఉండు స్థలమును అదియే.

సుబ్ర:—అయ్యో! సంతదగ్గర కలిసియున్న ఆరుగురిలో నేనును దేవదాసుడును మేమిద్దరమే ప్రాణముతో నున్నాము. కొండక్రిందనుండు నొక గ్రామములో సిపాయియగు దేవదాసున్నాడు. ఇక్కడకు ఆ గ్రామము ఒక రోజు ప్రయాణము.

మంత్రి:—బహుశః అతనికికూడ కలరా తగిలియుండ వచ్చును. నేనును వైద్యుడును అతని సంగతి కనుగొనుటకు రేపు ఉదయమున ఆ గ్రామమునకు పోయెదము.

మంత్రి:—సంతవద్ద మీరున్నప్పుడు ఎక్కడి నీరు త్రాగితిరి?

సుబ్ర:—ఒక పెద్ద చెరువుచుట్టును సంత జరిగెను. మేమందరము ఆ చెరువు నీటిని త్రాగితిమి.

వైద్యుడు:—ఆ సంతలో మీరు విశేషముగా పండ్లు తింటిరా?

సుబ్ర:—మామిడిపండ్లను ఖర్జూరపండ్లను విశేషముగా అమ్ముచుండిరి. అవి మిక్కిలి చౌకగా ఉండెను. కనుక వానిని ఎక్కువగ తింటిమి.

వైద్యుడు: — చెరువునీటిని త్రాగుటయు, ఎక్కువగ పండ్లను తినుటయు ఈ రెండును చెడ్డపనులు. మురికినీటిలో కలరాబీజములు సాధారణముగా ఉండును. ఇంతేకాక కలరాయుండు స్థలమునందు జనులు ఎప్పుడును పండని పండ్లను, బాగుగ ఉడకనికాయలను తినకూడదు. ఎందువల్లననగా వానివల్ల నీళ్లవిరేచనములు కలుగును. నీళ్లవిరేచనములు కొంచెమున్నను కలరా రాగలదు. యోచనలేనివారు పండ్లను మురికినీటిలో కడుగుదురు. కనుక వీనిమీద కలరాబీజములు తరుచుగ నుండును.

కలరాయుండు స్థలమునందు మిక్కిలి పరిశుభ్రమైన నీటినే త్రాగవలెను. బాగుగ పండని పండ్లనుగాని బాగుగ ఉడకని కూరలనుగాని తినకూడదు. అన్నకోశములోనికి పోయి కలరాను పుట్టించు కలరాబీజములు ఆహారముతోగాని నీటితోగాని లోపలికి పోవును; కలరాబీజములు ఉష్ణముచే చచ్చును. కనుక కలరాయున్నపుడు సలసల కాచిన నీటినే త్రాగుట మంచిది. కాయగూరలు మొదలగు ఆహారములన్నిటిని, బాగుగ వండినతర్వాతనే తినవలెను.

మంత్రి:—(వైద్యునితో) ఈ రోగము వ్యాపించకుండ మనమేమి చేయవలెను?

వైద్యుడు:—వాంతిమూలమునను, భేదిమూలమునను, కలరాతగిలిన మనుష్యునినుండి బయటికివెడలు పదార్థమందు కలరాబీజములున్నవి. సుబ్రహ్మణ్యమునకు ఇంకను

విరేచనములును అగుచున్నవి. కనుక పొడిమట్టితోగాని నున్నముతోగాని నిండించిన కుండలను తెప్పించుము. వాంతివలనను విరేచనమువలనను బయటికివచ్చు పదార్థమంతను ఆకుండలలోనే ఉంచవలెను. నేలమీద అట్టి పదార్థమేదియు పడకూడదు. పిదప ఆ కుండలను భూమిలో పాతిపెట్టించవలెను. బావికి దగ్గరగాగాని త్రాగునీరుపుట్టు చోటునగాని వానిని పాతిపెట్టకూడదు.

ఎవరుగాని ఈ గదియందు వంటచేసికొనగూడదు. ఇక్కడ భోజనముచేయుటయు తప్పు. రోగి కొంచెము బాగుకాగానే నేలమీద మంటలు వేయవలెను. మండు నిప్పులను గదియంతయు పరచవలెను. పిదప గోడలకును నేలకును మట్టిపూత పూయవలెను. చనిపోయిన అన్నయొక్క పడకను పడకబట్టలను ఎండలో అనేకరోజులు వేయవలెను. లేనియెడల వానిని కాల్చివేయవలెను. దహనము చేయుటకు రామచంద్రునియొక్క శవమును మోసికొనిపోయినవారు భోజనముచేయుటకు ముందు చేతులను దేహములను శుభ్రముగ కడుగుకొనవలెను.


ఇంటికి దగ్గర ఉండు నూతులలోనికి కొన్ని కలరాబీజములు ప్రవేశించి హానిని తేవచ్చును. కనుక పొటాస్సియం పెర్మాంగనేటు అను యెర్రని పదార్థముతో దగ్గరనుండు నూతులను పరిశుభ్రము చేయవలెను.

రోగమును వ్యాపించకుండునట్లు బావిలోని నీటిని శుభ్రపరచవలెను. అందుకు దానిలో పొటాస్సియం పెర్మాంగనేటును చేర్చవలెను. నీటికి కొంచెము ఎరుపురంగు వచ్చువరకును దీనిని కలుపవలెను. బావిలోని నీటికి ఒక కడవనీటికి $1\frac{1}{4}$ తులముల పెర్మాంగనేటు చాలును. పెర్మాంగనేటు అంతయు కరిగిపోవునట్లు బాగుగ కలిపి ఆ కుండలోని నీటిని నూతిలో పోయుము. బావిలోని నీరంతయు కొంచెము ఎరుపు తిరుగువరకు ఈ ప్రకారము అనేకసారులు చేయుము. పిదప ఆ నూతినీటిని రెండు గంటలసేపు కదలక ఉంచవలెను. ఎరుపురంగు ఇంచుమించుగ పోవువరకు నూతిలోని నీటిని తోడివేయవలెను. తర్వాత ఆ నీటిని వాడవచ్చును.

పట్టణమందలి ప్రతి నూతికిని ఇద్దరు నీళ్లమనుష్యులుండవలెను. నీటిని తోడుటకు వారికి ఒక పాత్రను ఇయ్యవలెను. ఆ పాత్రను అగ్నితో పరిశుద్ధము చేసియుండవలెను. ఆ పాత్రతోనే వారు నీటిని తోడవలెను. ఆ పాత్రనుగాక వేరు పాత్రను వారు వాడకూడదు. వారు తప్ప ఎవరును నీటిని తోడకూడదు.

ఈ పనులను చేయించునట్లు కొత్త్వాలునకు ఉత్తరువు చేయుము. ప్రతిదినము బజారునకు వెళ్లి కుళ్లినపండ్లను పండని పండ్లను అమ్మకుండునట్లు చేయుమనియు కొత్త్వాలునకు చెప్పుము. దేవదాసుడను సిపాయి వెళ్లిన గ్రామమునకు రేపు పోవుదము

పాఠము 6.



ఊటనూతియందు బట్టలను ఉతుకుట

కలరా వ్యాపించు విధము.

మరునాటి ఉదయమున వైద్యుడును మంత్రియును దేవదాసుడను సిపాయి వెళ్లిన గ్రామమునకు గుఱ్ఱములను ఎక్కి వేగముగ పోయిరి. వారచ్చటికి చేరినప్పుడు ఆ గ్రామమందు కలరావలన జనులు చనిపోవుచుండిరి.

మంత్రి: — (గ్రామాధికారితో) ఈ గ్రామమందు కలరా మొదట ఎవరికి తగిలినది? అతను ఎప్పుడు చనిపోయెను?

గ్రామాధికారి:—దేవదాసుడను సిపాయి బర్మాలో ఉన్న తన పటాలమును వదలి సెలవుతీసుకొని తన యింటికి వచ్చెను. మొదట అతను కలరావలన చనిపోయెను. ఈ నెల తొమ్మిదవరోజున అతను ఈ గ్రామమును చేరెను. ఆ రాత్రియే కలరావలన అతడు చనిపోయెను.

మంత్రి:—అతనికి కలరా ఎట్లు వచ్చెను?

గ్రామాధికారి:—ఇక్కడకు నాలుగుదినముల ప్రయాణమగు స్థలమునందు ఒక పెద్ద సంత జరుగును. ఆ సంత దగ్గర అతడు కొన్ని రోజులుండెను. అతనితో సంతదగ్గర ఉన్నవారిలో కొందరు కలరావలన చనిపోయిరి. ఈ సంగతి అతను చనిపోవుటకుముందు చెప్పెను. వారి మూలమున అతనికి కలరా తగిలియుండవలెను.

మంత్రి:—అప్పటినుంచి ఎందరికి కలరా తగిలెను?

గ్రామాధికారి:—ఈ జరిగిన కొన్ని రోజులలో డెబ్బది ఎనుబదిమందికి కలరా తగిలెను. ఇదివరకే [illegible] మంది చనిపోయిరి. అయితే ఈ విషయములో ఒక విచిత్రమున్నది. నీళ్ళులేనివాగు ఒకటి ఈ గ్రామమును రెండు సమభాగములుగా చేయుచున్నది. ఈ వాగున కీవైపున ఉన్నవారికే కలరా తగిలినది. ఈ వైపుననే దేవదాసుడు నివసించియుండెను. వాగునకు అవతలివైపు ఉన్నవారిలో ఒక్కరికిగాని కలరా తగులలేదు.

వైద్యుడు:—రెండువైపుల ఉన్నవారును [illegible] గ్రామమున్నారా?

గ్రామాధికారి:—లేదు. ఈ ప్రక్కనుండువారికి ఒక ఊట కలదు. ఆ ప్రక్కనుండువారికి మరియొక ఊట కలదు.

వైద్యుడు:—(అప్పుడు మంత్రిని చూచి) ఈ ప్రక్కన ఉండు ఊటలోనికి కలరాబీజములు ప్రవేశించినవి. ఇందుకు సందేహములేదు. ఈ యూటనీటిని వాడకూడదని గ్రామాధికారికి ఉత్తరువును ఇమ్ము. ఇంతకుముందు దానిలోనుండి తీసిన నీటిని పారబోయించుము. పొటాస్సియం పెర్మాంగనేటుతో ఊటను పరిశుభ్రపరచుము.

వైద్యుడు కోరిన ప్రకారము గ్రామాధికారికి మంత్రి ఉత్తరువుచేసెను. తర్వాత దేవదాసుడను సిపాయి చనిపోయినయింటికి వారు వెళ్లిరి. ఇంటిలో దేవదాసుని తల్లి కనబడెను.

వైద్యుడు:—(దేవదాసుని తల్లిని చూచి) దేవదాసుడు చనిపోయినపుడు వేసికొనియుండిన బట్టలను కనపరచుము.

ఆమె లోపలికి వెళ్లి ఆ బట్టలను తెచ్చి మంత్రికిని వైద్యునకును కనపరచెను. ఈ బట్టలు పరిశుభ్రముగ ఉండెను.

వైద్యుడు:—నీ కొమారుడు దూరపు ప్రయాణముచేసి ఇచ్చటికి వచ్చియుండెను. అతను ఇచ్చటికి వచ్చియున్నపుడు బట్టలు మిక్కిలి మురికిగా నుండవలెను. ఇంత పరిశుభ్రముగా నుండవు.

దేవదాసుని తల్లి:—అవును. అతను ఇక్కడికి వచ్చినపుడు ప్రయాణముచే బట్టలు మురికిగానుండెను. ఇంతే కాక అతను జబ్బుగా నున్నపుడు వాంతులవలనను భేదుల

వలనను బట్టలను మురికిచేసెను. కనుక అతను చనిపోయిన మీదట ఈ బట్టలను తీసికొని వెళ్లి ఊటదగ్గర ఉతికితిని.

మంత్రి:—ఏ యూటదగ్గర వానిని ఉతికితివి?

దేవదాసుని తల్లి:—వాగునకు ఇటువైపున ఒక్క యూటయే ఉన్నది. దానినుండియే మేము త్రాగుటకు నీటిని తెచ్చుకొనుచున్నాము. అచ్చటనే నేను ఆ బట్టలను ఉతికితిని.

వైద్యుడు:—(మంత్రితో) నేను చెప్పినట్లే జరిగినది. చనిపోయిన దేవదాసుని బట్టలను ఈమె ఊటదగ్గర ఉతికినపుడు కలరాబీజములు ఊటనీటిలోనికి తప్పక ప్రవేశించెను. ఈ యూటనీటిని త్రాగువారిలోనే కలరా తగిలినది. వాగునకు రెండవవైపున ఉండు ఊటనీరు చెడలేదు. ఆ నీటిని త్రాగువారిలో ఒక్కరికినిగాని కలరా తగులలేదు.

అటుతర్వాత ఆమె బట్టలను ఉతికిన ఊటదగ్గరకు గ్రామాధికారితో వైద్యుడును మంత్రియు వెళ్లిరి. పొటాస్సియం పెర్మాంగనేటుతో ఆ నీటిని శుభ్రపరచిరి. ఇట్లుజరిపినతర్వాత మంత్రియును వైద్యుడును ఆ గ్రామమునందే కొన్ని రోజులుండిరి. ఆ కాలమందు ఆ గ్రామమున ఎవరికినిగాని కలరా తగులలేదు.

వైద్యుడు:—(మంత్రితో) కలరా తగులుననుభయము ఇక లేదు. ఆ యూటనీటియందు కలరాబీజములుండెను. కాని వానినన్నిటిని పొటాస్సియం పెర్మాంగనేటుతో

నశింపజేసితిమి. ఓ మంత్రీ! కలరావలన చనిపోయినవాని బట్టలను మనము త్రాగునీటిని తెచ్చుకొను చోటున ఉతుకుట ఎంత చెరుపో నీకు తెలిసినదా? కలరావలన బాధ పడువాడు ఉపయోగించునట్టియు లేక వానిదగ్గర ఉన్నట్టియు బట్టలు, పరుపు, పాత్రలు, వీనిని మనము తిను వస్తువుల దగ్గరకుగాని త్రాగువస్తువుల దగ్గరకుగాని తేకూడదు. ఈ గ్రామమందు ఏమి జరిగినది స్పష్టముగ ఏర్పడినది. దేవదాసుడను సిపాయి ఇచ్చటకు రాగానే కలరావలన చనిపోయెను. అతని వాంతులలోను విరేచనములలోను కలరా పురుగులుండెను. వాంతులవలనను విరేచనముల వలనను బయలువెడలిన పదార్థము అతని బట్టలలో విశేషముగ చేరెను. కనుక వాని బట్టలలో కలరాబీజములుండెను. వాని తల్లి ఊటదగ్గర వాని బట్టలను ఉతికెను. కలరాబీజము లప్పుడు ఊటనీటిలో ప్రవేశించెను. తర్వాత అవి యా నీటిలో వేనవేలుగ వృద్ధిపొందెను. దేవదాసుని బట్టలను ఉతికిన రోజునకు మనము నీటిని పరిశుద్ధము చేసిన రోజునకు మధ్యనుండుకాలములో ఆ యూటనీటిని త్రాగినవారిలో అరువది నలుగురికి కలరా తగిలెను. వారిలో ముప్పది ఏడుగురు చనిపోయిరి.

అటుపిమ్మట ఈ విషయములను రాజుతో చెప్పుటకు మంత్రియు వైద్యుడును రాజుగారి పట్టణమునకు తిరిగి పోయిరి.

పాఠము 7.



డాక్టరు కాక్ దొరగారు.

కలరాను పోగొట్టు విధము.

వైద్యుడు మఱల రాజుసముఖమునకు వచ్చినపుడు ఆ పట్టణమందును గ్రామమందును కనబడిన కలరా సమాచారమును మంత్రి రాజుతో మనవిచేసెను.

రాజు:—కలరా తగిలిన గ్రామమునకు నీవును మంత్రియు వెళ్లినపుడు కలరాబీజముల సంగతి మంత్రితో చెప్పితివి. ఈ బీజములను మొదట కనుగొన్నవారెవరు?

వైద్యుడు:—డాక్టరు కాక్ అను వైద్యశాస్త్రజ్ఞుడు కలరా బీజములను మొదట కనిపెట్టెను. నా యింటియందు వారి పటమున్నది. మీకు కనుపరచుటకు నేను దానిని

ఇక్కడకు తెచ్చితిని. సుమారు 50 సంవత్సరములకు ముందు డాక్టరు కాక్ అనునతడు బ్రదికియుండెను.

రాజు:—ఓ వైద్యుడా! ఒక పట్టణమందలిగాని గ్రామమందలిగాని జనులు కలరా రాకుండ చేసికొనుట ఎట్లు?

వైద్యుడు:—జనులు నీళ్లవిరేచనములవలన బాధపడునపుడు కలరా శీఘ్రముగా వ్యాపించును. నీళ్లవిరేచనములబాధ జనులకు లేనపుడు కలరా సులభముగా వానిలో వ్యాపించదు. కనుక నీళ్లవిరేచనములను కలుగజేయునవి కలరాను వ్యాపింపజేయును.

రాజు:—నీళ్లవిరేచనములు వేనివలన కలుగును?

వైద్యుడు.—చెడ్డనీరు, చెడిపోయినట్టియు పండనట్టియు పండ్లు, మురికి, ఈగలు, నీళ్లవిరేచనములను పుట్టించువానిలో ముఖ్యమైనవి. ఇవియున్న స్థలములందు నీళ్లవిరేచనములవలన జనులు బాధపడుదురు. ఈ స్థలములందే కలరా వచ్చినయెడల శీఘ్రముగ వ్యాపించును. మంచి నూతులును పరిశుద్ధమగు నీరును ఉన్నపుడును, చెడినపండ్లును, పండనిపండ్లును అమ్మనప్పుడును, ఇండ్లను వీధులను చక్కగ శుభ్రపరచి మురికిని ఈగలను లేకుండ జేయునపుడును, జనులు నీళ్లవిరేచనములవలన బాధపడరు. వారిలో కలరా వ్యాపించదు. అన్ని స్థలములందును అన్ని కాలములందును పై విషయములను గురించి యాలోచించి జాగ్రత్త తీసికొనవలెను. కలరా కనబడుటకుముందే ఈ జాగ్రత్తలుండవలెను.

రాజు:—కలరా రాకుండ జేయవలెనన్న నీళ్లవిరేచనముల రాకుండఁజేయుటయే మొదటిపని.

వైద్యుడు: — అవును. అది నిశ్చయమే. ఇంతేకాక కలరా కనబడునను భయమున్నపుడును లేక కలరా కనబడినపుడును నూతులను ఊటలను అన్నిటిని శుభ్రపరచవలెను. వానిలోనికి ఏవిధమైన మురికియు పోకుండ జేయవలెను. కనుక ఒక స్థలమునందు కలరా కనబడినపుడును, ఏదైన నూతిలో కలరాబీజములున్నవను సందేహమున్నపుడును, ఆ నూతినీటిని పొటాస్సియం పెర్మాంగనేటుతో పరిశుభ్రపరచుము. ప్రతి నూతికిని ఇద్దరు నీళ్లవాళ్లను నియమించుము. అగ్నిచే పరిశుద్ధిచేయబడిన పాత్రతో వారు నీటిని తోడవలెను. వేరు పాత్రను నీటిని తోడుటకు వాడకూడదు. వారు తప్ప మరి యెవరును నీటిని తోడకూడదు.

ఇంతేకాదు. త్రాగుటకు ఉపయోగించు నీరుగల బావి, ఊట, చెరువు, వీనివద్ద బట్టలను ఉతకనివ్వకూడదు. కలరా యున్నను కలరా లేకున్నను బట్టలనుతుకుట కూడదు. త్రాగునీటిని తెచ్చుకొను ప్రవాహము యొక్క పైభాగమందును బట్టల నుతుకనివ్వకూడదు.

రాజు:—జనులకు కలరా రాకుండజేయుటకు నూతులను ఊటలను పరిశుభ్రముచేసి అందలి నీటిని శుద్ధముగా నుంచుట రెండవ మార్గమని నాకు తెలిసినది.

వైద్యుడు:—అవును. నీవు చెప్పినది సరి. దీనివలనే

ముఖ్యమగు మరియొక విషయ మున్నది. దానినికూడ జ్ఞాపకమందు ఉంచుము. కలరాబీజములు కలరా తగిలినవారి వాంతులవలనను భేదులవలనను వెలువడు పదార్థమునందు ఉండును. అవి నీటిలోగాని ఆహారపదార్థములోగాని చేరినయెడల అట్టి నీటిని త్రాగువారికిని ఆ పదార్థములను భుజించువారికిని కలరా వచ్చును. కావున:-

(1) కలరాతగిలిన మనుష్యుని ఇతరులు భుజించు ఆహారముదగ్గరకుగాని, వారు త్రాగు పానీయములదగ్గరకుగాని రానీయకూడదు.

(2) కలరాతగిలిన మనుష్యుడున్న గదియందు ఎవరుగాని వంటచేసికొనుటయు భోజనముచేయుటయు కూడదు.

(3) కలరాతగిలిన మనుష్యుడు ఉపయోగించినట్టిదిగాని, తాకినట్టిదిగాని వానిదగ్గర నున్నట్టిదిగాని వస్తువులను ఇతరులు ఉపయోగించుఆహారమువద్దగాని పానీయమువద్దగాని ఉంచనీయవద్దు.

(4) వంటపాత్రలను కడుగుటకు ఉపయోగపడునట్టియు మనుష్యులు త్రాగునట్టియు నీరుగల ఊటలు, నూతులు, చెరువులు, ప్రవాహములు వీనియందు కలరాతగిలినవాని గుడ్డలను, పరుపులను ఉతకనీయకూడదు.

(5) కలరా వచ్చినవారికి ఉపచారముచేయువారు అన్నమును తాకుటకుముందును తినుటకుముందును తమ చేతులను జాగ్రత్తగ కడుగుకొనవలెను.

(6) వాంతులవలనను విరేచనములవలనను వెలివచ్చు పదార్థమును సగము పొడిమన్నుతోను సున్నముతోను నింపబడిన కుండలలో ఉంచవలెను. అట్టి కుండలను భూమిలో పాతిపెట్టించవలెనుకాని ఎన్నటికిని నీరు పుట్టు స్థలముదగ్గర వీనిని పాతిపెట్టించకూడదు.

(7) కలరాతగిలినవాని పడకను, పరుపును, బట్టలను అనేకరోజులు మంచి యెండలో పరపించవలెను. ఇట్లు చేయుటచే సూర్యుని వేడిమియు, వెలుతురును వానియందుండు కలరాబీజములను నశింపజేయును. కలరాతగిలిన మనుష్యుడు చనిపోయినను బాగయినను పైనచెప్పిన పని తప్పక జరుగవలెను.

రాజు:—ఒక నగరమందును, పట్టణమందును, గ్రామమందును జనులు కలరావలనికష్టములనుండి తప్పించుకొనుటకు మూడు ముఖ్యమగు మార్గము లున్నవని నాకు చక్కగ తెలియును. అవి యేవియనగా:—

మొదటిది: — జనులకు నీళ్లవిరేచనములను పుట్టించు వాని విషయమై శ్రద్ధతీసికొనుట.

రెండవది:—అన్ని నూతులను, ఊటలను, చెరువులను, శుభ్రపరచి వానియందలి నీటిని పరిశుద్ధముగ నుంచుట.

మూడవది:—కలరా తగిలినవాని దేహములోనుండు కలరాబీజములు భోజనపదార్థములకును, త్రాగుటనీటికిని చేరకుండ చేయుట.

వైద్యుడు:—మీరు ఈ విషయములను సరిగా గ్రహించితిరి.

రాజు: — మశూచికమును టీకాలవలన ఆపగలము. మన్యపుజ్వరము, బొబ్బరోగము, కలరా వీనిని ఎట్లు ఆపవచ్చునో నీవు నాకు తెలియచెప్పితిరి. కనుక ఈ నాలుగు రోగములును ఆపగలిగినవే. వైద్యుడా! నా దేశములో మాన్పగలిగిన రోగములు ఇంకను ఏవైన నున్నయెడల నాకు చెప్పుము.

వైద్యుడు:—అట్టి రోగములు ఈ దేశమునందు ఇంకను అనేకము లున్నవి. మరియొకరోజున దేవరవారు నన్ను పిలిపించినయెడల మాన్పగలిగిన జాడ్యములలో మరికొన్నిటిని గురించి విన్నవించెదను.

పాఠము 8.

అశుభ్రమువల్ల వచ్చు కీడులు.

వైద్యుడు మఱియొకనాడు రాజుగారిసముఖమునకు వచ్చెను.

రాజు:—మాన్పగలిగిన రోగములను గురించి మన మిదివరలో మాట్లాడితిమి. ఈ విషయమును గురించి ఇంకను కొన్ని సంగతులను నాకు చెప్పుము.

వైద్యుడు: — కన్నచోటునను సిగ్గులేక అల్పశంకకు (ఉచ్చపోయుట) పోవువారు అనేకులు ఈ దేశమందున్నారు.

తమ గుమ్మములవద్దనే అల్పశంకను తరుచుగ చేయువారు కలరు. కొందఱు పిల్లలకు సిగ్గును బొత్తిగ నేర్పరు. ఆ విషయమునందు సిగ్గుపడవలెనని తల్లిదండ్రులు పిల్లలకు చిన్నతనమందే ఎందుకు నేర్పరు? ఇవి నాగరికులైన జనుల యలవాటులా? ఇట్టి చెడుపనులు అనేక రోగములను కలిగించును. ఈ యలవాటులను అసహ్యించుకొను తెలివిగలవారు అనేకులు ఈ దేశమందు ఉన్నారు. అది నాకు బాగుగ తెలియును. ఈ రోతపనులను వారు చూచునపుడు వానిని మాన్పుటకై వారి శక్తిని ఎప్పుడును ఉపయోగించుచుండవలెను. ప్రతి గ్రామముచుట్టును పొలములు విశేషముగ ఉన్నవి. శంకానివృత్తిచేసికొనుటకు జనులు వారి గ్రామమునకు కొంచెముదూరము పోవలెను. శంకా నివృత్తిచేసికొన్న మీఁదట అశుద్ధమును ఎప్పుడును కొన్ని పిడికిళ్లమట్టితో తప్పక కప్పవలెను. అశుద్ధముమీఁద వాలిన ఈఁగలు ఒకని ఆహారముమీఁద తర్వాత వాలుట రోఁత. ఇది ఆరోగ్యమునకు గొప్ప హానిని తెచ్చును.

రాజు:—నీవు చెప్పినది మిక్కిలి నిజము. పాఠశాలలలో బాలురకు వీనినిగురించి నేర్పవలెను.

వైద్యుడు:—అనేక గ్రామములందు గుంపులుగనుండు కుక్కలను చూఁడుము. అవి తరుచుగ ఆహారములేక చిక్కియుండును. గజ్జియును పిడుదులును వానిని పీడించుచుండును. వానికి తరుచుగ పిచ్చిపట్టును. అప్పుడవి మను

ష్యులను పశువులను కరుచును. వారికి అప్పుడు విశేషము హాని కలుగును. కనుక అట్టి జంతువులను బ్రదుకనిచ్చుట మంచిది కాదు.

రాజు:—అది నిశ్చయమే. అట్టి కుక్కలను చంపివేయవలెను.

వైద్యుడు:—రోగములు విశేషముగ కలుగజేయు ఇంకొక చెడ్డ యభ్యాసమున్నది. అది యేది అనగా—ఉమ్మివేయుట.

రాజు:—ఉమ్మివేయుటవలన ఏరోగము వచ్చును?

వైద్యుడు:—తరుచుగ ఉమ్మివేయువారు రోగపురుగులను వ్యాపింపజేయుదురు. అవి మనుష్యుని ఊపిరితిత్తులలోనికి పోయి భయంకరమగు క్షయరోగమును కలిగించును.



x 1000

క్షయబీజములు పెద్దవిగ కనుపరచబడినవి.

రాజు: — నా దేశమందలి పెద్ద పట్టణములందుండు జనులలో క్షయరోగము విశేషముగ ఉన్నది.

వైద్యుడు: — అది నిజమే. దానికి కారణమున్నది. పట్టణములందలి జనులలో అనేకులు మిక్కిలి క్రిక్కిరిసి

కాపురముందురు. వారి యిండ్లు చీకటిగాను మురికిగాను ఉండును. వానిలోనికి మంచిగాలి సాధారణముగ ప్రవేశించదు. అట్టి స్థలములందుండువారిలో అనేకులు సూర్యరశ్మియు మంచిగాలియు ఉండు స్థలములకు తరుచుగా వెళ్లరు. అటువంటి జనులు జబ్బుపడి బలములేక పాలిపోదురు. వారు ఊపిరితిత్తులోనికి క్షయబీజములను పీల్చినవెంటనే దగ్గు పుట్టును. ఉమ్మితో నెత్తురును పడును. వారు దినదినము బలహీనులయి చిక్కి, కొన్ని నెలలలో చనిపోదురు.

రాజు:—క్షయరోగము ఎట్లు కలుగుచున్నది?

వైద్యుడు:—క్షయ ఒక విధమగు పురుగులవలన కలుగుచున్నది. ఇవి మనుష్యుని ఊపిరితిత్తులలోనికి పోవును. చెదలు కర్రను తినినట్లు ఈ పురుగులు ఊపిరితిత్తులను తినును. క్షయరోగి దగ్గినపుడు బయటికివచ్చు పదార్థము ఈ పురుగులచే నిండియుండును. అట్టి మనుష్యుడు ఎక్కడనైన ఉమ్మివేయునపుడు బయటికివచ్చు పదార్థము మొదట ఎండును. దానిలోని పురుగులు దుమ్ము రేగినట్లు అన్నివైపులకు పోవును. వీనిని ఇతరులు పీల్చినపుడు వారికి రోగము వచ్చును. ఇందువలన క్షయరోగి నివసించునట్టియు నిద్రించునట్టియు గదిలో నుండుటచే హాని కలుగును.

రాజు: — ప్లేగ్ బీజములు, కలరాబీజములు, క్షయబీజములు, వీనినిగురించి అనేక సంగతులను నీవు చెప్పితివి. ఏదో యొక విధమగు బీజములవలననే ఇంచుమించుగ

అన్ని రోగములును కలుగుచున్నట్లు తోచుచున్నది. ఈ బీజములన్నియు ఒక్కమాదిరిగా నుండునా? ఈ రోగములు బీజములవలన కలుగుచున్నవని ఎవరు కనిపెట్టిరి?

వైద్యుడు:—ప్రతి విషపు మొక్కకును ఒక బీజముండును. అదేప్రకారము ప్రతి రోగమునకును ఒక బీజము కలదు. ఈ సంగతిని కొన్ని సంవత్సరముల క్రిందటనే కనిపెట్టిరి. ప్రతి రోగమునకును ప్రత్యేకమగు బీజములున్నవి. కలరాబీజము ఒక విధమైనది. క్షయబీజము మరియొక విధమైనది. ఒక ప్రసిద్ధికెక్కిన జర్మనువైద్యుడు కలరాబీజములనే కాక క్షయబీజములనుకూడ కనుగొనెను. ఆయన పేరు డాక్టరు కాక్. అతని పటమునే మీకు నిన్న కనుపరచితిని.

రాజు:—క్షయరోగము రాకుండ జేయవచ్చునా?

వైద్యుడు:—తేమలేక పొడిగానుండునట్టియు పరిశుభ్రమగునట్టియు, సూర్యుని వెలుతురును, మంచిగాలియు బాగుగ వచ్చుటకు వీలున్నట్టియు ఇండ్లయందుండువారికి క్షయరోగము రాదు. చీకటి, మురికి, క్రిక్కిరిసియుండుట, ఉమ్మివేయుట, ఇవి క్షయరోగమునకు అనుకూలమైనవి. సూర్యుని వెలుతురును, మంచిగాలియు రోగములకన్నిటికిని సాధారణముగ శత్రువులు. క్షయరోగమునకు అవి ముఖ్యమగు శత్రువులు.

రాజు:—క్షయరోగమును కలుగజేయు వేరు విషయములున్నవా?

వైద్యుడు: — మురికిగానుండు పండ్లవలనకూడ క్షయరోగము పుట్టును. పండ్లు మురికిగానున్నయెడల రోగబీజములు వానిమీద పెరిగి లోపలికి ఊపిరితిత్తులలోనికి పోవచ్చును. కనుక పరిశుభ్రమగు కర్రపీచుతో ఉదయమందును రాత్రియందును పండ్లను బాగుగ తోముకొనుట మంచిది.

రాజు:—క్షయరోగము కుదురునా?

వైద్యుడు:—క్షయరోగము ఎక్కువగ ముదరకముందే దానిని కుదర్చగలిగిన మందులు రెండున్నవి. వానిని పెద్ద మాత్రలుగా పుచ్చుకొనవలెను.


రాజు:—బీదవారికి విశేషము మందును కొనుటకు ధనముండదు. కనుక క్షయరోగము కుదురునను ఆశ వారికుండదు.

వైద్యుడు:—క్షయరోగమును కుదుర్చు రెండు మందులును ఖరీదుగలవి కావు.

రాజు:—ఆ రెండు మందుల పేర్లేమి? వానిని ఎక్కువగా కొని నా దేశమందలి యాసుపత్రులన్నిటికిని పంపెదను.

వైద్యుడు:—ఖరీదుకు ఈ రెండు మందులు దొరకవు. వానిని మోసికొనిపోవుటకును వీలులేదు. అవి ఎచ్చట దొరకునో అక్కడనే వానిని శుద్ధముగా ఉపయోగించవలెను.

రాజు: — అయ్యో! పాపము! బీదవారికి ఆ మందులు ఎట్లు దొరకును?



క్షయరోగులు వెలుపల పండుకొనియుండుట.

వైద్యుడు:—ఓ రాజా! భయపడకుము. దీనివలన బీదవాండ్రకు ఏ హానియు కలుగదు క్షయమును కుదుర్చు రెండు మందులు ఏవియనగా, సూర్యుని వెలుతురును, మంచిగాలియు. క్షయముగలవారందరును వెచ్చని వస్త్రములను వేసికొనవలెను. రాత్రింబగళ్లు, ఏ ఋతువైననుసరే, గాలిలోనే బహిరంగస్థలమందుఁ బరుండవలెను. పగటికాలమందు వారు ఎండలోగాని చెట్ల నీడలోగాని పొలములందు పనిచేయవలెను. రాత్రియందు ఇంటికప్పుమీఁద

పరుండవలెను; వానగాని మంచుగాని పడుచున్నయెడల బాగుగ గాలి తగులు వసారాలో పండుకొనవలెను. గదులలో నుంచినయెడల చనిపోవువారిలో అనేకులు బైటముగ నుంచినయెడల బాగుపడుదురు.

రాజు:—హెచ్చుతగ్గులుగల ఈ ప్రపంచమందు కొందరు ధనవంతులుగాను కొందరు దరిద్రులుగాను పుట్టుదురు. అయినను ఎంత ధనముచేతను కొనరాని వస్తువులను పరమాత్ముడు బీదవాండ్రకు మిక్కిలి ఎక్కువగ ఇచ్చియున్నాడు.

వైద్యుడు:—ఓ రాజా! నేను ఈ దేశమునకు వచ్చినది మొదలు అనేక సంగతులను చెప్పియున్నాను. వీనిని గురించి మీరు యోచించినయెడల రోగములనుండి తప్పించుకొనుట ధనవంతులకు ఎంత సులభమో బీదవారికిగూడ అంత సులభము.

రాజు:—నీవు చెప్పిన సంగతులన్నిటియందును ఉన్న సత్యమునయొక్క మహిమను ఇప్పుడుగదా గ్రహించితిని.

వైద్యుడు:—మీ బడులన్నిటియందును ఈ సంగతులను నేర్పించుము. అట్లు చేసినపుడు మీ ప్రజలయొక్క బిడ్డలును, వారి మనుమ్మలును, వీని సంగతులు సత్యమని గ్రహించి వాని ప్రకారము జీవితకాలమంతయు నడుచుకొందురు. అట్లు జరిగినయెడల దేశమంతటను మరణ

మార్పులు గలుగును. ఈ లాభములను పొందుటకు ధనము అక్కరలేదు. దేశములో ప్రజలు నెమ్మదిగాను క్షేమముగాను ఉండువరకు పట్టుదలయుండిన పై మార్పులు జరుగగలవు.

హిందూదేశపు చక్రవర్తియగు శ్రీ ఐదవ జార్జి సార్వభౌముని ధర్మరక్షణలో ఈ దేశమంతయు నెమ్మదిని పొందియున్నది. వారికుండు యుద్ధనావల సంఘములే ప్రపంచమందు అనేకముగ శాంతియుండునట్లు చేయుచున్నవి. అన్ని విషయములకంటెను ఈ సంగతులను ముఖ్యముగ జ్ఞప్తియందుంచవలెను.

సార్వభౌముండగు శ్రీ సప్తమ ఎడ్వర్డుచక్రవర్తిని హిందూదేశపు ప్రజలందరు ప్రేమించిరి. అతను ఈ మధ్యనే చనిపోయెను. అతను చనిపోయినపుడు హిందూదేశపు ప్రజలందరు ఈ సార్వభౌముడు కాలగతిచెందినందుకు దుఃఖించిరి. మీ దేశమందు ఘోరమగు బొబ్బరోగము వ్యాపించినపుడు శ్రీ చక్రవర్తి తన అనురాగమును కనుపరచుచు ఉత్సాహమును కలుగజేయుటకు ఒక వర్తమానమును పంపియున్నారు. అందలి మాటలు ఇంకను అందరకును జ్ఞాపకమందున్నవి.

మీ దేశపు జనులు పడుచున్న బాధల విషయమును వినినదిమొదలు శ్రీ జార్జి చక్రవర్తిగారు దుఃఖపడుచున్నారు. ఆయనయొక్క రక్షణక్రింద మీ దేశపు జను

లందరు భయములు లేనివారై శాంతిని పొందుచు జీవింతురుగాక! తగిన విద్యచేతను, తెలివిగల బోధనలవలనను మీ జనులందరు బాగుపడవలెనని చక్రవర్తిగారి కోరిక. మీయొక్క క్షేమమును, సంపదను, అభివృద్ధిని హెచ్చుపరచునట్టి జ్ఞానమును మీరు పొందుచుండవలెనని వారి యిష్టము.

జనులలో ననేకులను చంపునట్టియు బాధించునట్టియు రోగములయొక్క కారణములను హిందూదేశపు జనులు తెలిసికొన్నమీద వానినుండి కాపాడుకొను మార్గము విశేషముగ వారి స్వాధీనమందేయుండునను గొప్ప రహస్యము స్పష్టమగును.

సెలవిందు. మీకు సుఖము కలుగుగాక!

వైద్యుడు:—రాజా! నేనిప్పటికి జేయుటకై వచ్చియుండిన వానినన్నిటిని జేసితిని. కలరా, ప్లేగు, మన్యపుజ్వరము, క్షయరోగములనుండి నీ జనులను కాపాడుటకు నీవు చేయవలసిన చట్టములనన్నింటిని జెప్పియున్నాను. రాజుగారు నేజెప్పినరీతి నడుచుకొనుననియు, జనులు సౌఖ్యముగాను, సంతోషముగాను నుందురనుటకు నాకేలాటి సందేహమును లేదు.


ఇప్పుడు నేను నా దేశమునకు పోవ కోరితిని. నేను ప్రయాణమునకు సిద్ధముగానున్నందున, రాజుగారి యుత్తరువు అయినచో నేను రేపే బయలుదేరెదను. పయన

యగుటకు నేను రాజా[illegible] యుక్తమువ్యక్తి [illegible] చేసి-
యున్నాను.

రాజుగారు ఈ మాటలను వినినప్పుడు వారి మనస్సులో చింతపొడమెను. ఆ వైద్యుడు తన యింట చాలకాల ముండవలయునని అతను కోరెనుగాని వైద్యుని కోరికకు విరుద్ధముగా నడచుటకు ఇష్టపడకపోయెను.

[illegible] వైద్యుడా! నీ సమపదేశమునకు, నేను [illegible] [illegible] నీవు చెప్పిన [illegible] [illegible] [illegible] [illegible] [illegible] [illegible] [illegible] [illegible] [illegible] ముండెనని [illegible] [illegible] అద్భుతము రాక యున్న [illegible] [illegible] [illegible] కనుగొనుము [illegible] సమున్న [illegible], [illegible] నా రాజ్యమునందు [illegible] [illegible]

వైద్యుడు: ఓ రాజా! ఇకముందు [illegible] సంవత్సరము [illegible] [illegible] [illegible] [illegible] నుండవలెను [illegible] [illegible] సంతో[illegible] [illegible] [illegible] చేయకొమన్నాను.



రాజుగారు వైద్యులకు బహుమానమిచ్చుట.

ఆ వైద్యునికి రాజు గొప్ప బహుమానములనిచ్చి, మిగుల విలువగల కాశ్మీరదేశపు శాలువను తన చేతులతో అతని భుజములచుట్టు గప్పెను. ఇంతియగాక, సొగసైన గుఱ్ఱమును, పట్టువస్త్రములును, బంగారు, వెండినగలను ఇచ్చెను. అచ్చటి దివానును, ప్రభువులును వైద్యునికి వందనములుచేయుచు తాము అతనిని మఱల చూడ గోరెదమని చెప్పిరి. వైద్యుడు వారిని వీడ్కొనిపోయెను.

సమాప్తము.

ఆరోగ్యమార్గప్రకాశకథ.


నాలుగవ భాగము.

పాఠము 1.

వైద్యుడు మఱల వచ్చుట.

మూడేండ్లు గడచినవెనుక ఆ వైద్యునకు తన వాగ్దత్తము జ్ఞాపకమునకు వచ్చెను. అప్పుడే అతను ఆ రాజు పట్టణమునకు బయలుదేరెను. ఆ రాజుయొక్క రాజ్యముగుండా పోవునప్పుడు తాను బోధించినదంతయు మిగుల జాగ్రత్తతో ఆచారమునకు వచ్చినదని తెలిసికొనెను. అన్ని గ్రామములయందును నిర్మలమైన నీరుగల మంచిబావులుండెను. ముఱికిగానుండిన చెరువునీటిని జను లిప్పుడు త్రాగుటలేదు. గ్రామములన్నియు బాగుగా యూడ్వబడి, ముఱికినీటిని నిలువనీయకుండ కాలువలచే గొనిపోబడుచుండెను. జనులు చూచుటకు సౌఖ్యము గాను సంతోషముగా నుండిరి. క్రొత్త యిండ్లను కట్టు కొనియుండిరి.

కట్టకడపట ఆ వైద్యుడు రాజుండు పట్టణమును చేరెను. వేగముగా పరుగిడువారిచే అతనిరాక చెప్ప బడెను. దివాను, అతనికి ఎదురేగి, అతనికై ఏర్పఱచి యుండిన యింటికి బిలుచుకొనిపోయెను. అతను భుజించి, అలసటదీర్చుకొనినపిమ్మట, తనకై పంపబడిన సొగసైన



వైద్యుడు మఱల వచ్చుట.

జోడుగుఱ్ఱముల బండినెక్కి రాజుగారి దర్బారునకు పోయెను.

అతడు దర్బారునకు రాఁగానే రాజు దయతో అతనికి స్వాగతమిచ్చెను. రాజుగారి దేహమునుగురించి విచారించినపిమ్మట తాను ఆ రాజ్యమందు చూచినదంతయును, జనులుండురీతిని కనుగొనుటకు చాల సంతసించితిననియు చెప్పెను.

రాజు:— అవును! మేము క్రొత్త జన్మమెత్తితిమని కనుగొంటిమి మమ్ముల బాధించుచుండిన రోగములు చాలవఱకు నశించినవి. గడచిన సంవత్సరమున ప్లేగు వ్యాధి కనుబడలేదుగాని కలరాచే కొందఱు చనిపోయిరి. మన్యపుజ్వరముచే కొంతమంది బాధపడుచున్నారు. అయినను పూర్వముండినటుల లేక అది తానుతాను తగ్గుచున్నది. మునుపుండినటుల క్షయరోగము లేదు. ఇక అయిదారు సంవత్సరములలో క్షయరోగముచే చావులుండవని నిశ్చయముగా నమ్ముచున్నాము. అంతయు నీవు మాకుపదేశించిన మంచి యాలోచనవలనను, నీ దయవలనను గలిగినది. నీవిప్పుడు చాలదూరము ప్రయాణముచేసి అలసియున్నందున నిన్ను మేము ఇప్పుడు నిర్బంధించుటలేదు. రేపు నీవు నీ భోజనమయినపిమ్మట దర్బారునకు వచ్చి నాకును, నా ప్రభువులకును ఇంకా కొంత యుపదేశము చేయుమని కోరుచున్నాము. నిన్ను నేను అడుగవలసిన విషయములు అనేకములున్నవి.

పాఠము 2.


ధనాధికారియును మధుపానమును.

మఱునాడు రాజు తనకు దర్బారునందు చాలకార్యము లున్నందున, వానినన్నిటిని వైద్యుడు రాకమునుపే ముగింప వలయునని తలచి ప్రొద్దుననే దర్బారుకు పోయెను. దివాను మొక్క దినకార్యనివేదనమును విని దానిపై తానుత్తరువులిచ్చెను. పిమ్మట వజీరు *తన కార్యనివేదనము నొసఁగా దానికి తగినట్లు ఆజ్ఞలిచ్చెను. దర్బారు ఆరంభ మాయెను. ప్రభువులు, తమ తమ యాసనములందు కూర్చుండిరి. అయిన నొక్క గొప్ప యుద్యోగస్థుడు అక్కడ కానరాడయ్యె. అతడు ఆ రాజ్యపు కోశాధిపతి. అతని పీఠమున నెవరును లేకుండిరి.

రాజు:— ఏల మన కోశాధిపతి యీ దినమిచ్చటికి రాలేదు? దొడ్డవైద్యుడు వచ్చునపుడు, ఆస్థానమునకు సంబంధించిన యుద్యోగస్థులందఱుండి అతనికి మర్యాద చేయవలయును.

దివాను—ఇంకను వేళ కాలేదు. ఈ దినము మనము చాల ప్రొద్దుననే వచ్చినారము. ఇంకను మంత్ర[illegible] కాలేదు. సందేహములేకుండా కోశాధిపతి యిచ్చటికి [illegible] కాలములోనే వచ్చును.

రాజు:— అతని ప్రవర్తనము [illegible] కాలము [illegible] వైద్యునివలె కోశాధి



రాజు దర్బారు.

పతిగాని రాలేదు. కట్ట కడపట మధ్యాహ్నము రెండు ఘంటలకు వైద్యుడు బండిలో వచ్చి రాజునకు వందనము లర్పించి తన యాసమున కూర్చొనెను.

రాజు.—ఇంత యాలస్యముగ వచ్చుటకు కారణమేమి? మీకు జబ్బేమియు లేదుగదా. మీరాక నాతురముతో నెదురుచూచుచుంటిమి.

వైద్యుడు.—నన్ను క్షమింపుడు. నేను చాల యాలస్యముగ వచ్చితినని యెఱుగుదును. మీ కాయాసము కలిగించినందుకు చింతిల్లుచున్నాను. అయిన నిది నా తప్పు గాదు. మీ యాస్థానములోని యొక ప్రభువుది. మీరతని మన్నించెదనన్న మీకు కారణము తెలియజేసెదను.


రాజు:—నా మనఃపూర్వముగ మీకిష్టమయినవన్నియు జేసెదను. అయిన నతడేదైన నేరముచేసియుండిన మన్నింపజాలను. ఏది యెట్లున్నను న్యాయవిచారణ జరుగవలయుగదా?

వైద్యుడు:—అతడట్టి నేరము దేనిని చేయలేదు.. తనకే తాను కీడుచేసికొనెనుగాని యితరుల కేహానియు జేయలేదు. జరిగినదంతయు నిప్పుడు మీకు విన్నవించెదను.

ఈ విషయమొక యుద్యోగస్థుని గుఱించినదని తెలిసినందున, దివానును, వజీరును, తక్కిన ప్రభువులును గమనించి వినుచుండిరి. ఎవరిపై నేరము మోపబడునో, ఎవరు శిక్షకు అర్హులోయని వారాశ్చర్యపడిరి.

వైద్యుడు:—ఈ దినము ప్రాతఃకాలమున నేను దర్బారునకు వచ్చుచుండగా ఆస్థానపు ప్రభువులలో నొకని సేవకుని జూచితిని. తనయొక్క యజమానుడు కోశాధిపతియనియు, తన యజమానుడు చాల జబ్బుగానున్నందున నన్ను బిలువబంపెననియు ఆ సేవకుడు చెప్పెను. కోశాధిపతితో నివసించుచున్న అతని అన్నదమ్ములు వ్రాయుటకు గూడ శక్తిలేక జబ్బుగానున్నారనియు, ఈ సమాచారమును నాతో జెప్పుమనినటుల ఆ సేవకుడు నాతో చెప్పెను.

నేను దీనిని వినగానే వానిని ఆ యింటికి దారిచూపుటకు నా బండిలో ఎక్కి కూర్చొనుమని, బండితోలువానిని మిగుల వడిగా పోనిమ్మంటిని. కోశాధిపతి యిల్లు పట్టణము యొక్క ఆవలివైపున నున్నందున, అచ్చటికి పోవుటకు కొంత కాలము పట్టెను. నేను ఇంటిలోనికి పోగానే తన రెండు చేతులతో తలను పట్టుకొని మూల్గుచున్న అతనిని చూచితిని. ఆతని తలచుట్టు ఒక తడిగుడ్డ కట్టబడియుండెను. ఆ సేవకుడు అతనిని తాకి "ఇదిగో! వైద్యుడు నిన్ను చూచుటకు వచ్చియున్నాడ" నెను. అతడు మూల్గుచు నిట్టూర్పు విడిచి "వైద్యుడా! నేను చనిపోవుచున్నాను. నా తల వెయ్యి ముక్కలుగ పగిలిపోవునటుల నొప్పెత్తుచున్నది. నేను మాట్లాడజాల"ననెను. మఱల మూల్గుటకు ఆరంభించెను. అప్పుడే అతని కుమారుడు గదిలోనికి వచ్చెను. అతడు ఇరువదయేండ్ల ప్రాయముగల చిన్నవాడు. అతడు



కోశాధిపతి రోగముతో మూల్గుచుండగా వైద్యుడు వచ్చెను.

[illegible] [illegible]చాతి, జబ్బుగానున్నట్లుండెను. అతడు [illegible] తలను [illegible]తో వొక్కి పట్టుకొనియుండెను.

ఏమి సమాచారము? ఏమి జరిగినదని నేనడిగితిని. అతని కొడుకు "అయ్యా! చెప్పెదను వినుడు. ఈ పట్టణములో మిగుల ధనవంతుడైన సాంలాల్ కుమారునికి మా స్నేహితుని కూతురినిచ్చి వివాహముచేసిరి. నిన్నటిదినము మమ్ము పెండ్లికి పిలిచిరి. వీధులలో గొప్ప యూరేగింపు జరిపించిరి. అటుపిమ్మట విందు జరగెను. మేము విశేషముగా భుజించితిమి. నెయ్యితోను, చక్కెరతోను, వాసనద్రవ్యములతోను చేయబడిన ఫలాహారములు అనేక తట్టలయందుంచిరి. కుప్పలు కుప్పలుగా, మిఠాయిలా నుంచిరి. త్రాగుటకుకూడ కావలసినంత యుండెను. సాహుకారు యూరపుదేశపు సారాయములతో నిండిన పెక్కు బుడ్లను తెప్పించెను. చాల కైపుగలిగించునట్టి సారాయములను, ద్రాక్షరసములను పట్టణములో నుండు కొన్ని యంగళ్లనుండి తెప్పించెను. మా పినతండ్రి [illegible] త్రాగలేదుగాని, కండ్లకగుపడిన ప్రతి [illegible] మిఠాయీలను, ఫలాహారములను కడుపు[illegible] [illegible]చెను. తాను స్థూలశరీరుడయ్యును, [illegible] [illegible] మనుష్యులకంటె [illegible] తినెను. మేమును [illegible] [illegible] త్రాగితిమి. మేము మా యింటికి [illegible] [illegible] [illegible] [illegible] [illegible] [illegible] [illegible] [illegible]

తలనొప్పితో బాధపడుచు చాల ప్రొద్దుపోయి నిదురనుండి లేచితిని. మా తండ్రియో నాకంటెను అమితముగా త్రాగినందుచే రెండు ఘంటలుగా మూల్గుచున్నాడు. తాను చత్తునని అనుకొనుచున్నాడు. నీవతని రోగమును మాన్పగలవా" యని అడిగెను.

రాజు:—నాకిప్పుడు తెలిసెను. నాయొక్క కోశాధిపతి త్రాగినాడా! (ప్రభువులనందఱిని నొకక్షణము చూచి) ఇది చాల నీచమేగాక నా యాస్థానమునకే యవమానము తెచ్చిపెట్టినది. వాని తమ్మునికేమి? వైద్యుడుగారూ!

వైద్యుడు:—నేనా కోశాధిపతిని పరుండబెట్టి వానితలకు కొంచెము మంచుగడ్డపెట్టి కట్టితిని. పిదప నిద్రబోవుటకు అతనికి మందు ఇచ్చితిని. అతను చాలకాలము నిద్రబోవుచు, నేను వాని ప్రక్కన కూర్చొనియున్నప్పుడు నా చేయిని తన చేతితో పట్టుకొనియుండెను. కట్టకడపట బాగుగా నిదురపట్టినందున నిదురబోవుచు నా చేతిని విడచెను. ఆవల నేను అతనితమ్ముని చూచుటకు వెళ్లితిని. కోశాధిపతికన్న అతను చాల హీనస్థితిలో నుండెను. అతను తెల్లబాఱియుండెను. ప్రాతఃకాలమంతయు అతనికి వాంతియు, భేదియు నగుచుండినందున కలరా తగిలినదని అతను అనుకొనెను. అతని నాడి చాల బలహీనముగా నుండెను. అతడు మాట్లాడుటకు శక్తిలేనివాడుగా చూపట్టెను. "మాట్లాడ ప్రయత్నింపవలదు. నాకంతయు విశదముగా తెలియును. ఊరక పండుకొనుము. కొంత

కాలమయినపిమ్మట నీకు నెమ్మదిగానుండును. నీకు ఏ మందును పనిలేదు గనుక నేను మందియ్యను. ఒక ఘంట లోగా నీవు మఱల వాంతిచేసికొనియెదవో లేదో చూచుటకు నేను మఱల వచ్చెదను. భయపడవలదు. నిద్రపోవుటకు ప్రయత్నింపుము. సాయంకాలములోపల శీఘ్రముగా నీకు వ్యాధి కుదిరి నెమ్మదియగును" అని నేను చెప్పితిని.

అన్నదమ్ములిరువురును నిద్రించిరని తెలియగానే నేను వారి యిల్లువిడచి దర్బారునకు వచ్చితిని.

ఇట్లుచెప్పిన పిమ్మట వైద్యుడు కూర్చొనెను.

రాజు:—నేనిట్టి వార్తలు వినుటకు చాల చింతిల్లుచున్నాను. అయిన నాయొక్క యాస్థానమునందు ప్రభువులలో కోశాధిపతిమాత్రమే త్రాగుటకు అలవాటుజేసెననుటకు జంకుచున్నాను. నేను నీతో మాటలాడవలయునని కోరిన విషయములలో నిదియొకటి. నిన్నడుగుటకు నాకెన్నియో విషయములు కలవు. పెక్కు వ్యాధులు రాకుండ జేయుటకును, వచ్చినయెడల వానిని పోగొట్టుటకును త్రోవలు జెప్పియున్నావు. తినెడు ఆహారమును గుఱించియు, త్రాగెడు నీరు, సారాయము మొదలగు ద్రవపదార్థములను గుఱించియు నీవిప్పుడు మాకు చెప్పవలయును. రోగములవాత బడకుండ సౌఖ్యముగా నుండుటకు నేనును, నాయొక్క రాజ్యమందలి ప్రజలును ఏయే వస్తువులను తినకూడదో, వేనిని త్రాగకూడదో, దేహారోగ్యమును గలిగి

యుండుటకు ఏవిధమైన ఆహారమును భుజింపవలయునో, వేనిని త్రాగవలయునో చెప్పుము. మా యిండ్లు శుభ్రముగా నుండినను, ముఱికినీటిని నిలువకుండా దూరముగా కొనిపోవుటకు తగుమైన కాలువలుండినను, జ్వరము, ప్లేగు, కలరా, క్షయరోగములచే బాధింపబడకుండినను మాలో చాలమంది పలుమాఱు జబ్బుగానుందురు. ఇందుకు కారణము మేము భుజించెడి ఆహారములందుగాని, మా యాచారములందుగాని యుండుట నిశ్చయము. ఓ వైద్యుడా! ఈ విషయములగూర్చి కొన్ని చట్టముల నేర్పఱచి మాకు ఇమ్ము.

వైద్యుడు:—రాజా! అంతయు నేను చెప్పెదను. నేను బయలుదేరి యిచ్చటికివచ్చిన ఆరోగ్యదేశమున ఈ విషయములన్నిటిని గుఱించి మేము చదివియున్నాము. బుద్ధిమంతుడగు మా మహారాజుగారు వీనిని గుఱించి పెక్కు చట్టములను చేసియున్నారు. బ్రాందియు, ఇంకను ఎక్కువ కైపుగలిగించు సారాయముల త్రాగి మీ కోశాధిపతి ఏ గతికివచ్చెనో మీకు తెలియునుగదా? నే జెప్పుదానిలో నిదియే మొదటి విషయము. అయిన మొట్టమొదట మీ యాస్థానమున నిప్పుడుండు ప్రభువులలో నెవ్వరైన తనకు తెలిసినంతవఱకు మితిమీఱి త్రాగుటవలన కలుగు నష్టములగుఱించి చెప్పగలరా?

వైద్యుడు యీ మాటల చెప్పగానే వజీరు తన యాసనమునుండి లేచి నిలువబడి మాటలాడ నారంభించెను.

అతడు అతి ఎక్కువగ చదివిన పండితుడు. అందఱు అతనిని చాల గౌరవముతో చూచుచుండిరి.

వజీరు:—నేను నా చిన్నతనమున ఒక గొప్ప కళాశాలలో పెక్కు సంవత్సరములు చదివి, అనేక విషయములను నేర్చుకొని నది యీ రాజుగారికే తెలియును. అన్ని విషయములందును నాకు చరిత్రలయందు మిగుల ప్రీతి యుండెను. నేను పెక్కుదేశముల చరిత్రల చదివితిని. అందులో పర్షియా దేశ చరిత్రమునుగూడ చదివితిని. పూర్వకాలమున గ్రీకులు చాల చదివినవారు, విద్వాంసులు. వారిలో నొకడు పర్షియాదేశమును పూర్వమేలుచుండిన రాజులను గుఱించి కొన్ని కథలను వ్రాసియుండెను. ఆ కథలలో ఘనుడైన సైరసురాజునుగుఱించి యొకటి యుండెను. మీరు నాకుత్తరువిచ్చిన దానిని మీకు చెప్పెదను.

రాజు:—ఆ కథ చాల పెద్దదా? అటులయిన నిపుడు చెప్పవలదు. ఇపుడు చాల ప్రొద్దుపోయినది. రేపు చెప్పవచ్చును. రేపు మా కోశాధిపతియు వచ్చును. ఈ కథను అతడుకూడ వినవలయునని నా యిష్టము. అది అతనికి గొంచెము మేలుజేయును.

వైద్యుడు:—(లేచి నిలచి) రాజుగారు నాకిపుడు ఉత్తరువు ఇచ్చినయెడల, దర్బారును విడుచుటకు పూర్వము నేను ఒక మనవి చేయనున్నాను.

రాజు:—చెప్పుము. నీ విన్నపమేమి?

వైద్యుడు: — నా యుపదేశమును ఇంత ధైర్యముతో చెప్ప బూనుకొన్నందులకు నన్ను మన్నింపవలయును. నేను తలచినట్లుగా, మీ కోశాధిపతి దర్బారునకు రేపు వచ్చినట్లయిన బహిరంగముగా నేడు నే చెప్పినదంతయును గుఱించి మాటలాడగూడదు. రాజుగారికి మంచిదని ఏదైన తోచినదాని నితరులకు తెలియకుండా చెప్పవచ్చును. అందఱియెదుట రాజుగారు అతనిని కోపించుకొనినయెడల అతని మనస్సునకు బాధ కలుగును. అదియుగాక అతడు ఆస్థానమునందు చాలకాలమునుండి యున్నాడు. పలుమారు అతను అవమానపడును. మిక్కిలి దుఃఖించును.

రాజు:—నీవు చాల దయగలిగినవాడవనియు, బుద్ధిమంతుడవనియు నాకు ఏర్పడుచున్నది. నీ యాలోచన బాగున్నది. కోశాధిపతికి నేనొక్కటియు బహిరంగముగా చెప్పను గాని అతనిని పిలిపించి మంచి బుద్ధిచెప్పి పంపెదను. ఇప్పుడు దర్బారు చాలించినారము. రేపు ఒక ఘంటకు మనమందఱము ఇందు చేఱుదము.

పాఠము 3.

ఘనుడైన సైరసు కథ.

మఱునాడు దర్బారునందు ప్రభువులందఱు వచ్చియుండిరి. రాజకుమారుడుకూడ వచ్చియుండెను. తన తండ్రి

గారి పట్టణమునకు వైద్యుడు వచ్చియుండినపుడు ఈ రాజకుమారుడు తన దేశమునందు సంచారముచేయుచుండెను. రాజుగారు అతనికై హంగామి మనిషిచే సమాచారము పంపగా అతడు మిగుల శీఘ్రముగా మఱలి తన యూరు చేరెను. కోశాధిపతియు వచ్చియుండెను. అతడు జబ్బుగానున్నట్లే కనుబడుచుండెను. అతని కండ్లు ఎఱ్ఱగనుండెను; చేతులు వణకుచుండెను. తాను చేయుచుండినది అందఱికిని తెలియునేమోయనియు, రాజుగారు తన్ను బహిరంగముగా కోపగించుకొనుననియు భయపడుచు మిగుల ఆతురముతో నుండెను. అయినప్పటికిని ఎవ్వరును ఏమియు మాటలాడలేదు. రాజుగూడ ఏమియు జరుగనటుల నమస్కారమునకు ప్రతినమస్కారము చేసెను.

వజీరు:—(లేచి నిలచి) రాజుగారి యుత్తరువుచే నేనిప్పుడు ఘనుడైన సైరసుయొక్క కథను చెప్పుచున్నాను.

ఇతడు 2,500 సంవత్సరములకు పూర్వము గొప్ప కీర్తి సంపాదించిన రాజులలో నొకడు. పర్షియాను, పశ్చిమ ఆశియాయందలి పెక్కు యితరదేశములను అతడు పాలించుచుండెను. అతనిని పర్షియనులు ఖుస్రూయని పిలుచుచుండిరి. పర్షియారాజ్యమును సైరసు ఏర్పఱచినవాడు.

సైరసు చిన్నవాడుగానున్నప్పుడు అతని తండ్రియగు పర్షియాదేశపురాజు తన ఆస్థానమున పెంచుచుండెను. ఆ రాజ్యము అప్పుడు చాల చిన్నదిగానుండెను. అందలి జనులుగూడ వెఱ్ఱిగొల్లలుగా నుండిరి. మెడియాయను

రాజ్యముప్రక్కన ఉండెను. అది మిగుల ధనమును, బలముగలదియై యుండెను. మెడియా దేశపు రాజుకూతురిని పర్షియా దేశపురాజు వివాహమాడెను. ఇందుచే మెడియా దేశపురాజు సైరసునకు తాతయయ్యెను.

సైరసు మిగుల కఠినుడైన గురువునొద్ద శిక్షబొందెను. సైరసు ఎప్పుడైన తప్పుచేసిన అతని గురువు అతనిని తప్పక శిక్షించుచుండెను. బీదవారు బ్రతుకునటుల నుండుటకును, సత్యము పలుకుటకును, ఇతరులను బాగుగ గౌరవించుటకును, తానేదిచేసినను న్యాయముగా జేయుటకును నేర్పెను. అతనికివియేగాక, కుస్తీపట్టుటకును, పరుగెత్తుటకును; ఆ కాలమందుండిన యుద్ధోపకరణముల వాడుటకును, విల్లుతోను, బాణములతోను చంపుటకును, ఈటెల విసరి వేయుటకును, డాల్‌కత్తుల వాడుటకును ఆ గురువు సైరసునకు నేర్పెను. ఆ కాలమందు పర్షియా దేశములోని జనులకు గుఱ్ఱములు లేనందున కాలినడకతోనే యడవి మృగముల వేటాడుటకునుగూడ నేర్పెను. అతడు పెద్దవాడగునప్పటికి మిగుల అందముగాను, బలవంతుడుగా నుండెను.

మెడియారాజగు సైరసు తాత, అతనినిగుఱించి చాల విషయములు వినియున్నందున, అతనిని చూడవలయునను కోరిక గొనియుండెను. సైరసు పండ్రెండు ఏండ్ల వయస్సు గలవాడుగా నున్నప్పుడు అతని తాత అతనిని రమ్మని వార్త పంపెను. అది వినగానే సైరసు తన తాతగారియూరికి పోయెను. తాత దర్బారును, అందుండు డంబమును, శ్రేష్ఠ



 రాణిగారి పుట్టినదినమున విందు.

మైన ఉడుపులను, వారి కంఠహారములను, కడియములు, గొలుసులను, విలువగల నగలను ధరించియుండు అచ్చటి ప్రభువులను చూచి సైరసు మిగుల ఆశ్చర్యపడెను. అంతకు పూర్వము అటువంటిదాని నతడెన్నడును చూచి యుండలేదు.

అతడాపట్టణము చేరిన ఒకటి రెండు నెలలవెనుక, అతని తాత రాణిగారి పుట్టినదినమున ప్రభువులకును, గొప్ప మనుష్యులకందఱికిని విందొనర్చెను. ఆ విందునకు యీ రాజకుమారుడగు సైరసునుకూడ పిలచెను. రుచికరములైన పదార్థములతోను, అన్నివిధములయిన మిఠాయీలతోను నిండినటువంటి బంగారు, వెండితట్టలను, అరుదై మిగుల వెలగలిగి యింపుగనుండు సారాయములతో నిండిన బంగారుగిన్నెలను భోజనమునకై వాడు బల్లల మీఁద నుంచెను. ఆ రాజకుమారుని ఎదుట పండ్రెండు బంగారు తట్టలును, సారాయములతోనిండిన పెక్కు గిన్నెలును ఉంచిరి. తన చిన్నిమనుమడు చాల సంతోషపడు ననియు, కావలసినంత కడుపార తిని, నోరార త్రాగుననియు తలచెను; అయిన ఆతనికి ఆశ్చర్యముగలుగునట్లు సైరసు ఒక్కటియు తాకలేదు. ఆ సారాయమును అతడు తాకను లేదు, రుచిచూడను లేదు.

రాజు:—నీవు పర్షియాదేశమునందు చూచిన విందుల కన్న నిది గొప్పదిగాను, చాల మేలైనదిగాను ఉండలేదా? నీవేల తిని త్రాగి సుఖమనుభవింపవు?

సైరసు:— ఇచ్చటనుండు తట్టలలోనున్న వానిలో కొంచెముగా తినుట చాల కష్టముగానున్నది. మా పర్షియాదేశమందు మేము దీనికన్న బాగుగా నడచుకొందుము.

రాజు.—(చిరునవ్వు నవ్వుచు) నిశ్చయమా? పర్షియాలో నీవేలాగున నుంటివి?

సైరసు:— పర్షియాదేశమందు గొట్టెయు, మాంసములతోనిండిన తట్టయొకటి యుంచుకొందుము. ఒక జాడిలోని గిన్నెడు నీళ్లుమాత్రమే త్రాగెదము. ఆకలిగొన్నప్పుడుమాత్రమే భుజింతుము. దప్పిగానున్నప్పుడు నీరు త్రాగుదుము. ఇది మమ్ముల సౌఖ్యవంతులుగాను, బలవంతులుగాను జేయుచున్నది. మేము అరుదుగా రోగులగుదుము.

అతని తాత తన యిష్టమువచ్చినట్లు నవ్వెను.

రాజు:—సంకోచింపక నీ యిష్టమువచ్చినట్లు చేయుము. రొట్టెలను తిని, నీటిని త్రాగి సౌఖ్యముగాను, బలవంతుడవుగానున్న నీ యూరికి పొమ్ము. అయిన నీకై చేసిన యింత విలువగల రుచికరములగు పదార్థముల నేనేమి చేయవలెను?

సైరసు:—వానిని నాకు యిమ్ము.

రాజు:—మంచిది. నీవు ఆహారమును తినకపోయినట్లయిన ఆ తట్టల నీవేమిచేయుదువు?

సైరసు:— నేనిక్కడికి వచ్చినప్పటినుండి నన్ను చాల

దయతో చూచుచుండినవారికి వానిని బహుమానముగా నిచ్చెదను.

రాజు:—నీ యిష్టమువచ్చినట్లు చేయుము.

పిమ్మట సైరసు తన కుపచారములుచేయుచున్న అనుచరులను ఒక్కొక్కనిగా బిలచి, వారిలో నొక్కొక్కనికి రెండేసి వెలగల బంగారు వెండితట్టల నిచ్చెను. అతను ఒక్కని పిలచి "నీవు నాకు స్వారిచేయుటకు నేర్పితి గనుక ఇది నీకు" అనియు మఱియొక్కనితో "నీవు నాకు ఒక యీటె నిచ్చినందులకు ఇది నీకు" అనియు మూడవ వానిని పిలచి "నీవు మా తండ్రిగారికి బాగుగాను, నమ్మకముగాను సేవచేయుచున్నాడవు గనుక యిది నీకు" అనియు, నాలుగవవానితో "మా తల్లిగారికి సేవచేయుచున్నావు గనుక యిది నీకు" అనియు చెప్పెను. డంబముగా యుడుపుల ధరించి, యున్నతపదమందున్న ముఖ్య ఉద్యోగస్థునికి అతడేమియు నీయలేదు. అతడు రాజుగారియొద్దనుండే ఒక విధమైన పరిచారకుడు. రాజుగారికి గిన్నె అందిచ్చుటకుముందు, దానియందుండు సారాయమును రుచిచూచుట అతని పని. రాజుకు ఆ గిన్నె నిచ్చుటకుముందు దానిని తన పెదవులకంటించుకొని త్రాగక వేరొక గిన్నెయందు కొంచెము పోసికొని రుచి చూచుటకు త్రాగును.

రాజు:—నాయొద్దనుండు సేవకులలో ముఖ్యుని గమనించక యూరక విడచిపెట్టితివేల?

సైరసు:—అతడు నీకు సరిగా సేవజేయుటలేదు. నీకు ఇచ్చెడు సారాయములో అతడు విషమును కలుపుచున్నాడు.

ఇప్పుడీ విషయమును గుఱించియే యీ రాజు చాల దిగులుపడుచుండెను. తనకు విషముపెట్టుదురని అతడు భయపడెను. ఈ మాటల నతడు వినగానే ఒక్క కేకతో వెనుకకు అదరిపడెను.

రాజు:—ఏమి? ఏమి? నీవేల దానిని చెప్పెదవు? అతడు నా సారాయములో విషము కలుపునని నీకెట్లు తెలియును? అతడు దానిలో విషము కలుపుచుండఁ జూచితివా? అతడెప్పుడు అట్లు చేసెను?

సైరసు:—అతడట్లు చేయుచుండగా దానిని నేను చూడలేదు. నీ పుట్టినదినమందు, మీరు విందుబెట్టితిరి. నాడు మీయొక్క ప్రభువులను మిమ్మును చూచి ఆ విషముయొక్క మహిమ కనుగొంటిని. అందువలననే అతడట్లు చేసియుండవచ్చునని తెలిసికొంటిని.

రాజు:—(ఇంకను భయముతో) ఏమి? అప్పుడేమి జరిగెను?

సైరసు: — నాడు మీరు సారాయమును త్రాగితిరే, అది మిమ్ముల వెఱ్ఱివాండ్రనుగా చేసెను. మీరు మీ చిన్నవారికి చేయగూడదని జెప్పిన విషయములనెల్ల మీరు మీకే చేసికొంటిరి. మీరు చాల మోటుతనముగా నడచుకొని నోటికివచ్చినట్లు అరచుచుంటిరి. ఒకరు చెప్పినది మఱి

కొంకరు వినుటకు వీలులేకుండునట్లు మీరందఱు గట్టిగా అఱచితిరి. మీరందఱు ఒకప్పుడే కథలుచెప్ప ప్రయత్నించితిరి. ఒకరు చెప్పునది ఒకరు వినలేదు. పిమ్మట మీరందఱు నాట్యమాడ ప్రారంభించితిరి. మీరందఱు కూర్చొన జాలకపోతిరి; మీ కాళ్లమీద నిలచియుండనేరకపోతిరి. కొందఱు నేలపైబడితిరి. మీరెవ్వరైనదియు, ఏమి చేయుచుండినదియు మీరందఱు మఱచిపోయినట్లుండెను. విందునకు వచ్చినవారు నిన్ను గౌరవించకుండిరి. నీవు వారి రాజువైనను నిన్ను మర్యాదలేక మాటలాడుచుండ, నీవును వారిని అదేరీతిగా చూచితివి. వేయేల, మీరందఱు బుద్ధిలేనివారివలె నడచుకొంటిరి. నీ ముఖ్యసేవకుఁడు నీ సారాయమునందు విషము కలిపెనని నేను ఈ విధముగానే తలచితిని. కాబట్టి వానికి నేనెట్టి బహుమానమును ఈయను.

రాజు: —(భయమునుండి తొలగి సంతోషముతో) ఇంతేనా? అయిన నీవిటువంటి విషయముల నిదివఱకెన్నడును చూచియుండలేదు. మీ తండ్రిగారు తనకు సంతోషమునిండువఱకు సారాయి త్రాగుటలేదా?

సైరసు:—నిశ్చయముగా లేదు. తనకు దప్పి కలిగినప్పుడే నీరుమాత్రము త్రాగెదరు. అదియును దప్పితీరునంతవఱకే త్రాగెదరు. మీరును, మీయొక్క ప్రభువులును నడుచుకొనునటుల నేనొక్కనాడైనను అతడు నడుచుకొనఁగా చూడలేదు. అతనికి సారాయి రుచిచూచి పోసియిచ్చు నొక ముఖ్యసేవకుడును లేడు.

మహారాజు: — (ఈ కథను వినుచుండి) ఇది చాల మంచికథగానున్నది. నేను పలుమారు ఘనుడైన సైరసును గుఱించి చదివియున్నానుగాని, అయిన అతనిని గుఱించిన యీ కథను యిదివఱకెన్నడును వినియుండలేదు. అతడు చాల గొప్పవాడయి, కీర్తిశాలియయి, పెక్కురాజ్యముల బట్టుకొనినాడనుటలో ఏమి వింత?

వైద్యుడు: — నాకుగూడ ఈ కథ తెలియును. నజీరుగారు మనకు ఈ కథను చెప్పినందులకు నేను చాల సంతోషించితిని. త్రాగుటవలన మనకు ఏ కీడు కలుగునో, మనుష్యులు త్రాగినప్పుడు ఎట్టి నీచకృత్యములను చేయుదురో, వీనినిగుఱించి బాగుగా మనకిది తెలియపరచుచున్నది.

ఈ కథను చెప్పునంతకాలమును ఆ కోశాధిపతి చాల వ్యాకులముతో నుండెను. అప్పుడప్పుడు అతడు రాజు వేరు దిక్కును చూచుచుండినప్పుడు అతనిని క్రిందిచూపుచే చూచుచు, మఱల చూడనట్లు నటించుచుండెను. అతను ముఖము చిట్లించుకొనునటులగాని, యిష్టపడకపోయినటుల గాని యుండలేదు. అంతకుముందు జరిగిన సమాచారమును గుఱించి ఆ వైద్యుడేమియు చెప్పలేదు. ఆస్థానపు ప్రభువులందఱు యథావిధిగా అతనిని సంతోషముతో గౌరవించిరి. "నేనికమీద యెప్పుడుగాని ఒక్క బొట్టు సారాయమునైన త్రాగను. నిశ్చయముగా కొంచెములో నేను తప్పించుకొంటిని. ఆస్థానములోనుండు నా యుద్యో

గమును పోగొట్టుకొనియుందును. నేను నా యుద్యోగమును అవమానముతో వదలిపోయియుందును. దర్బారు ముగిసినందులకు చాల సంతోషించుచున్నాన"ని అతనికతనే యనుకొనెను. తన వంతు వచ్చినప్పుడు అతడు రాజుగారికి నమస్కారముజేసెను. రాజుగారు ఎల్లప్పుడుండెడు విశ్వాసముతోనే ప్రతినమస్కారము చేసెను.

పాఠము 4.

ఆ హా ర వి ధు లు.

మఱునాడు దర్బారు ఆరంభించెను. అందఱును వచ్చియుండిరి. వైద్యుడు వచ్చి రాజునకు వందనములర్పించి కూర్చొనెను.

వైద్యుడు:— భుజించుట, త్రాగుట వీనిని గుఱించిన ఆరోగ్యవిధులను రాజునకును, యువరాజునకును, ప్రభువులందఱికిని బోధించుటకు సిద్ధముగా నున్నాను. ఈ విధులు నిశ్చయముగా చాల ముఖ్యమైనవి. ఆరోగ్యదేశమగు మా దేశములో, బాలురకుగూడ పాఠశాలలలో ఈ విధులను నేర్పుదురు. అయిన నీ దేశమందు ఏయే జాతులవారు, మతములవారున్నారో, ఏయే వస్తువుల భుజింతురో, వీనిని మొట్టమొదట నాకు తెలియచెప్పుడు. ఒకవేళ దివానుగారే మాకు చెప్పుదురు.

దివాను:— ఈ దేశములో అనేక జాతిమతభేదములున్నవి. బ్రాహ్మణులలో పెక్కుతెగలుగలవారున్నారు. పెక్కు శూద్రులలో పెక్కుతెగలుగలవు. మహమ్మదీయులు; క్రీస్తులు; కొందఱు పార్సీలును ఉన్నారు. ఒకొక్క జాతికిని ఆ జాతి భోజనవిధానమును గుఱించి కొన్ని విధుల నేర్పరచియున్నారు. సాధారణముగా బ్రాహ్మణులు కూరగాయలను, పండ్లను తినుదురేగాని మాంసమును తినరు. కొందఱు శూద్రులుకూడ యిట్లే చేయుదురుగాని పెక్కుమంది మాంసమునే తినెదరు. మహమ్మదీయులు మాంసము, కూరగాయలు, పండ్లను తినెదరు. క్రీస్తువులుకూడ యిట్లే చేయుదురు. వడ్లు, జొన్నలు, రాగి మొదలగు ధాన్యములను జనులందరు తినెదరు. మామిడిపండ్లు, అరటిపండ్లు, సీతాఫలము మొదలగు పండ్లు మన దేశములో అనేకములున్నవి. చక్కెర దొరకిన వారెల్లరును తినెదరు.

వైద్యుడు:—ఇప్పుడు తెలిసెను. మా దేశములోకూడ శీతోష్ణస్థితి యిక్కడివలెనే యున్నది; జాతిమతభేదములున్నవి; మీరు తినెడు వస్తువులనే ఆహారముగా గైకొందుము. కట్టకడపట పెక్కుజాతులుండి, ఒకొక్కజాతి దాని విధుల నిర్మించుకొని యుండినప్పటికిన్ని, మనుష్యులందఱు ఒకేతీరున నున్నారు. ఒకేవిధమైన ఆహారమును తినెదరు. నీవు బ్రాహ్మణులు మాంసమును తిననేతినరని చెప్పలేదా? వారు కూరగాయలను, ధాన్యములను, పండ్లను భుజింతురని చెప్పితివిగదా?

దివాను:—అవును. నేను బ్రాహ్మణుడను. నేను పుట్టినదిమొదలు ఈ కాలమువఱకు మాంసమును తినలేదు.

వైద్యుడు:—(చిఱునవ్వు నవ్వుచు) నిశ్చయమే. నీవెప్పుడైనను పాలు త్రాగవా? పాలతోను, చక్కెరతోను చేయబడిన మిఠాయీలను నీవెప్పుడైనను తినవా? నీవు పెరుగుకాని, చల్ల(మజ్జిగ)గాని ఎప్పుడైనను త్రాగవా? నీవు ఎప్పుడును నెయ్యిని ఉపయోగించుట లేదా?

దివాను: — ఆహా! అవును. వీనిని నేను త్రాగుచున్నాను. బ్రాహ్మణుని ఆహారము విశేషముగా పాలతోను, చక్కెరతోను చేసిన వస్తువులని, అందఱికి తెలియును.

వైద్యుడు: — అట్లైన నీవు నీ జీవితకాలమంతయు జంతువులనుండికలుగు ఆహారమును తినుచుంటివి. నీ విప్పుడున్నట్లు సౌఖ్యముగా నుండుటకు ఇదియొక కారణమనుటకు సందేహము లేదు. పాలు జంతువులనుండి కలుగు ఆహారము. అది కూరగాయలలో చేరినదికాదు. పండ్లలోను, ధాన్యములలోను చేరినదికాదు. ఆహారములన్నిటియందు నిది చాల మంచిది. శరీరమునకు పుష్టిని కలుగజేయును. చిన్నపిల్లలు ఇక దేనిని త్రాగరని మనకందఱకు తెలుసును, తల్లిపాలవలననే వారు జీవింతురు. అదికూడ జంతువులవలన కలుగు ఆహారములలో చేరినది. ఇట్లే ఆవుపాలును, గొఱ్ఱెపాలును ఆ జాతిలో చేరినవి.

దివాను:—జంతువులనుండి కలుగు ఆహారమని నేను

చెప్పినప్పుడు మాంసము, చేపలు, గ్రుడ్లు మొదలగునవి అని నేను తలచితిని. పాలని నేనర్థముచేసికొనలేదు. సందేహములేకుండ నీవు చెప్పునదంతయు నిశ్చయమే. పాలు జంతువువలన కలుగుచున్నదిగాన అది జంతువులవలన కలుగు ఆహారములో చేరినదే.

వైద్యుడు:—అందుకు సందేహమా? పాలంతయు జంతువులవలన కలుగు ఆహారములో చేరినది. ఇటువంటి ఆహారము కొంచెమైనను లేక, ఏ మనుష్యుడుగాని కొంతకాలమైనను బ్రదుకజాలడు.

యువరాజు:—(వీరిద్దరికి జరుగుచుండిన సంభాషణమును జాగ్రత్తతో వినుచుండి) ఆహారము ఎన్ని విధములుగా భాగింపబడియున్నదో మనమందఱము తెలిసికొందము. మాకు నీవు దీనిని చెప్పగలవా?

వైద్యుడు:—అవశ్యము చెప్పెదను. ఆహారములన్నిటిని మిగుల జాగ్రత్తతో పరీక్షచేసిన విద్యావంతులు, వానిని నాలుగు గొప్ప తరగతులుగా విభజించియున్నారు. ఈ తరగతులలో మొట్టమొదటిది: మాంసము. "మాంసము" అను పదమునకు జంతువులయొక్క మాంసమని అందఱు సాధారణముగా మాటలాడునప్పుడు తలచు అర్థమే యైనను, దానికి అది యొక్కటియే అర్థముకాదు. "జంతువులవలన కలిగెడు ఆహారమ"ని నేను బలికినపుడు పాలు, నెయ్యి, వెన్న, గ్రుడ్లు, మాంసముకూడ వీనిలో చేరియున్నవని నా భావము.

యువరాజు:—అది అటులయితే నీవు చెప్పెడురీతిగా అన్ని జాతులవారు మాంసమును తినుచున్నారు. నేను రాజపుత్రుడను, నాయొక్క స్నేహితుడగు దివాను బ్రాహ్మణుడు, అయినను మేమిద్దఱము జంతువులవలన కలుగు ఆహారమును తినుచున్నాము. నేను మాంసమును తినుచున్నాను. అతడు తినడు. ఇందువలన నేను త్రాగు పాలకంటె అధికముగా అతడు త్రాగునని అనుకొందము. జనులందఱు సౌఖ్యముగానుండుటకు కొంచెమైనను అట్టి ఆహారమును తినవలయునని నీవు అనెదవు. అయితే రెండవ విధమగు ఆహారమెద్దిగానుండునో తెలిసికొనవలయునని ఆశ పుట్టుచున్నది. ప్రతి మనుష్యుడును నాలుగు విధములగు ఆహారములను తినవలయునని చెప్పితివికదా?

వైద్యుడు:—అవును. అది నిశ్చయమే. ఆ రెండవ విధమగు ఆహారమును "క్రొవ్వులు" అని చెప్పుదును.

దివాను: — మంచిది. నేనెప్పుడును క్రొవ్వు తినుటలేదని నిశ్చయముగా నాకు తెలియును. క్రొవ్వు జంతువుల మాంసములో నొక భాగము. నేనెప్పుడును మాంసమును తినినదిలేదు.

వైద్యుడు:—మఱల నీవు పొఱపడితివనుటకు నాకెంతయు సందేహములేదు. నిశ్చయముగా నీవు మాంసముతో కూడియుండు క్రొవ్వును తినుటలేదా? అయిన మాంసములో లెన్నివిధములున్నవో అన్ని విధములగు క్రొవ్వులును గలవు. నీవు నెయ్యిని త్రాగెదవుగదా? జున్ను, మీగడ

తినుటలేదా? ఇవియన్నియు క్రొవ్వులలో చేరినవి. ప్రతివాడును, తాను సౌఖ్యముగా నుండుటకు ఒకవిధమైన క్రొవ్వును తినవలయును.

యువరాజు:—మంచిది. మన దేహములు సౌఖ్యముగా నుండుటకై మనము గైకొనవలసిన మూడవ ఆహారమేమి?

వైద్యుడు:—మనము తినవలసిన ఆహారములలో మూడవది చక్కెరయును సత్తును. చక్కెర ఎంత రుచిగనుండునో, అది ఏమిటో, మనకందఱకును తెలియును. అన్ని జాతుల జనులు—చక్కెరను తినుచున్నారు. ఈ దేశములో చక్కెర చెఱకునుండి చేయబడుచున్నది. అయిన ఐరోపాఖండమందు బీట్ గడ్డనుండి చక్కెరను అధికముగ చేయుచున్నారు. అమెరికాలో మాపిల్ చెట్లనుండి చక్కెరను చేయుచున్నారు. తియ్యని పండ్లన్నిటియందును చక్కెర యున్నది. ఎండిన ద్రాక్షపండ్లయందు చక్కెర ముద్దలు ముద్దలుగానుండుట నీవు చూడగలవు. అరటిపండ్లయందును చక్కెర అధికముగ నున్నది. అందువలననే యీ దేశమందు పెక్కు జనులు అరటిపండ్లను, అటువంటి పండ్లను పెక్కింటిని తినుచున్నారు.

దివాను: — ఆఁ. ఇది మాకు తెలియును. సత్తును గుఱించి నేనెప్పుడును వినియుండలేదు. అది యెట్టిది? నేను సత్తును దినుచున్నానా? నాకు ఆశ్చర్యముగా నున్నది. జంతువులవలన మనకు కలుగుచుండెడి మాంససంబంధమైన వస్తువులను నేనెన్నడును తినుటలేదని తలచితిని.

పాలుగూడ దాని సంబంధమైనదని నీవు నాకు తెలిపితివి. నా జీవితకాలమంతయు నేను సత్తునుగూడ తినుచున్నా నని నీవిప్పుడు చెప్పబోయెదవేమో?

వైద్యుడు:— అవును. నీ జీవితకాలమంతయు నీవు బియ్యమును తినుచుంటివి. ఇప్పటికిని తినుచున్నావు. లేదా? అటులనే గోధుమలు. గోధుమలచే రొట్టెల చేయుచున్నారు. ఈ లోకమందుండు జనులలో చాలమంది రొట్టెలనే ముఖ్యాహారముగా తినుచున్నారు. ఐరోపా దేశములో గోధుమలు తినుట చాల యెక్కువ. ఉష్ణదేశములందే వరిపైరుపండును. శీతలదేశములలోనుండు జనులకు గోధుమలు, బార్లి యితరధాన్యములు ముఖ్య ఆహారములు. రాగులు, జొన్నలు, కంబులు వీటియందును (Starch) సత్తు ఉన్నది. అన్ని ధాన్యములందును సత్తు నిండియున్నది. ఉరలగడ్డలవంటి గడ్డలయందు విశేషముగా సత్తు ఉన్నది.

యువరాజు:—ధాన్యపుగింజలకే యీ మారు పేరు సత్తు అని పెట్టబడియున్నదని నాకు తోచుచున్నది. నాలుగవ విధమగు ఆహారము ఏదియో మాకు చెప్పుము.

వైద్యుడు:— "ధాన్యము" "సత్తు" అను పదములకు ఒకటే అర్థముగాదు. ఉరలగడ్డలు ధాన్యములు కాకపోయినను మిక్కిలి సత్తుకలవి. మనము ధాన్యములలో నెక్కుడు సత్తున్నదని చెప్పవచ్చును. ప్రతివస్తువు వేనికూడికయో వివరించి చెప్పుట రసాయన శాస్త్రమెఱిగినవారి

పని. ఒక్కొక్క వస్తువు నొక్కొక్క పేరుతో పిలుతురు. అందు ధాన్యములలో నుండువానిలో ముఖ్యమగు నీ పదార్థమునకు సత్తు అని పేరుపెట్టిరి. "సత్తు"తోకూడ నితర పదార్థములుకూడ ధాన్యములయందుండుటచే నవి వేఱువేఱు రుచుల నిచ్చుచున్నవి. బియ్యమునకును గోధుమలకును రుచియందు భేదమున్నను అవి సత్తుపదార్థములే.

ఆహారపదార్థములలో నాల్గవవిధము ఉప్పుపదార్థములు. ఉప్పుపదార్థములు పెక్కులు. అందు మనము వాడుకొను ఉప్పు ఒకటి. మనకది సముద్రపునీటినుండియు నుప్పుగనులనుండియు దొఱకును. అది పెక్కు కాయకూరలయందును పండ్లదినుసులందు నుండును. పాలలోకూడ ఉప్పును చక్కెరయును కొంచెమున్నవి. మన యాహారము జీర్ణమై మనము ఆరోగ్యవంతులముగ నుండుటకు ఉప్పును ఏవిధముననైన కొంచెము మనము భుజింపవలయును.

రాజు:—నీవు ఈ విషయములను అంతయును జక్కగ చదివి గ్రహించియున్నావు. నీయట్టి విద్వాంసుడు జెప్పునదంతయు సరే. అటయిన మనము భుజించెడి కొన్ని పదార్థములలో మాంసము, క్రొవ్వు, చక్కెర, ఉప్పు, సత్తు అను పదార్థములన్నియు నున్నవి యనుకొనెదను.

వైద్యుడు:— అవును. కొన్ని యాహారవస్తువులలో నివేగాక యితర పదార్థములుకూడ కలవు.

అట్టి వస్తువులలో పాలు ముఖ్యమైనది. పసిపిల్లలు పాలుత్రాగునపుడు పైజెప్పిన నాలుగు పదార్థములను

త్రాగుచున్నారు. అవి ప్రతి మనుష్యునకును, స్త్రీకిని, పసి బిడ్డకును అవశ్యకములు. మనము తినెడి వస్తువులు కొన్నిటిలో నివన్నియు లేవు. అన్ని వస్తువు లెక్కువతక్కువలుగ నుండును. అందుచేతనే మనము పలువిధములగు వస్తువుల భుజింపవలసియున్నది. కొందఱు మాంసమునుగాని చేపలనుగాని తినరు. కాబట్టి వారు పాలు, జున్ను, నెయ్యి మొదలగు పదార్థములను ఎక్కుడుగా తినవలయును. అట్లుకాక కాయకూరలమాత్రమే తినిన వారారోగ్యవంతులును, బలవంతులునుకాక బలహీనులుగా నుందురు.

రాజు:—ఇప్పటికి చాలా ప్రొద్దయినది. ఈ దినము రాచకార్యము అధికముగానున్నది. కాబట్టి రేపటిదినము సెలవుదినము కావున దర్బారు జరపుటలేదు. అప్పుడందఱును సభచేరిన వైద్యుడు ఆహారపదార్థములను గుఱించి మఱికొన్ని విషయములను జెప్పును. ఈ దినము మనము చాలా నేర్చుకొంటిమి.

అంత సభ కలగి యెవరిత్రోవను వారు పోయిరి.

అందఱును పోయినతరువాత రాజు కోశాధిపతిని పిలిపించెను. అతఁడు మిగుల భయముతో దేహము కంపించుచుండగా వచ్చి, "నన్నుద్యోగమునుండి తొలగించును." "రాజు పెండ్లిలో జరిగిన సంగతులనన్నియు వినియుండును: సందేహము లేదు" అని అనుకొనుచు రాజు యెదుట నిలువబడెను.

రాజు కోశాధిపతిని ఏకాంతముగా నొక గదిలోనికి పిలుచుకొనిపోయి కోపమును తెలియనీయక కఠినముగా మాటలాడక మంచి మాటలచేతనే అతనికిట్లు బుద్ధి చెప్పెను.

రాజు:—నీవు రాచకీయోద్యోగులందఱిలో చాలకాలము పనిచేసినవాడవు. నన్ను మిక్కిలి నేర్పుతో కొలుచుటయేగాక నా తండ్రియొద్దను చాలకాల ముద్యోగమున నుంటివి. నీయందు నాకు గౌరవము హెచ్చు. నీచకృత్యములగాని, అగౌరవము తెచ్చు కార్యములగాని యెప్పటికిని నీవు చేయవని నాకు బాగుగ తెలియును. నీవింకను చాలకాలము నాయొద్ద కోశాధిపతిగ నుండవలయును. నేను నీ యధికారినైయైనందున నీ కలవడియుండు చెడువాడుకను, త్రాగుబోతుతనమును వదలివేయవలయునని హెచ్చరికజేయుట నాకు ధర్మము.

తరువాత వైద్యుడు నాడు సభలో తెలియజేసిన సంగతులన్నియు రాజు చెప్పి యతని మన్నింప వేడినదంతయు తెలిపెను.

రాజు:—నా రాజ్యములోని జనులును ఉద్యోగస్థులును సద్వర్తనులై యుండవలయునని నా ముఖ్యతాత్పర్యము. మనయందఱి మేలునకై నీవు త్రాగుటను మానవలయునని నీయందలి స్నేహభావమున నీ స్నేహితుడును రాజునగు నేను నిను ప్రార్థించుచున్నాను.

ఈ మాటలు విన్నతోడనే యతనికి లజ్జ కలిగెను.

కోశాధిపతి:— నేనింతకుముందే యికపై మత్తుపదార్థముల త్రాగకూడదని నిశ్చయించుకొంటిని. ఇప్పుడు మీరు త్రాగవలదని బుద్ధిచెప్పినందున మీ యెదుట ఇకపై త్రాగుటలేదని భగవంతునిపై యానపెట్టి ప్రమాణము చేయుచున్నాను.

రాజు:—అది మంచిది. నీయందు నాకు చాలా నమ్మకము కలదు. భగవంతుడు నీకనుకూలించును. అయినను మత్తువస్తువుల త్రాగుటచే కలుగు కీళ్లును అందుచే దేహమెట్లు చెడిపోవునదియు వైద్యుడు చెప్పునపుడు నీవు గమనించి వినవలయును. ఇప్పుడు జరగినదానిని నేను గాని ఉద్యోగస్థులెవరుగాని పరులతో చెప్పుదుమని నీవు భయపడనక్కఱలేదు.

కోశాధిపతి:—వైద్యుడు చెప్పినదంతయు మిక్కిలి యుపయోగకరములైనవి. నేనతనిమాటల మఱవను. అతడు మిగుల దయగలవాడు.

రాజు:—అది సరి. నీవిక పోవచ్చును.

అని యతనికి సెలవిచ్చి పంపెను.

పాఠము 5.

భోజనము ఆవశ్యకము.

మఱునాడు అందఱు దర్బారునకు సకాలమునకు వచ్చిరి.

కోశాధిపతియు తన్ను రాజు మన్నించినందులకు మనస్సుననుండిన భయమును వదలి మిగుల సంతోషముతోనుండెను. అతనికిప్పుడిన్నిదినములుండిన చింతయే లేదు. క్రిందటిరోజు రాజువద్దనుండి సెలవుతీసికొనిన తరువాత తన కుమారునితో రాజు చెప్పిన సంగతులను చెప్పి, యిద్దఱును కూడి దేవాలయమునకు పోయి యచట భగవంతునియెదుట ఇకనెప్పుడును మత్తువస్తువుల త్రాగుట లేదని ప్రమాణముచేసిరి.

నేటి దర్బారునకు ముందువచ్చినవారు కాక క్రొత్తగా వకీలొకడును సేనాధిపతి యొకడును వచ్చియుండిరి. వకీలు యిన్నిదినములు సెలవుతీసికొనియుండెను. సేనాధిపతి సైన్యముల చూడబోయియుండెను.

వకీలు మాటలాడుటయందు మిక్కిలి నేర్పరి.

వకీలు:— (రాజుతో) మీరుత్తరువిచ్చిన నేనొకటి యడుగదలచుకొన్నాను.

రాజు:—అభ్యంతరములేక నీకిష్టమువచ్చినన్ని విషయముల నడుగవచ్చును. మనమిచ్చట చేరియుండునది నేర్చుకొనుటకేకదా!

వకీలు:— నేను తెలిసికొనగోరునది మనమెందుకు భోజనముజేయుట మనమెందుకు త్రాగుట అనుటయే.

యువరాజు:— నేను భోజనముచేయకపోయిన చనిపోదునుగాన భుజించుచున్నాను.

దివాను:—నేను త్రాగునదియు అందులకే?

వకీలు:—అదంతయు సరే. దానిని మీరు చెప్పనక్కఱలేదు. నాకది ముందే తెలియును. నేనడిగినది యేమంటే మనమెందుకు భోజనముచేయుట త్రాగుట అని.

వైద్యుడు:—నేనెరిగినమట్టుకు చెప్పెదను. ఒక సంవత్సరపుబిడ్డను జూడుడు. దాని యాకారమెంతయున్నది? ఇప్పుడది పుట్టినప్పటికంటె ఎంత పెద్దదిగానున్నదో తెలిసికొనుడు. అదే అయిదేండ్లకు ఎంత పెద్దదగునో చూడుడు. పసిబాలుడు వయస్సు కానుకాను ఎదుగుచున్నాడు; పెద్దవాడగుచున్నాడు. చేతులు పెద్దవిగాను, కాళ్లు పొడవుగాను పెరిగి పెద్దవై బరువెక్కుచున్నవి. అతని దేహమింత పెద్దదెట్లాయెను? అది అతడు తిను ఆహారము వల్లనే. అతడు భోజనముచేసినపుడంతయు అతని దేహము కొంచెము పెరుగుచున్నది. అతని దేహమంతయు నతడు భుజించు ఆహారముతో చేయబడుచున్నది.

వకీలు: — అవునవును. ఇప్పుడు నాకు స్పష్టమగుచున్నది. ఒక విషయమునుమాత్రము ఆక్షేపించవలసియున్నది. సుమారు ఇరువది సంవత్సరములు వయస్సు వరకు మనుష్యుడు పెరుగుచున్నాడు. అతడు భోజనము చేయుట మానలేదే. ఇదేల? ఇరువదియొకటవ యేట నేను 5 అడుగుల 5 అంగుళముల పొడవున నుంటిని. నాకిప్పటికి అఱువదియాఱవ యేడు. నేనేల 16 అడుగుల 3 అంగుళ

ములు పొడవుగ పెఱుగలేదు. ఈ కాలమంతయు పుష్టిగా భోజనముచేయుచునేయుంటిని.

వకీలు తనకన్న బుద్ధిశాలురు లేరనుకొనెను.

వైద్యుడు: — మనము చక్కగా పెఱిగినతరువాత నిక పెఱుగకుండునట్లు భగవంతుడు మనల సృజించియున్నాడు. చెట్లు తమకు తగినంత పొడవు పెఱిగినతరువాత పైన యింకను పొడవగుటలేదు. మనము పెద్దవారైనపిదప భోజనము చేయుచుండవలయుననుటకు వేఱొక కారణమున్నది.

వకీలు:—(ఆతురముతో) మంచిది. అదేది.

వైద్యుడు:—మనకు తెలియకయే మన దేహము అరిగి పోవుచున్నది. ఆ అరుగుట మైనపువత్తి వెలుగుచుండునపుడెట్లు క్రమముగా అరుగుచున్నదో అట్లే. మన దేహమును "జీవముగల పొయ్యి (Living Stove)" యనెదరు.

వకీలు: — ఏమి! నా దేహము మండుచున్నదనియా చెప్పుచున్నావు. అట్లయిన పొగ యెక్కడ? నిప్పెక్కడ నుండిన అక్కడ పొగ కలదందురే!

సేనానాయకుడు:— అవునవును. అతని దేహము మండుచుండిన పొగ యేది చెప్పుడు.

వైద్యుడు: — పొగ లేకయే దేహము మండవచ్చును. కట్టెలు మండునపుడు పొగ లేచుచున్నదిగదా. అది కట్టెయంతయు బాగుగ మండలేదని తెలియజేయుచున్నది. మిక్కిలి చిన్నచిన్న కట్టెముక్కలు మండక పొగయై గాలి

లోనికి ఎగిరిపోవుచున్నవి. పచ్చికట్టెలు మండునపుడు పొగ యెక్కువ. ఎండుకట్టెలు మండునపుడు పొగ తక్కువ. బొగ్గు మండునపుడు పొగయే లేదు. సారాయి మొదలగు వస్తువులు మండునపుడు పొగయనునది లేనేలేదు. ఎంత బాగుగ మండిన అంత పొగ లేకుండును. అందుచేతనే మన దేహమున పొగ లేదు.

ఇట్లు మనుష్యుడు బ్రతికియున్నంతకాలము అతని శరీరములోపల మంట మండుచునేయున్నది. అందుచేతనే మన దేహము వెచ్చగానుండుట. శవములో మంట లేదు కాబట్టి చల్లగానుండును. కష్టపడి పనిచేయనుచేయను మనుష్యుని శరీరములో నిప్పు మఱింత ఎక్కువగా మండును. అప్పుడు దేహము చాలా వేడియగును. పనిచేయక కూర్చున్నప్పుడు మనలోని నిప్పు ఎక్కువగా మండదు. కాబట్టి దేహము కొంచెము చల్లగా నుండును.

కట్టెలులేక నిప్పుమండదను విషయము అందఱికిని తెలిసినదే. కట్టె బొగ్గుగానున్నను సరే, నూనెరూపమైనను సరే, ఏదయినను సరే, కట్టెలు వేయకపోయిన నిప్పు ఆరిపోవును. అదేమాదిరి మన దేహమునకును కట్టెలు కావలయును. మనము తిను ఆహారమే కట్టెలగును. అరిగిపోయిన భాగముల సరిపఱచుటకు మన మాహారము భుజింపవలయును. మనము భోజనముచేయకపోయిన మన దేహము చిక్కిపోవును. దానికి కావలసిన యాహారము నీయకపోయిన మన శరీరమునే తినివేయును.

దివాను: — అదేమో నిజమే. ముప్పది సంవత్సరములప్పుడు ఒక గొప్ప క్షామము (కఱవు) పుట్టినది. అప్పుడనేకుల దేహము చిక్కిపోయి వట్టి ఎముకలంతయు తెలియుచుండినవి. భుజించుట కాహారములేనందున అనేకులు చనిపోయిరి.

వైద్యుడు: — ఒకనికి జ్వరము వచ్చినపుడు వాని దేహమెంత వేడిగనుండునదియు మీరెఱుగుదురు. ఇది దేహము చాల తీక్ష్ణముగనుండుటచేత. జ్వరమునకు మందివ్వకపోయిన వాని దేహము అత్యుష్ణమెక్కి వాడు చనిపోవును.

కోశాధిపతి: — ఈ మంట కడుపునందా, తలయందా?

వైద్యుడు:—ఆ మంట దేహమంతయు నున్నది. అందుకు ప్రాయిక్యు గుండెయందున్నదనవచ్చును. దేహమునందలి పనికిమాలిన వస్తువులనన్నిటిని నెత్తురుగుండెలోనికి తీసికొనివచ్చును. అచట నవి యొక విధమయిన వాయువుగా మార్పబడి మన మూపిరివిడుచునప్పుడు దేహమునుండి వెలువడును. అంత మనము పీల్చినపుడు క్రొత్తగాలి మన దేహమున ప్రవేశించి గుండెలలోని రక్తము మరల దేహమంతయు పాఱి దేహమునకు వెచ్చదనము నిచ్చి యందులోని యుపయోగములేని పదార్థముల గుండెలోనికి తెచ్చుచున్నది. గుండెలోనుండి పాఱు శుద్ధరక్తము ఎఱ్ఱగానుండును; గుండెలోనికి పారునది నలుపుతిరిగిన ఎఱుపురంగుగా నుండును. చెడురక్తమునకు నలుపురంగు అందులో

నుండు పనికిమాలిన వస్తువులవల్ల కలిగినది. ఆ వస్తువు లన్నియు మన దేహములోపల నుండినవి.

యువరాజు:—ఎంత వింత! ఎంత వింత! మన మేల భుజింప వలయుననుటకు రెండు కారణములు చెప్పితిరి. నాకు ఆకలి అయినపుడు నా శరీరము 'నా కాహారమిమ్ము. నాయందలి నిప్పు ఆరిపోవుచున్నద' ని చెప్పుచున్నదనుకొనెదను.

వైద్యుడు:—అంతే, సరిగా చెప్పితిరి. ఆకలియెత్తినపుడు శరీరము ఆహారము కావలయునని మొఱపెట్టుకొనుచున్నది. ఆకలి యెక్కువ కానుకాను మొఱపెట్టుకొనుట యెక్కువయగును. పసిబిడ్డ యాహారము కావలసినపుడు గట్టిగా ఏడ్చును. పెద్దపెఱిగిన మనుష్యులు ఏడువకపోయినను వారికి ఆహారము తినువఱకు నెమ్మదియుండదు.

మనము భుజించుటకు మూడవ కారణమేమన, మన చుట్టుప్రక్కలనుండు గాలి మన దేహములకన్న కొంచెము చల్లగా నుండుటచే దేహమును చల్లబడనీయక వెచ్చగా నుంచుట. మన దేహములోనుండి వేడిమిని బయట గాలి పీల్చుచున్నది. అందుచే మనలోని నిప్పును ఆరిపోనీయక ఎప్పుడు మండుచుండునట్లు చేయ ఆహారము తినవలయును.

రాజు: — ఇప్పుడు మన కేల యాహారము కావలసినదియు నాకు బాగుగ తెలిసినది. నీవిప్పుడు చెప్పిన కారణములు మాత్రమేకాక వేఱు కారణములున్నవా?

వైద్యుడు: — ఉన్నది. మనము పనిచేయుటకు కావలసిన శక్తిని యాహారమిచ్చుచున్నది. ఈ దివానువలె మనోసంబంధమగు పనిచేసినను, సేనానాయకునివలె సర్వదా స్వారిచేయుచు తన సేనకు కవాతు నేర్పినను, వకీలువలె నెప్పుడు మాటలాడుచుండినను, రైతులవలె ఉదయము నుండి సాయంత్రమువఱకు పొలములో పనిచేయుచుండినను, ఏది చేయుటకు, మన దేహములోని శక్తిని ఉపయోగించుచున్నాము. అట్లు ఆహారము లేక పనిచేయుచునే యుండిన మనకు శక్తి తగ్గి మన మలసిపోయి పనిచేయలేము. ఆహారము మనకు కావలసిన సత్తువ నిచ్చును. అందుచే మన దేహమున నష్టపడిన భాగమును పూర్తిచేసికొనుచున్నాము.

ఇందుచేత మనము కష్టపడి పనిచేయకూడదని మీరెంచుకొనగూడదు. అట్లుకాక మనము రోగములేకుండుటకు కష్టపడి పనిచేయవలయును.

దివాను: — అవును, పనిచేయుటచేత మన దేహమునకు మేలగుచున్నది. 'దృఢగాత్రమును, స్థిరచిత్తమును గలవాడు అదృష్టవంతుడు' అని మా యుపాధ్యాయులు చెప్పుచుండెను. 'బాలురందఱు పనిచేయనువలెను. ఆడుకొననువలెను. కాబట్టి మీరందఱు మీ యిష్టమువచ్చినంత దేహపరిశ్రమము చేయుడు. శరీరమున బలము లేకపోయిన మీకు చదువుటయు పనిచేయుటయు మిగుల కష్టము' అని కూడ చెప్పెడివాడు.

వైద్యుడు:—మనమారోగ్యవంతులుగ నుండుటకును పనిచేయ శక్తియుండుటకును కావలసిన యాహారమును భుజింపవలసినను మనమంతకన్న హెచ్చుగ భుజింపకూడదను విషయము జ్ఞాపకముంచుకొనవలయును. మనమంతకన్న ఎక్కువ భుజించిన మనకు కీడు అగును. మన శరీరము నియతమైన యాహారమునే కోరును. అంతకన్న ఎక్కువ తినిన మనకు రోగము వచ్చును. బీదవారెక్కువ తినుటకు అవకాశములేదు; వారికి కొంచమే దొఱకును. అయిన ధనికులలో తక్కువ తినుటకన్న అధికముగా తినుటచే కీడేయగుచున్నది.

సేనానాయకుడు: — కావలసినంత యాహారము తింటినని నేనెట్లు తెలిసికొందును. మీకు ఈ విషయములంతయు బాగుగ తెలిసినందున మీరు నాయొద్దనుండిన మిమ్ము అడుగుచుందునుగదా.

వైద్యుడు: — ఆహా! ఎల్లప్పుడు నీయొద్ద ఒక వైద్యుడున్నాడు. వానికి నీవెంత తినవలసినదియు, ఎప్పుడు తినగూడనిదియు నాకు తెలిసినంతకన్న ఎక్కువ తెలియును. అతని పేరు క్షుద్వైద్యుడు (క్షుత్ - ఆకలి; వైద్యుడు). ఈ విషయము అతడు బాగుగ నెఱుగును. నీకాకలియైనపుడు భుజింపుము. నీకెప్పుడు ఆకలి తీరినదని తోచునో అప్పుడు మానుము. దీనిని నీవనుసరించిన నీకెప్పటికిని రోగమురాదు. కడుపునిండ భుజించుటకన్న కొంచెమాహారము కావలసియున్నపుడే మానుట మేలు. వృద్ధులు

చిన్నవారికన్న తక్కువగ భుజింతురు; బయళ్లలో పనిచేయువారికి ఇంట్లో కూర్చుండి చదువుచు లెక్కలు వ్రాయువారికన్న ఎక్కుడాహారము కావలయును.

అప్పటికే చాల ప్రొద్దయినందున నాటి దర్బారు ముగిసెను. మఱునాడు క్రొత్తవిషయముల నేర్చుకొనవచ్చుననుకొనిరి. అందఱును వారివారి యిండ్లకు బోయిరి.

పాఠము 6.

ఆహారము నెట్లు భుజింపవలయును.

మఱునాడందఱు దర్బారునకు వచ్చి రాజునకు మర్యాదచేసి కూర్చుండిరి. వకీలుమాత్రము రాలేదు.

రాజు:—కొంచెముసేపు కాచుకొనియుందము.

ఈ మాట ముగిసి ముగియకమునుపే అవసరవసరముగా వకీలువచ్చి తన దేహాములో చెమటను తుడుచుకొనుచు రాజుతో,

వకీలు:—ఆలస్యముగ వచ్చినందుకు నన్ను మన్నింపవలయును. ఉదయమంతయు ఒక కేసు విషయమైన కాగితముల చూచుచుండినందున ప్రొద్దయినదే తెలియలేదు. ఆదాబాదా భోజనముచేసి ఇక్కడికి పరుగెత్తివచ్చుటకే ప్రొద్దు లేకపోయెను.

వైద్యుడు:—నీవేమో జబ్బుగనున్నట్లు ఉన్నది. ఏమి భోజనముచేసినావు? ఎంతసేపు భోజనముచేసినావు?

వకీలు:—అన్నము, పెరుగు, మూడునాల్గు అరటిపండ్లు. ఆలస్యమగుచున్నదేయని నేనెంత యవసరముగ తిన్నను దీనిని తినుటకే మూడు నిమిషములు పట్టినవి.

వైద్యుడు:—ఇప్పుడు నీకెట్లున్నది.

వకీలు:—నాకు జబ్బుగానున్నదని ఒప్పుకొనుచున్నాను. నా ఱొమ్ములో సీసపుముద్దలుంచినట్లు బరువుగానున్నది.

వైద్యుడు:—నీదే తప్పు. రాజుగారి యుత్తరువుపొంది తత్క్షణము ఇంటికి వెళ్లుము. పోవునపుడు దోవలో నా వైద్యశాలకు వెళ్లి యచట నౌకరుకీ కాగితమునిచ్చిన అతడు మందిచ్చును. దానిని భుజించి యింట్లో పడుకొని నిద్రపొమ్ము.

ఈ మాటల చెప్పుచు వైద్యుడొక చీటివ్రాసి వకీలు చేతికిచ్చెను. అంత రాజుగారి యాజ్ఞపొంది యతడింటికిపోయెను.

యువరాజు:-అతనికేల యంత జబ్బుచేసినది. అన్నము, పెరుగు, అరటిపండ్లు సామాన్యమయిన ఆహారమేకదా?

వైద్యుడు:--ఆహారమున నేమియు తప్పులేదు. అతడు భుజించినతీరు అతనికి జబ్బు కలుగచేసినది. అతడు మూడు నిమిషములలో భుజించితినన్నది మీరు వినలేదా. ఆహారమునంతయు నములకయే అతడు మ్రింగియుండవలయును. ఱొమ్ములో సీసపుముద్దలవలె యడచుకొనియున్నవని నవి అరటిపండుబద్దలు. అన్నము, పెరుగు అన్నిటిని బాగుగ నమలి మ్రింగవలయును. మన నోటిలో పం

ఛ్లుండునవి అందులకే. మనమే యాహారము తినినను దానిని చిక్కని గుజ్జు అగునంతవఱకు నమలి మ్రింగవలయును. మన నోటనుండు చొల్లు (Saliva) లో బాగుగ నాలికచేత కలియబెట్టవలయును. ఆ చొల్లు మనము భోజనముచేయునపుడంతయు నోటిలో ఊరుచుండును. ఇట్లు ఆహారమును బాగుగ నమలిన నీకు తెలియకయే అది నీ కడుపులోనికి పోవును. మా యుపాధ్యాయుడు "మీరు మ్రింగనక్కర లేదు. అదియే లోపలికి పోవునని" చెప్పుచుండెను. మూడు నిమిషములలో భుజించుటకన్న వకీలు తుదకు 20 నిమిషములైనను భోజనముచేసియుండవలయును. ఇంగ్లండున శ్రీవిక్టోరియాచక్రవర్తినిగారి ముఖ్యమంత్రులలో నొకరు చాల ముసలివారైనను చాల దృఢముగానుండిరి. ఒకానొకడు మీరెందులకంత దృఢముగనున్నారని యడుగ నతడందుకు నేనేది భుజించినను 32 మారులు నములక మ్రింగకుండుటయే ఒక కారణమని చెప్పిరి. ఆ మంత్రియే గ్లాడ్‌స్టన్ దొరగారు.

దివాన్ :—మా చిన్నవానికి పండ్రెండేండ్ల వయస్సున జబ్బుచేసినది. తెల్లవారిపూట పాఠములు చదువుచుండినందున ప్రొద్దెక్కెను. పాఠశాలకు కాలమాయెను. ఆలస్యముగ పోకూడదని అవసరవసరముగ పాలు, అన్నము, సీతాఫలమొకటిని భుజించెను. వాని తల్లి అవసరపడవలదని యెంత చెప్పినను బడికి ఆలస్యముగపోయిన ఉపాధ్యాయులు కోపించుకొందురనెను. బడినుండి శీఘ్రము

గనే యింటికి మరలివచ్చెను. ఆ దినమంతయు చాల జబ్బుగ నుండినందున మందు తీసికొనవలసివచ్చెను. ఈ విషయము నాకు బాగుగ జ్ఞాపకమున్నది.

వైద్యుఁడు:—నీకు కావలసినంత భుజించుటకు కాలము లేకుండిన తిన్నగా నమలి కొంచెముగానే తినుట మేలు.

రాజు:—నాకొక విషయముమాత్రము చక్కగ బోధపడలేదు. ఆహారవస్తువులన్నియు, మాంసములు, క్రొవ్వులు, సత్తువస్తువులు, చక్కెర, ఉప్పువస్తువులు అనువానిలో చేరినవనియు, ఆ నాల్గు వస్తువులను మనము భుజింపవలయుననియు మీరు చెప్పితిరిగదా. అందులో దేనినైన నాకు మిక్కిలి యిష్టమైనదానిని నొకదానినిమాత్రము భుజింపగూడదా?

వైద్యుఁడు:—ప్రతి యాహారవస్తువును మన దేహమున నొక పనిచేయవలసియున్నది. మాంసములు చిన్నప్పుడు దేహమును పెరుగనిచ్చి, పెద్దదైనపుడు దేహమునకు బలమునిచ్చును. ఇందులకై యేదైన నొకవిధమున మాంసమును కొంచెము తినవలయును. బ్రాహ్మణులు మాంసమును భుజింపరు కాబట్టి వారు పాలు, పెరుగు, నెయ్యి మొదలగు వస్తువులు ఎక్కువగా భుజింపవలయును. చక్కెర సత్తువస్తువులుకూడ శరీరమునకు బలమునిచ్చి వెచ్చదనమునిచ్చును. క్రొవ్వువస్తువులు దేహమును చిక్కిపోనీయవు. ప్రపంచమున కుత్తరభాగమున మిక్కిలి చలిప్రదేశములలో నుండువారు తిమింగిలము, సీలు మొదలగు సముద్రపు

జంతువులనుపట్టి వాని క్రొవ్వును భుజించుచున్నారు. ఉష్ణప్రదేశములోనుండు మనము క్రొవ్వువస్తువులనంతగా భుజింపవలసిన అక్కరలేదు. ఈ వస్తువులేకాక పండ్లు, కాయకూరలును భుజింపవలయును. మన దేహమునకు కావలసిన ఉప్పువస్తువులు పులుసువస్తువులు వానియందున్నవి. అందుచే మన కారోగ్యమును బలమును కలుగును.

యువరాజు:—పూర్వము అమెరికాను కనుపెట్టిన కొలంబసువలె చాలదూరము ప్రయాణముచేసినవారికి అప్పుడప్పుడు జబ్బుచేయుచుండెనని నేను చదివితిని. అంత దూరప్రయాణమునకు కావలసినన్ని మంచిపండ్లు కాయలు వారెత్తుకొనిపోవుటకు సాధ్యములేకుండెను. అందుచేత నే రోగములు వచ్చుచుండినవి. కాబట్టి ప్రయాణికులు చాలామంది చనిపోవుచుండిరి. ఇప్పుడు గొప్పగొప్ప స్టీమర్లుండుటచేత మంచిపండ్లు తీసికొనిపోవుట సులభముగానున్నది.


వైద్యుఁడు: — మనము బలవంతులమై యుండుటకు అన్ని వస్తువులను కొంచెము కొంచెము తినవలయును. అయితే మనమెప్పుడును కుళ్లిపోయి చెడిపోయినవస్తువులను దేహమునకు బాధనిచ్చు వస్తువులను ఎంత బాగుగనున్నను భుజింపకూడదు.

రాజు:—(నిలబడి) ఇంతటితో దర్బారు ముగియుచున్నది. మీకు వేఱే పనులున్నవి. ఆహారవస్తువుల గుఱించి యీ

దినము చాల నేర్చుకొంటిమి. మన మిత్రుడు నతిథియు నగు వైద్యుడు రేపటిదినము త్రాగుటనుగూర్చి చెప్పును. అంత దర్బారు ముగిసి అందఱు లేచిపోయిరి.

పాఠము 7.

ఆల్కహాల్ అను మద్యసారము.



గొప్పరాజు అగు అలెగ్జాండరు.

మఱునాడందఱు సభను అలంకరించిరి.

రాజు:—(వైద్యునితో) నాడు మనమందఱము సైరసు యొక్క కథను వింటిమి. అందుచే సారాయమువంటి

వస్తువుల త్రాగుటచే కలుగు కీళ్లను తెలిసికొంటిమి. మత్తు వస్తువుల విషయమై యింకను అవి యెట్లు దేహమునకు చెఱుపు చేయుచున్నవో చెప్పెదరా. మత్తువస్తువులెట్లు త్రాగినవారిని తెలివిలేకుండచేయును? సైరసు అందులో విష మున్నదనెనే. అది నిజమేనా?

వైద్యుడు:—సైరసు చెప్పినదంతయు నిజమే. విషము లనేకవిధములు. బలమైన విషములు మనుష్యుని రెండు మూడు నిమిషములలోనే చంపును. కొన్ని చాల తిన్నగ పనిచేయుచుండును. వానిని కొంచెముగా తిన్నప్పుడేమియు అపాయము లేకుండవచ్చునుగాని వాడట్లే కొంచెము కొంచెముగా ఎక్కువ తినిన తుదకతడు చనిపోవును. కొన్ని విషములు తిన్నవానికి పిచ్చి పుట్టించును. వాడు చావడు; వానికి తెలివిమాత్రము తప్పును.

కొన్ని విషములు ఎక్కువగా తిన్న దేహమున కపాయము కలుగజేయును. అట్టి విషముల మిక్కిలి కొంచెము కొంచెముగా తమ రోగులకు మందులతో చేర్చి యనుపానముగా నిత్తురు. కొన్ని విషములు మనుష్యుని చంపకున్నను వాని దేహమునకు రోగములు తెచ్చిపెట్టి జ్ఞాపకశుద్ధిని బుద్ధిబలమును చెఱచును.

అట్టి విషములలో మద్యసారము (Alcohol) ఒకటి. మత్తుపదార్థములన్నిటిలో కొంచెముగనో ఎక్కువగనో మద్యసారమున్నది. వైను (ద్రాక్షరస సారాయము), బీరు,

బ్రాందీ, జిన్, విస్కీ, సారాయము మొదలగునవన్నియు మత్తుపుట్టించు వస్తువులే.

దివాను:— మద్యసారమును గురించిన విషయము లన్నియు మాకు చెప్పుడు. అది యెట్లుండును? దాని రుచి యేమి? అది ఎట్లు వాసనకొట్టును?

వైద్యుడు:—శుద్ధమైన మద్యసారము నీటివలెనుండును. దానికొక విధమైన వాసనకలదు. శుద్ధమైన నీటికి వాసనయే లేదుకదా. ఒక బొట్టు మద్యసారమును నోటవేసికొనిన నాలుక మంటలెత్తును. అది నీటివలె దాహమును పోగొట్టదు. అది కిరసనాయిలు Kerosine oil వలె మండును. "మెతిలేటెడ్ స్పిరిట్" (స్పిరిట్ = మద్యసారము) అను నొక విధమగు మద్యసారమును మోటారుబండ్లను తోలుటకును, ప్రైమస్ వెలిగించుటకు నుపయోగింతురు. అది మండునపుడు పొగయే ఉండక ఉష్ణమెక్కువగా పుట్టును.

రాజు:— అట్లయిన అది విషమనుటకేమియు సందేహములేదు. శుద్ధమగు మద్యసారమును త్రాగిన మనుష్యుడు చనిపోవుట నిశ్చయము. అది వాని దేహమునంతయు కాల్చివేయును.

వైద్యుడు:—అదేమో నిజము. అందుచేతనే శుద్ధ మద్యసారమును ఎవరును త్రాగుటలేదు. బ్రాంది విస్కీలవంటి మత్తువస్తువులలో నిండుగా మద్యసారమున్నది. అందుచేత నిప్పంటించిన నవి మండును. కొన్నిటిలో నీ మద్య

సారము తక్కువగానుండును. అట్టివి నిప్పంటించినపుడు మండవు. సారాయము, వైను, బీరు అట్టి వస్తువులు.

సేనానాయకుడు:—ఈ వస్తువులలో నొక్కొక్కదానిలో నెంత మద్యసారమున్నది?

వైద్యుడు:—బీరునందు చాల తక్కువ. బీరు లనేకవిధములు. అందులో ఇరువదియైదింట నొకభాగము మొదలు పండ్రెండింట నొక భాగమువఱకు మద్యసారముండును. వైనులలోను అనేకములున్నవి. వానిలో పదింట నొక భాగము మద్యసారముండును. సాధారణములగు సారాయములలో సగముభాగము మద్యసారమే. అందుచేతనే వానిని త్రాగునపుడు నీళ్లను చేర్చుకొందురు. అప్పుడవి అంత అపాయకరములు కావు; అంత విషమందులో నుండదు. అప్పుడుకూడ ఎక్కువ త్రాగిన నవి దేహమున కపాయము కలుగజేయును.

రాజు —అవి ఆహారములకు బదులగునా? వాని నెందుకు జనులు త్రాగుదురు?

వైద్యుడు: —అవి త్రాగువారికి చాల యింపుగనుండును. తక్కిన ఆహారవస్తువులవలె మన దేహముల పెరుగనిచ్చి వానికి బలమును ఉష్ణమును ఈ మద్యసారము లీయవు. వానిలో సత్తు పదార్థములుగాని, క్రొవ్వువస్తువులుగాని లేవు. కొంచెము చక్కెరమాత్రముండును. కావలసినంత యాహారమును రక్తములో చేరనీయక ఆపి దేహమునకు చెఱుపుచేయును.

నీటివలె దాహమును పోగొట్టక మఱింత దాహమును పుట్టించును. మద్యసారమునకు నీళ్లను పీల్చుకొను శక్తి గలదు. మనము త్రాగెడు నీళ్లు కడుపులోనికి పోయి అందుండు వస్తువులనన్నిటిని కలియబెట్టి, రక్తముగ మార్చును. మద్యసార మీపనిని చేయజాలదు. దేహములోని నీటిని పీల్చుకొనుచు దానితో చేరి దానిని పనికిమాలినదిగా చేయును. అందుచే సారాయమును త్రాగువారికెప్పుడును దాహమెక్కువ.

యువరాజు:—మద్యసారము ఇంకను ఏదయిన కీడును చేయునా? అది ఒకవిధమగు విషమంటిరిగదా? అది యెట్లు దేహమునకు అపాయము కలుగచేయును?

వైద్యుడు:—పెక్కువిధముల నది దేహమును చెఱుచును. వానిలో కొన్నిటిని చెప్పెదను. ఆ కారణముల నా రోగులవద్దనుండి నేర్చుకొంటిని.

మొట్టమొదటిది మద్యసారము చిన్నవారి శరీరముల పెఱుగనీయదు. అది యేవిధమున దేహమున ప్రవేశించినను సరే, వారు పెద్దపెఱుగక, వారి దేహము పుష్టిచెందక, స్వల్పముగనుందురు. మద్యసారము చెట్లకుకూడ చెఱుపే. నూటికొకభాగము మద్యసారముగల నీటిలో విత్తుల వేసిన యెడల యవి మొలవవు. కొంచెము మద్యసారముగల నీటిలో చేపలు బ్రతుకవు. చెట్లకు అట్టినీటిని పోసిన చెట్లు చెడిపోవును. కుక్కపిల్లలకును పిల్లులకును వాని త్రాగ

నిచ్చిన నవి పెద్దవి కానేకావు. కొందఱు మూఢులు తాము త్రాగుటయేకాక తమ పిల్లలకును యిచ్చుటచేత వారు పెద్దపెఱుగక బలహీనులుగ నుందురు.


దివాను:—అది విచారకరము. త్రాగుబోతునకందలి కీళ్లు తెలియును. అట్టివాడు తన పిల్లల కాయలవాటులేక చేయకూడదా. పెద్దవారికేమి త్రాగుటచే కీడు?

వైద్యుడు:—అది దేహమునకు దుర్బలము నిచ్చును. రోగములను తెచ్చును. ఈ విషయము నేను పలుమారులు గుర్తించితిని. నేను జనులకు జ్వరమునకుగాని క్షయ రోగమునకుగాని మందిచ్చునపుడు సాధారణమైనవాడు త్రాగుబోతునకంటె శీఘ్రముగా ఆరోగ్యవంతుడగుచున్నాడు. త్రాగుబోతులకు గాయములు తగిలినను పుండ్లు వచ్చినను శీఘ్రముగా మానవు. ఇది రక్తము సారాయముచే అశుద్ధమగుటచేతనే.

వజీరు:—అవును చరిత్రలో దీనికొక యుదాహరణ మున్నట్లు నాకు జ్ఞప్తికి వచ్చుచున్నది.

యువరాజు:—దానిని మాకు చెప్పుడు.

వజీరు:—సైరసు కథయను పుస్తకమునందే నేనొక కథను చదివితిని. అలెగ్జాండరు సైరసునకన్న గొప్పరాజు. అతడు గ్రీసుదేశముననుండు మాసిడోనియాయను భాగమునకు రాజు. అతడు మహాధైర్యశాలి. సేనలను నడపుటయందు బహు నేర్పరి. ఇరువది సంవత్సరముల వయస్సున రాజయ్యెను. ఆకాలమున పర్షియారాజ్యము మిగుల



పంజాబుదేశపు రాజగు పోరసు అలెగ్జాండరునకు తన ఖడ్గమునిచ్చుట.

పెద్దది. అయితే అప్పటిజనులు వేషభాషలయందు తమ తాత ముత్తాతలవలెగాక చాల మార్పుచెందియుండిరి. రాజులు సుభోజనములచేయుచు డంబమైన ఉడుపులవేసికొనుచు, చాల మత్తుగలిగించు వైను మొదలగు సారాయముల ద్రాగుచు చాల భోగమున నుండిరి. అట్టి సమయమున అలెగ్జాండరు చిన్న సైన్యముయొక్క సహాయముచే పర్షియాదేశమునంతయు జయించెను. అతడు మన హిందూదేశమునకుకూడ వచ్చెనుగాని, పంజాబువరకు మాత్రమే వచ్చెను. సామాన్య సైనికులవలె తాను కష్టములకోర్చి, వారివలె తానును సాహసముతో యుద్ధము చేసెను. అందఱు వానిని ప్రేమించిరి. ఒకప్పుడు గొప్ప యుద్ధము జరగి అందఱు అలసిపోయిరి. అందఱికిని దాహ మెక్కుడుగానుండెను. ఒకడు చాల కష్టపడి ఎట్లో కొంచెము నీటిని ఇనుపకుల్లాయి (శిరస్త్రాణము) లో తీసికొని వచ్చి అలెగ్జాండరునకిచ్చెను. అలెగ్జాండరు దానిని త్రాగలేదు, దానితో దేవుని కర్ఘ్యమిచ్చెను. అతడు "నా జనులందఱు దాహముతో బాధపడుచుండ నేనుమాత్రము నా దాహము నార్చుకొనవచ్చునా ఏమి? నేనును వారివలె కష్టపడెదను" అనెను.

అతడు బహుమందిని జయించినతరువాత అతని గుణము మారెను. గర్వము ఎక్కువయ్యెను. అతడు పర్షియారాజకుమార్తెను పెండ్లిచేసికొని పర్షియనులవలె [illegible] [illegible] ముఖస్తుతిచేయగా సంతోషముతో నవ్వుచుండు

డెను. అతడు గొప్ప గొప్ప విందులుచేసి బలమైన సారాయముల తప్ప త్రాగుచుండెను.

ఒకప్పుడతడు ఎవరు ఎక్కువగా త్రాగినవారికి బహుమానమిచ్చెదనని చెప్పెను. ఆ బహుమానమును పొందినవాడు ఎనిమిది పెద్ద బుడ్లు వైను త్రాగి రెండు దినములలో చనిపోయెను. ఒక వారములోపల నలువదిమంది గొప్ప మనుష్యులు చనిపోయిరి.

మఱియొకప్పుడతడు ఒడలు తెలియక త్రాగినపుడు "పర్షియారాజులలో గొప్పవాడగు జర్జసుయొక్క నగరమంతయు కాల్చివేయుడు. అందుచే మీకు కీర్తి కలుగును" అని చెప్పెను. తప్ప త్రాగిన రాజును అతని అనుచరులును దివిటీలతో నా గొప్ప యింటికి నిప్పంటించిరి. అందుండిన చిత్రపనులును, అమూల్యములగు వస్తువులన్నియు మండిపోయి యా నగరమంతయు నేలపాలాయెను.

గ్రీకుప్రభువుల కనేకులకు తమ రాజు ఎడ విసుకు పుట్టెను. ఒడలు తెలియకుండిన రాజును, పర్షియనులు దేవుడని స్తోత్రముచేసిరి. అందులకతడు మిక్కిలి సంతోషించి "అవును, నేను దేవుడనే, మా తండ్రి దేవతలకు రాజగు ఇంద్రుడు" అని మిక్కిలి గర్వముతో చెప్పెను. ఆ మాటను అలెగ్జాండరు ప్రాణస్నేహితుడగు గ్రీకుదేశస్థుడు ఒకడు వినెను. అతడు కోపముతో "గ్రీకుదేశమునకు నీకు పూర్వము రాజుగానుండిన ఫిలిప్పు నీ తండ్రి. అతని కుమారుడని చెప్పుకొనుటకు నీకేమి 'సిగ్గుగానున్నదా!

ఇంద్రుని కుమారుడను, చంద్రుని కుమారుడను అనుచున్నావు" అనెను. అందులకతని నలెగ్జాండరు నోరు మూసికొమ్మని యుత్తరువుచేసెను. అప్పుడా స్నేహితుడు "నేను పర్షియనువలె బానిసను కాను, గ్రీకుదేశమునందు స్వతంత్రుడను. నేను నిజము చెప్పెదను. ఒక గొప్ప యుద్ధమున నీ ప్రాణమును నేను కాపాడలేదా? నీవు రాజువైనను మనుష్యుడవే కాని దేవుడవు కావు" అని మఱల చెప్పెను.

అలెగ్జాండరునకు పట్టరాని కోపమువచ్చి తన స్నేహితుడగు క్లీటాసుపై బల్లెమును విసరివేసెను. ఆ బల్లెపుపోటు వల్ల అతడు చనిపోయెను. తనకు తెలివివచ్చి తానేమిచేసినదియు చూచి మిగుల వ్యసనము చెందెను. దుఃఖముచే రెండుదినములు అన్నపానములు ముట్టుకొనలేదు. తన ప్రాణమును కాపాడిన పరమమిత్రుని తన చేతులార తానే చంపెను.

ఇతడు పెక్కు దేశముల జయించి పెక్కు గొప్ప పట్టణముల కట్టించెను. అట్టివానిలో ఈజిప్టుదేశమున ఉత్తరముననున్న అలెగ్జాండ్రియాయను రేవుపట్టణమొకటి. అట్టి అలెగ్జాండరు ముప్పదిరెండు సంవత్సరములకే ఒక చిన్న దోమ కరచుటచే చనిపోయెను.

బేబిలాను పట్టణమును తనకు రాజధానిగా జేసికొనవలయునని యూఫ్రెటీస్ నదీతీరమున నా పట్టణమును కట్టునపుడు కొన్ని దినములుండెను. ఒకదినమతడు పూర్తిగా

త్రాగి తన గుడారమున నిద్రించుచుండెను. అప్పుడాతని నొక దోమ కుట్టెను. రెండుదినములకంతయు నతనికి జ్వరమువచ్చెను. పలుమాఱు త్రాగుటచే రక్తము చెడిపోయినందున బలముతగ్గెను. అందుచే రోగమును ఓర్చుకొనునంత శక్తిలేకపోయెను. ఐనదినమును కృశించి తుదకు చనిపోయెను.

రాజు: — అతడు త్రాగుబోతు కాకపోయిన బ్రతికి యుండుననుకొనెదరా?

వైద్యుఁడు: — నేనది చెప్పజాలను. అంత చిన్నవయస్సున ముప్పదిరెండు సంవత్సరములప్పుడు బలవంతుఁడయిన వానికి రోగము కుదురవచ్చును. త్రాగుబోతునకు రోగము కుదురనే కుదురదు.

రాజు:—మనమింటికిపోవుటకు కాలమయినది. రేపటి దినము పదునొకండు గంటలకు అందఱును చేరుదము. అప్పుడు మన వైద్యుఁడు త్రాగుటచేగలుగు కీళ్లను ఇంకను చెప్పును.

దర్బారు ముగిసెను. కోశాధిపతి యింటికిపోవుచు "ముందే నాకు తెలియకపోయెను. ఇంత కీడుచేయునని తెలియలేదు. నా దేహమునకు నేనే ఆపత్తు తెచ్చుకొనుచుంటిని. అట్టి చెడ్డవాడుకను వదలినందుకు చాలా సంతోషముగానున్నది" అని అనుకొనుచుపోయెను.

పాఠము 8.

మద్యపానముచే కలుగు కీడు.

మఱునాడు జరిగిన దర్బారునకు ఎక్కువమంది వచ్చియుండిరి. కోశాధిపతిగాక మఱి యిరువురు మంత్రులకు కూడ మద్యపానము చేయు అలవాటు ఉండెను. కోశాధిపతి యంత యెక్కువగా నెవరును త్రాగకపోయినను దినదినమును దానిని వీరిరువురు వాడుకపఱచుకొనుచుండిరి. వైద్యుఁడు చెప్పిన విషయములు వారికి సిగ్గుగలుగచేసెను. మద్యసారమునుగుఱించి వారు వినినదేలేదు. అందుచే వైద్యుఁడు చెప్పినమాటలకు వారికి భయముపుట్టెను. ఇంతవఱకు మద్యపానము చేయనివారు కూడ దానిని విన ఇచ్ఛకలిగి వచ్చిరి. అందుచే అచట చాలమంది కూడియుండిరి.

రాజును తనకు వందనముచేసినవారికి ప్రతివందనముచేసి కూర్చుండెను.

రాజు: — నా రాజ్యమున మద్యపానము రానురాను ఎక్కువయగుచుండుటచేత దాని నెట్లయినను ఆపుట నా ధర్మమని యెంచి బహు ప్రయత్నములు చేయుచుంటిని. అట్టి యుద్యమమున నాకు తోడుపడుటకై మీరిచట చేరినందులకు చాల సంతోషముగానున్నది. త్రాగుటచే కలుగు కీళ్లను మన స్నేహితుఁడు చెప్పునంతవఱకు అది యేవిధముగా దేహమున కపాయము చేయుచుండునదియు నాకు తెలియలేదు. మన రాజ్యములోని జనులకు కలరా, ప్లేగు,

మశూచికము మొదలైన క్రూరములగు రోగములు రాకుండుటకై మనము అనేకములైన ఉపాయములు చేసితిమి. త్రాగుటయును ఒక రోగమేయనియు అందుచే కొందఱు చనిపోవుట నిశ్చయమనియు, అనేకులు బలహీనులైపోవుదురనియు ఇప్పుడు తెలిసికొంటిమి. (వైద్యునివంక తిరిగి) ఇదివఱకే రాజైనను తన దేశమునుండి యీ త్రాగడముచే వచ్చురోగమును మాన్పుటకు కావలసిన ప్రయత్నములు చేసియున్నాడా? దయచేసి చెప్పెదరా.

వైద్యుడు:—కలడు. ప్రభువు వారికొక గొప్ప నిదర్శనమును చెప్పెదను. అది యిటీవల జరిగినదే. యూరోపులో ఇప్పుడు ఘోరయుద్ధము జరుగుచుండుట మీకు తెలియును గదా.

జర్మనువారు వారి స్నేహితులతో చేరి ఇంగ్లీషు, ఫ్రెంచి, రష్యనువారితోను వారి స్నేహితులతోనుకూడ యుద్ధము చేయుచున్నారనియు మీకు తెలిసినదే. ఈ యుద్ధములో జర్మనువారి నడతనుబట్టి వారు (క్రూరులు) కిరాతులనవచ్చును. గౌరవము, న్యాయము, సత్యము మొదలగు నన్నిధర్మముల వారు విడిచిపెట్టిరి. నిరాయుధులగు వారిని, స్త్రీలను, బిడ్డలను, దయాదాక్షిణ్యములు లేక వారు చంపుచున్నారు. గుళ్లను, రోగులుండు వైద్యశాలలను (Hospitals పాడుచేయుచున్నారు. చెఱువులలోను, బావులలోను త్రాగుటకు నీళ్లుండు చోట్లలోనంతయు విషము కలుపుచున్నారు. ఇవికాక చెప్పనలవికాని క్రూర

కృత్యముల చేయుచున్నారు. వారిని కిరాతులగు అడవిజాతివారిగా ఎంచుకొనవలసినదేగాని నాగరికులతో చేర్చరాదు.

పంచమ జార్జిచక్రవర్తి, ఇంగ్లాండు, ఇండియా మొదలగు పెక్కుదేశముల నేలుచున్నాడు. అతనివెనుక ప్రపంచమునందు అందఱికన్న ఎక్కువ రాజ్యముగల రాజు రష్యాదేశపుచక్రవర్తి. అతని రాజ్యమున నతనిది నిరంకుశాధికారము. అతని మాటకు అడ్డుచెప్పువారు ఎవరును లేరు. అతడెప్పుడును తన జనులకు మేలుచేయవలయునని ప్రయత్నించువాడు. రష్యాదేశపువారు చాలకాలముగా "వాడ్కా"యను ఒక బలమైన మత్తుపదార్థమును త్రాగుచుండిరి. ఆ పదార్థముపై పన్నువేసియుండినందున దానినమ్ముటచే గవర్నమెంటువారికి ఎక్కువ ఆదాయముండెను. (వారికి ఆ పన్నువల్ల వరుమానము హెచ్చు). రష్యాచక్రవర్తి వాడ్కాను త్రాగుటచే కలుగు కీళ్లను బాగుగ తెలిసికొని ఒక్క నోటిమాటతో తన రాజ్యమున నెక్కడను వాడ్కాను తయారుచేయగూడదని యుత్తరువు చేసెను. అందుచే పెక్కుకోట్ల రూపాయలు గవర్నమెంటునకు నష్టము వచ్చుచుండినను అతడు లక్ష్యముచేయలేదు.

దివాను:—దీనికిని యుద్ధమునకును సంబంధమేమి?

వైద్యుడు:—ఆ రెంటికిని సంబంధము చాలా ఉన్నది. చక్రవర్తికి తన సైనికులు వాడ్కాను త్రాగకున్న బాగుగ

యుద్ధముచేయుదురని తెలియును. అందుచేతనే దానిని చేయకూడదని యుత్తరువుచేసినది.

సేనానాయకుడు: — మాకా విషయమును బాగుగా తెలియునట్లు చెప్పుడు. సైనికులు సారాయము త్రాగి కొంచెము మైకముగా నుండునప్పుడు ధైర్యముతో ఉగ్రముగా యుద్ధముచేయుదురని చదివియున్నాను; వినియు ఉన్నాను. యుద్ధము చేయుటకుముందు సేనాధిపతులు తమ సైనికులకు భంగియైనను, సారాయమునైనను, అట్టి మత్తు పదార్థము దేనినైనను ఇచ్చెదరని వినియున్నాను. అందుచే వారు చక్కగా పోరాడుదురట.

వైద్యుడు:—అంతయు నిజమే. అది గొప్ప పొరబాటని ఇప్పుడు తెలిసికొన్నారు. ఇప్పుడెవరును అట్లు చేయుట లేదు. నేను దానిని మీకు వివరించి చెప్పెదను.

త్రాగుటచేత మన గుండెలయొక్క బలమును, తుదకు శరీరబలమును తగ్గును. అందుచే అది సరిగా తన పనిని నెరవేర్పజాలదు. ఈ విషయమును చాల అనుభవముమీద కనుగొనిరి. రెండు సిపాయి దళములవారు పైరుకోతకును రోడ్లువేయుటకును నియమింపబడిరి. ఒక దళమువారికి త్రాగుటకు బీరునిచ్చిరి. రెండవపక్షము వారికేదియు నీయలేదు. బీరు త్రాగినవారు శీఘ్రముగా అలసిపోయి పనిచేయలేకపోయిరి. మఱునాడు మొదటిదళమువారికేమియు నీయక రెండవదళమువారికి బీరునిచ్చిరి. మొదటిదళము

వారు ముందు ఓడిపోయినను ఇప్పుడు సులభముగా రెండవదళమువారిని ఓడించిరి.

దక్షిణ ఆఫ్రికాలో జరగిన గొప్ప యుద్ధమునందు సారాయము మొదలగు మత్తువస్తువుల త్రాగిన సైనికులు చాల దూరము నడువలేక అలసిపోవుచుండిరి. మత్తువస్తువుల త్రాగనివారుమాత్రము బహుదూరము నడువగలిగిరి. పడవల నడపుటలోను పసుగెత్తుటయందును పందెములు వేసినపుడు బలవంతులే గెలుతురు. అట్టి పందెములను నేర్పునపుడు ఇంగ్లాండులో నేర్చుకొనువారిని వైనుగాని బీరుగాని త్రాగనీయరు. అట్లు త్రాగిన వారిబలము తగ్గును. అందుచే పందెమును గెలుచుటకు కావలసినంత శక్తియుండదు.

ఇంకను పలువిధములగు పరిశోధనలు సారాయము త్రాగువారికంటె త్రాగనివారు కష్టములగు కార్యములను సులభముగను శీఘ్రముగా అలసటచెందకయు చేయుదురని తెలియజేయుచున్నవి.

దివాను:—సారాయమును త్రాగుటచే దాహము అణగునా? ఆకలి నాపునా? జీర్ణకారియా? దానిచేకలుగు లాభనష్టములెవ్వి?

వైద్యుడు:—అది మీరన్నపనులకు దేనికి నుపయోగింపదు. దాని కార్యము మనకు చెఱుపుచేయుటయే. మన అన్నకోశముపైనుండు చర్మము చాల సన్నమైనది. అందుచే కొంచెము అజాగ్రతనుండినను దానికి కలుగు అపా

యమెక్కువ. మనము మద్యమును త్రాగిన నది ఆ అన్నకోశములోనికిపోయి దానిని కాల్చివేయును. ముందు చెప్పినట్లు మద్యసారము మన కడుపులోనుండు కాయకూరలు మొదలగు వస్తువులలోని నీటిని పీల్చుకొనును. అందువల్ల అవి మిగుల గట్టిపడి సులభముగా రక్తముగా మారవు. త్రాగుబోతులకు రానురాను ఆకలితగ్గుటచే చిక్కిపోవుచున్నారు.

వకీలునకు ఒకరు చెప్పినదానిలో తప్పులు కనిపెట్టి అందుకు ప్రతికక్షిగా మాటలాడుట చాల యిష్టము. అతడిప్పుడు వైద్యునితో మాటలాడ నారంభించెను.

వకీలు:—ఏది యెట్లున్నను త్రాగుటచేత దేహమున కాక పుట్టుచున్నది. త్రాగునపు డొకని దేహమెంత కాకగానుండునో చూచియున్నారా?

వైద్యుడు:—ఆహా! ఆ వేడిమి మన దేహములకు మేలు చేయదు. దేహమునకు చెఱుపే. మద్యసారమును త్రాగుటచే మన గుండెలు మిక్కిలి వేగముగా దడదడ కొట్టుకొనును. అందువల్ల మన దేహమునకంతయు కావలసినంతకంటె ఎక్కువ నెత్తురు పారును. మన చర్మము వేడిగానుండును. ముఖము ఎఱ్ఱబాఱియుండును. త్రాగినవానికి తన దేహమంతయు నిప్పుతో కప్పినట్లుండును. ఈ యుష్ణము శీఘ్రముగ పోయి దేహము చల్లపడును. గుండెలు మిక్కిలి తిన్నగా కొట్టును. మిక్కిలి వేగముగా పరుగెత్తినవానికి ఎట్లుండును? శీఘ్రముగా పరుగెత్తుటమాని అలసట పోగొట్టుకొనవలయునని యుండును. అతనికటుతరువాత నడచుటకూడ కష్టముగానేయుండును. పరుగెత్తకుండిన బహుదూరము నడువగలడుగదా. మనము గుఱ్ఱము వేగముగా పరుగెత్తుటకై దానిని కొట్టునట్లు త్రాగుటవలన గుండెకాయలకు హెచ్చరికజేయునట్లున్నది. గుఱ్ఱము కొంతసేపు పరుగెత్తి అలసి తరువాత తిన్నగా నడచును. పూర్తిగా త్రాగినవాని గుండెయు అట్లే మొదట కొంతసేపు అతివేగముగా కొట్టి తరువాత తిన్నగా కొట్టును.

చర్మము వేడెక్కినపుడా యుష్ణము వేగముగా తగ్గిపోవును. అందుచేత శరీరము చల్లపడును. ఆ యుష్ణమెక్కడికి పోవును? మన చుట్టునుండు గాలి పీల్చుకొనును. సముద్రముమీద ప్రయాణముచేయువారికి ఈ విషయము బాగుగ తెలియును. ఎప్పుడును మంచుగడ్డతో నిండి చల్లగానుండు ఉత్తరమహాసముద్రము (ఆర్కిటిక్ మహాసముద్రము) లో ప్రయాణముచేయువారు సారాయము మొదలగు వస్తువుల త్రాగనే త్రాగరు. అట్టి వస్తువుల ముట్టుకొననుగూడ ముట్టుకొనరు. అందుకు రెండు కారణములున్నవి. మొదటిది: దానిని త్రాగుటచే వారి దేహమంతయు కొంచెముకాలమునకే చల్లపడును. చుట్టుప్రక్కలనుండు వస్తువులును మిక్కిలి చల్లగానుండుటచేత వారి శరీరములు ఇంకను చల్లబడి వారు చనిపోవుదురు. మద్యపానము చేయనివారు చలికోర్చియుండి ప్రాణముల

తో రాగలుగుదురు. రెండవది: వారొకవేళ చనిపోకుండినను చాల బలహీనులై చచ్చినవారితో సమానముగ నుందురు.

వకీలు:—సరిసరి. సారాయమును త్రాగుటచే దేహమునకు వెచ్చదనము నిచ్చుననుట పొరబాటు. నేనును పొరబాటుపడితినని ఒప్పుకొనుచున్నాను. అది మెదడునకు బలమీయదా? మనోబలమును ఎక్కువచేయుటలేదా మన బుద్ధికి వికాసము కలిగింపదా? నైనను త్రాగినతరువాత కల్పనాశక్తి యెక్కువై గద్యపద్యములు సులభముగా వ్రాయుదురని వినియున్నాను.

ఈ వకీలునకు న్యాయస్థలము (కోర్టు) నకు పోవుటకు ముందు కొంచెము మద్యమును త్రాగి తరువాత పోవుట వాడుక. అట్లు త్రాగిన వ్యాజ్యములను చక్కగ వాదించుటకు వీలగునని పిచ్చిభ్రమ చెందియుండెను. ఆ విషయము నిప్పుడు దర్బారులో బహిరంగముగా చెప్పుటకు సిగ్గు చెంది అదే విషయమును ఇట్లు అడిగెను.

వైద్యుడు:—అబ్బబ్బ! అట్లనుట తప్పు. దేహమునకు మద్యపానమెంత వెట్టనిచ్చునోఅంత నిజమిది. అది మెదడును వేగముగా పనిచేయ పురికొల్పుచున్నదనుటనిజమే. సాధారణముగ కావలసినంతకన్న ఎక్కువచేయుటకు పురికొల్పును. మద్యమును త్రాగుటచే గుండెలు దడదడమని వేగముగా కొట్టుకొనుచున్నవని ముందే చెప్పియున్నానుగదా. అందువల్ల నెత్తురు మన మెదడులో

నికి ఎక్కువగా పారుననునదియు తెలిసినదే. అట్లు పారుటయు కొంచెముసేపుమాత్రమే. అందువల్ల లాభమేమి? తరువాత మునుపటికన్న మెదడు తక్కువగా పనిచేయుటయే. రక్తము నిండుగా పారిన మన దేహములోని నరములు చెడిపోవును. బలహీనములగును. అంతనవి మెదడుయొక్క స్వాధీనమునుండి తప్పుచున్నవి. త్రాగుటచే చేయి నిలుకడగానుండక అటు యిటు ఆడుచుండును. ఈ గుఱుతును బట్టి యొకడు త్రాగుబోతయినదియు కానిదియు తెలిసికొనవచ్చును. ఈ విషయమును అనుభవముచే కనుగొనిరి. త్రాగుబోతు తుపాకిని కాల్చునపుడీ సంగతియందలి నిజానిజములు తెలియును. తుపాకిని సైనికులు తమ చేతులతో పట్టుకొని అరమైలు దూరముననుండు ఒక గురిని కొట్టవలయును. ఆ సమయమున ఏమాత్రము చేయి కదలినను గురి తప్పిపోవును. పండ్రెండుగురు సిపాయీలు బ్రాందిని కొంచెము నీళ్లతో కలిపి త్రాగి ఒక గురి తగులునట్లు కొట్టపోయిరి. గురి తప్పిపోయెను. ఒకమారైనను కొట్టలేకపోయిరి. మఱి పండ్రెండుగురు అదే గురిని లక్ష్యముంచి కొట్టిరి. మఱునాడు మొదటి పండ్రెండుగురు ఏమియు త్రాగక వచ్చి యా గురిని కొట్టగలిగిరి. రెండవ కక్షివారు కొంచెము బ్రాంది త్రాగివచ్చినందున నీ దినమున ఓడిపోవలసివచ్చెను. మత్తుపదార్థముల త్రాగకుండిన గురిని బాగుగ కొట్టకలిగియుందురు. వారి దేహములోని నరములు త్రాగినందున వశము తప్పినవి.

ఇదియే పైనిచెప్పినందుకు కారణము. మన దేహములోని పంచేంద్రియములును (శ్రోత్రేంద్రియము — వినడము; ఘ్రాణేంద్రియము—వాసనచూడడము; చక్షురింద్రియము—చూడడము, స్పర్శేంద్రియము—తాకడము; జిహ్వేంద్రియము—రుచి చూడడము) మద్యపానము చేయుటచే బలహీనములగుచున్నవి. ఏవిధమయిన మత్తువస్తువుల త్రాగనివాని కీపంచేంద్రియములును బలముగానుండును. అందుచే ఏ పనినిగాని వాడు సులభముగా చేయును.

రాజు: — ఇందులకొక ఉదాహరణము సైరసుకథ. సైరసు, తన తాతయు అతని అనుచరులును ఒడలు తెలియక త్రాగిపడియుండునపుడు చేసిన చేష్టలనన్నిటిని అతనికి జెప్పెనుగదా. వారట్లు చేయుటచే బాలుడు వారేదో విషము తినియుండవలయునని తలచెను. ఒడలు తెలియక పడియుండినపుడు వారు చేసినదేదియు వారికి తెలియలేదు.

వైద్యుడు: — అవును; త్రాగుటచే మన జ్ఞాపకశక్తి, న్యాయాన్యాయముల విచారించుట, నీతి, ధర్మము అన్నియు నశించును. మన మెదడు జ్ఞానమునకు పుట్టినిల్లు. మెదడు బలహీనమైన జ్ఞాపకశక్తి తగ్గును. మెడియా రాజును అతని సహవాసులును మద్యపానముచేసి తమ తెలివిని కోలుపోయిరి. పిచ్చివారివలె ప్రవర్తించిరి (నడచుకొనిరి). అలెగ్జాండరు మహారాజు ఒడలుతెలియక త్రాగి జర్జసుప్రభువు రాచనగరు (మేడ) ను కాల్చినదియు

తన ప్రాణస్నేహితుని చంపినదియు మీరు వింటిరిగదా. తాను చేయుచుండినదొక్కటియు నతనికి తెలియలేదు. పూర్తిగ త్రాగినవారికి వారి తెలివి స్వాధీనమునందుండదు. వారు పీనుగులతో సమానులు. కొన్ని విషయములలో చనిపోయినవారే మేలు. పీనుగులవలె వారును మైమఱచి కట్టెలవలె నీల్గి నేలపై పడియుందురు. వారి దేహములలోనుండు పంచేంద్రియములు తమ కార్యమును విడిచి అలసటదీర్చుకొనపోయియుండును. ఇట్టి స్థితిలో కొందఱు చనిపోవుటయు కలదు; కొందఱు పిచ్చివారై పోవుటయు కలదు.

మద్యమునకొక పెద్ద దుర్గుణమున్నది. దానిని ఒకమారు త్రాగిన మరల మరల త్రాగుమని ప్రేరేపించుచుండును. అతడు దినదినము త్రాగుచుండును కాన నది వానికి వాడుకయైపోవును. ఆ వాడుకను వదలుట పిమ్మట అతనికి మిగుల కష్టము. మెదడుయొక్క బలము తగ్గి స్వాధీనమున నుండదని ముందు చెప్పియున్నాముగదా. జ్ఞాపకశక్తి తగ్గినందున తాను చేయుకార్యము తప్పని తెలిసికొనియు నా చెడు అలవాటును వదలిపెట్టలేడు. తప్పొప్పుల కనుగొను శక్తి యుండదు. ఎక్కువగానే త్రాగును కాని తక్కువయేమో త్రాగడు. తుదకతని నందఱు త్రాగుబోతని పిలుతురు. ఎవరును దగ్గరకు రానీయరు. తన కుటుంబమువారుకూడ ఆదరింపరు. అతడు అంతటితో తృప్తిపొందక వంశమున కపకీర్తి దెచ్చును.

త్రాగుటచే కలుగు కీళ్లకు మేరలేదు. ఒకదానికి మించినది మఱియొకటి. అందులో మన మెదడునకు కలుగునంత అపాయము శరీరములో మఱియే భాగమునకు కలుగదు. అది చెడిపోవుటవల్ల తప్పొప్పులను తెలిసికొనుట కూడ మిక్కిలి కష్టము. అందువల్ల త్రాగుబోతు ఎప్పుడును అబద్ధము చెప్పుచుండును. కలలోకూడ నిజము చెప్పడు. అందఱిని మోసముచేయును. దొంగలించుట తప్పు కాదని దొంగలించును. నిమిషమున కొకమాటు కారణము లేకయే కోపపడుచుండును. తన ఆలుబిడ్డలను బహు క్రూరముగా చూచును. పూర్తిగా త్రాగి తెలివితప్పి పోవుటకు ముందీపనిని చేసియేయుండడుకదా. పనిచేయుటయన బహు కష్టముగానుండును. తక్కిన చెడ్డ అలవాటులకన్న త్రాగుటచే ప్రపంచమునకు అధికముగా గీడు కలుగుచున్నది.

రాజు:—మంచిది. సారాయము మొదలగు వస్తువుల త్రాగుటచే కలుగు లాభనష్టములు మాకు ఇప్పుడు బాగుగ తెలిసినవి. నా రాజ్యములోని ప్రజలనేకులకు ఆ చెడు వాడుక కలదు. ఆ వాడుకను వారు వదలుటకు నేనేమి చేయవలయును?

వైద్యుడు: — నేను మీ దేశమునకు రెండవమారు వచ్చినపుడు మొదటిపర్యాయము నేను చెప్పిన ఆరోగ్యమార్గములోని విషయములను బడులలో చదువుకొను చిన్నపిల్లలుకూడ నేర్చుకొనియుండుటను చూచితిని.

ఇప్పుడు ఆహారపదార్థములు, త్రాగెడువస్తువులను గుఱించి నే చెప్పినవానినంతయు పుస్తకములలో వ్రాసి అచ్చువేయునపుడు వానికి "ఆరోగ్యమార్గ పాఠములు" అని పేరుపెట్టి ప్రతి పాఠశాలయందును పిల్లలు చదువునట్లు నియమింపుడు. దానిని చదివినపిమ్మట పిల్లలు తమ తలితండ్రుల కందలి విషయములను చెప్పి తామును ఆ ప్రకారమే నడచుకొందురు. ఇదియే మంచిమార్గము.

దివాను: — (తానుండుచోటనే నిలుచుకొని) నేను మిమ్మొకటి ప్రార్థించుచున్నాను. నాకు పండ్రెండేండ్ల వయస్సు కుమారుడొకడున్నాడు. మీరు ఇక్కడ చెప్పు విషయములనంతయు వ్రాసికొనిపోయి ప్రతిదినము ఇంటియందు వానికి నేర్పుచుంటిని. వైద్యులవారు వారి యూరికి పోవుటకుముందు ఒక దినము దర్బారులో వారికి సత్కారము చేయవలయునుగదా. అంతకు ముందుగా వారికి మన పట్టణముననుండు బడులను వైద్యశాలలను చూపవలయునని నా యిష్టము. అదికాక పైవారమునుండి నా కుమారుని వారివద్దకు పంపిన వానికి ప్రతిదినమొక గంటసేపు ఆరోగ్యపద్ధతుల నింకను నేర్పెదనని చెప్పిరి. ప్రభువులవారు నాయందు కరుణించి రేపటికి జరుగవలసిన దర్బారును ఇక వారమురోజునాటికి జరుపవలయునని ప్రార్థించుచున్నాను.

యువరాజు: — పండ్రెండేండ్లవాడగు నాకుమారుని కూడ దివానుగారియింటికి పంపి యతని కుమారునితో

గూడ ఆ విషయముల నేర్చుకొనునట్లు ఉత్తరువు వేడుచున్నాను.

రాజు:—మంచిది. మీయిద్దఱి యిష్టప్రకారమే కానిండు. మఱుసటి దర్బారునకు ఆ బాలు రిద్దఱిని పిలుచుకొనివచ్చి ఎవరైన నౌకరు వారు నేర్చుకొన్న విషయములలో వారిని పరీక్షింపవలయును. మన వకీలు ఆ కార్యమునకు తగినవాడు. అట్లుచేసిన నాకు చాల సంతోషమగును.

తరువాత దర్బారు ముగిసినది. ఇక దర్బారునకు వారమునాటికి రావలసినదని తీర్మానముచేసికొని ఎవరి యిండ్లకు వారు పోయిరి.

పాఠము 9.

ఆరోగ్యమార్గములగుఱించి పరీక్ష ప్రశ్నోత్తరములు.

వారముదినములైనవి. ప్రతిదినము దివానుగారి కుమారుడును యువరాజుగారి కుమారుడును వైద్యునియింటికి వెళ్లి, మూడుగంటలకాలము ఆరోగ్యమార్గమును మొదటినుండియు నేర్చుకొనుచుండిరి. వైద్యుడు తాను మొదటి పర్యాయము ఆ దేశమునకు వచ్చినప్పుడు చెప్పిన విషయములనుకూడ వారికి నేర్పెను.

శుక్రవారమునాడు పదునొకండు గంటలకంతయు అందఱు దర్బారునకు వచ్చిరి. అందు రాజకీయోద్యోగులు

ఇంతకుముందు రానివారుకూడ వచ్చిరి. రాజు వైద్యుడు ఎక్కువ సత్కారము చేయవలయుననుకొనెను. వైద్యుని చూచుట యిదే కడపటిసారియని యతడనుకొనెను. ఇద్దఱు పిల్లవాండ్రును రాజుగారి యుత్తరువుపొంది యచటికి వచ్చియుండిరి. వారి తలితండ్రులుకూడ యచటనే యుండిరి. దివానుగారి కుమారునిపేరు వేంకటు. యువరాజుగారి కుమారునిపేరు ఆనంద. వకీలును తనకు నియమింపబడిన కార్యమునకు సిద్ధముగానుండెను. అతనికి కొన్ని ప్రశ్నలను ఒక కాగితమున వ్రాసి తెచ్చెను.

రాజునకందఱు నమస్కారముచేసి కూర్చుండిరి.

రాజు:—వకీలు ఆ పిల్లవాండ్రనిద్దఱిని పరీక్షించుట యీ దినము మొదటి పని. ఆ పని యారంభింపవచ్చునుగదా?

ఆ పిల్లవాండ్రు రాజున కెదుట నిలబడిరి. వారికి మొదట కొంచెము జంకుగానుండెను. న్యాయస్థలమున న్యాయాధి యెదుట నిలబడి వకీలు అడిగిన ప్రశ్నలకు బదులుచెప్పు సాక్షులవలె భయపడుచుండిరి. రాజు దీనిని జూచి వారిని మంచి మాటలతో ప్రోత్సాహపఱచెను.

రాజు:—బాలులారా! మీరు భయపడకుడు. మన మందఱము స్నేహితులమే. వకీలడుగు వానికంతయు మీరు బదులుచెప్పిన మీకు బహుమానమిచ్చెదను.

వైద్యుడును వారికి ధైర్యముచెప్పెను. అప్పుడు వారికి ధైర్యమువచ్చినది. తలయెత్తి తమ్ము అడుగు ప్రశ్నలకు బదులు చెప్ప సిద్ధులైరి.

వకీలు:—ఒకరిని మార్చి ఒకరిని అడిగెదను.

రాజు:—మంచిది. నీ యిష్టమువచ్చినట్లు అడుగుము.

వకీలు:—రోగమునకు ముఖ్యకారణమేది?

ఆనంద:—ముఱికి (పెంట)యే అందుకు కారణము.

వకీలు:—ఎందువల్ల?

వేంకట:—అనేకములగు రోగములు ముఱికిలోనుండు చిన్నచిన్న పురుగులవల్ల కలుగుచున్నవి.

వకీలు:—ఆ పురుగులెట్లుండును.

ఆనంద:—అవి కంటికికూడ కనుపడవు. అట్లుండియు అవి చేయు కీడునకు మేరలేదు.

వకీలు:—ఎట్లు?

వేంకట:—కలరాను పుట్టించు పురుగులు మన కడుపున నుండు ప్రేవులలో బహు శీఘ్రముగా వృద్ధియగును. అప్పుడు కడుపునొప్పి పుట్టి భేదులగును. భేదులగుటవల్ల ప్రేగులు అవిసిపోవుచున్నవి. విషజ్వరము (మలేరియా)ను పుట్టించు పురుగులు నెత్తురులోనికి చేరుచున్నవి. అందుచే నెత్తురు చెడిపోయి జ్వరము వచ్చుచున్నవి. కొన్ని పురుగులు మఱియొకవిధముగా రోగమును తెచ్చుచున్నవి. కొన్ని పురుగులు దేహమున చేరుటవల్ల మనుష్యులు చనిపోవుటయు కలదు.

వకీలు:—అయితే ముఱికి యెట్లు రోగములకు పుట్టినిల్లు అగును?

ఆనంద:—ఆ పురుగులు దుమ్ములో పుట్టి అందు దాగియుండును. ముఱికి యెచటనుండునో అచట అవి శీఘ్రముగా వృద్ధిపొందును. మన దేహమున ముఱికి యున్ననవి సులభముగా మన శరీరములో చేరును. అంత రోగములు వచ్చును.

వకీలు:—ముఱికి యెట్లు లేకుండును?

వేంకట:—మన దేహమును వస్త్రములను శుభ్రముగా నుంచుకొనవలయును. అవి శుభ్రముగానుండుటకు మంచి నీళ్లను వాడవలయును.

వకీలు:—మంచినీళ్లు దొరకకపోయిన ఏమి చేయవలయును?

ఆనంద:—ఆ ముఱికినీళను బాగుగ కాచినతరువాత వాడుకొనవలయును.

వకీలు:—నీటిని కాచుటచేత నేమిలాభము?

వేంకట:—కాచుటచే నీటిలోనుండు పురుగులన్నియు చనిపోవును.

వకీలు:—గోరువెచ్చనగునంత కాచిన చాలునా?

ఆనంద:—చాలనేచాలదు. అందుచేత చెఱుపేగాని మేలులేదు.

వకీలు:—ఎందుకు?

వేంకట: — నులివెచ్చనయగునట్లు కాచిన వానికంటెను మంచిదే. మనకు స్నానముచేసిన ఎంత హాయిగనుండునో

వెచ్చని నీరు వానికంత సుఖముగానుండును. కాబట్టి వానికి చురుకుదనము అధికమగుచున్నది.

వకీలు:— బాగుగా ఉడుకునట్లు కాచుటచేత గలుగు ప్రయోజనమేమి?

ఆనంద:—ఉడుకునీళ్లను మనుష్యునిపై పోసిన వాడు చనిపోవును. ఆ పురుగుల దేహాము అట్లే మలమల మాడి యవి చనిపోవును.

వకీలు:—మన యిండ్లలోను పెరడులలోను ఉండు పెంటకు విమోచనమెట్లు?

వేంకట:—ఇరుగుపొరుగువారికి సంకటము కలుగకుండ ఊరి బయటిప్రదేశములలో కాల్చివేయతగిన పెంటను కాల్చివేయవలయును.

వకీలు:—అట్లు కాలని పెంటను ఏమి చేయవలయును?

ఆనంద;—ఊరిబయటికి తీసికొనిపోయి, ఒక యడుగు లోతునకు గుంటలుత్రవ్వి అచట ఆ పెంటను పూడ్చి వేయవలయును.

వకీలు:—అది ఆ నేలను పాడుచేయదా?

వేంకట: — అట్లుగాక అది నేలను సారవంతముగా చేయును. తర్వాత అచట పైరు బాగుగ పండును.

వకీలు:—అయితే ఆ నేలలో పైరగువస్తువులు ముఱికిగానుండవా?

ఆనంద:—ఉండనే ఉండవు. ఆ ముఱికి యచటనుండు నేలలోని సారముతో చేరి నేలను మఱింత సారవంతముగా చేయుచున్నది.

రాజు:—ముఱికినిగుఱించి యడిగినది చాలును. కలరా వచ్చుటకు కారణము, దాని నాపుటకు వలయు సాధనముల నడుగుము.

వకీలు:—ఇక కలరానుగుఱించి విచారింతము. కలరా ఎట్లు వచ్చును?

ఆనంద:—మన ప్రేవులలో కొన్ని పురుగులు చేరుటచేత కలరా వచ్చుచున్నది. అవి మన కడుపులోనికి మనము భుజించు ఆహారము మూలమునను, త్రాగెడు నీళ్ల మూలమునను చేరుచున్నవి. అందుచే కడుపునొప్పి పుట్టి భేదులగుచున్నవి. తుదకు ఆ రోగము వచ్చినవాడు చనిపోవును.

వకీలు:—అవి ఎక్కడ ఎప్పుడు పుట్టుచున్నవి?

వేంకట:—అవి సాధారణముగ నీళ్లలో పుట్టుచున్నవి. మొట్టమొదట వాన కురియుచుండగనే పుట్టుచున్నవి.

వకీలు:—ఎందువల్ల?

ఆనంద: — ఎండకాలమున ఈ నదులు చెఱువులు మొదలగు చోట్లలోనంతయు మలమూత్రముల విడుచుచు అన్నివిధములగు రోతకార్యములను చేయుదురు. వాన కురిసి వెల్లువరాగానే ఆ ముఱికి నీటిలోనికి వచ్చుచున్నది. అందులో ఈ కలరాపురుగులుండును.

వకీలు:—అయితే కలరానుండు కాలములో దానిని అపుట యెట్లు?

వేంకట:—మనము వాడుకొనుటకు ముందు నీటిని బాగుగ కాచుటచేత. బాగుగా ఉడుకబెట్టిన యాహార పదార్థములను దినుటయు పాలను కాచి త్రాగుటయు మేలు.

వకీలు:—ఏల?

ఆనంద:—పైనచెప్పినట్లు మన పాలలోగాని ఆహార పదార్థములలోగాని పురుగులు చేరియుండిన అవి కడుపు లోనికి చేరుటకు ముందుగానే చచ్చిపోయియుండును.

వకీలు:—కలరా వచ్చియుండునపుడు గ్రామము నెట్లుంచుకొనవలయును? దాని నాపుట కేమిచేయవల యును?

వేంకట:—ఇండ్లును పెరడులును శుభ్రముగా నుండ వలయును. పెంటను దూరముగా కాల్చి పూడ్చివేయవల యును. ఆహారపదార్థములను వండవలయును. మనము వాడుకొనెడు నీటిని బాగుగ కాచవలయును. ఎవరికైన కొంచెము భేదులగుచుండిన దాని నాపుటకు తత్క్షణము మందు ఈయవలయును.

వకీలు:—ఏ మందు.

ఆనంద:—సర్కారువారు నియమించియుండువారిచ్చు మందును, వైద్యశాలలోనివారిచ్చు మందునుగాని పుచ్చు కొనవలయును.

వకీలు:—అట్లు దొరకకపోయిన నేమి చేయవలయును?

వేంకట:—బాగుగ పులిసిన ద్రాక్షరసముతో కొంచెము కారము (మిరపకాయ) చేర్చి తీసికొనుట మంచిది. దానిని పసిబిడ్డలకుగాని బలహీనులగు వృద్ధులకుగాని యీయకూడదు.

వకీలు:—వారికేల యీయకూడదు?

ఆనంద:—ఇచ్చిన వారు చనిపోదురు.

వకీలు:—కలరాకాలమున నింక నేమి చేయవలయును?

వేంకట:—భయపడక ధైర్యముగా నుండవలయును. ఒకడు ఉల్లాసముతో తన పనినిమాత్రము గమనించు చుండిన కలరా పురుగులతని నేమియు చేయజాలవు.

రాజు:—తెలిసినది, కలరా విషయమై నేర్పవలసినదం తయు వైద్యుడు నేర్పెను. ఇక విషజ్వరము సంబంధము లైన విషయముల నడుగుము.

వకీలు:—విషజ్వరమన నేమి? అది యెట్లు వచ్చును?

ఆనంద:—దోమలు మన రక్తములోనికి విడుచు పురుగు లచే విషజ్వరము వచ్చును.

వకీలు:—దాని నాపుట యెట్లు.

వేంకట:—దోమలను వాని పిల్లలను చంపి నాశనము చేయుటచేత.

వకీలు:—దోమలపిల్లలు ఎట్లుండును?

ఆనంద:—గ్రుడ్డునుండి అప్పుడే బయటపడిన దోమ పిల్ల దోమవలె ఎగురజాలదు. అది చిన్న కంబళిపురుగు

వఱ నుండును. అయితే కంబళిపురుగుపై నుండునట్లు దానిపై వెండ్రుకలుండవు. గ్రుడ్డునుండి వెలువడిన పిల్ల ముఱికి నీటిలోనికి చేరును.

వకీలు:—దానిని చంపుట యెట్లు?

వేంకట: — ఇండ్ల సమీపముననుండు ముఱికిగుంటలలోను అచ్చటచ్చట పల్లములలోను ఉండునీటిని వట్టిపోవునట్లు చేయుటచేతను, ఇండ్లను చుట్టుప్రక్కల ప్రదేశములను శుద్ధముగా నుంచుకొనుటచేతను.

వకీలు:—అందుచే నేమిలాభము?

ఆనంద: — దోమపిల్లలకు ఉండుటకు చోటుండదు. వానికి ముఱికిగుంటలే యిండ్లు. ఇండ్లు శుభ్రముగానున్న ఆ దోమలుండుటకు చీకటిప్రదేశములును ముఱికిప్రదేశములును ఉండవు. కాబట్టి అవి పరుగెత్తిపోవును.

వకీలు:—విషజ్వరమునకు మంచి మందు ఏది?

వేంకట:—క్వైనా మంచి మందు.

వకీలు: — దానినెట్లు పుచ్చుకొనవలయును?

ఆనంద:—అయిదు గింజలయెత్తు క్వైనాపొడిని నీటిలో కలిపి జ్వరము నిలుచువరకు అప్పడప్పుడు త్రాగుచుండవలయును. చిన్నవారికంతకన్న తక్కువగా నీయవలయును.

వకీలు:—క్వైనావల్లచే కలుగు మేలేది?

వేంకట:—అది రక్తములో చేరి దేహములోనంతయు పారును

ఆ రక్తములో విషజ్వరపు పురుగులు బ్రతుకజాలవు.

రాజు:—ఆనంద! వేంకట! బాగుగ చెప్పితిరి. ఏ ప్రశ్నకైన తప్పక అన్నిటికిని సరియగు నుత్తరముల చెప్పితిరి. అతిసారము, శీతభేది, కడుపునొప్పి మొదలగు రోగములగుఱించి వైద్యుడేదయిన చెప్పియుండునా?

వైద్యుడు:—వారినే యడుగుడు.

వకీలు:—నేనా విషయములలో ప్రశ్నలు వ్రాసి తీసికొని రాలేదు. కాబట్టి దయచేసి మఱెవరినైన అడుగుడు. వైద్యుడే ఆ విషయముల నడుగ సమర్థుడు.

రాజు: — నేను నడే యనుకొనెదను. (వైద్యునితో) దయచేసి యా విషయమును వారి నడిగెదరా?

వైద్యుడు:—చిత్తము. ఆనందా! ప్రేవులలోను, కడుపులోను, కలుగు రోగములకు కారణములెవ్వి?

ఆనంద: — మంచి యాహారమును భుజింపనిదే కారణము.

వైద్యుడు: — అందులకేది మందు?

వేంకట:—వట్టి వరియన్నము, పాలు మొదలగు తిన్నగా జీర్ణమగు వస్తువులను రోగము కుదురువఱకు భుజించుట మంచిది.

వైద్యుడు: — కాయకూరలును, నేతిని భుజింపవచ్చునా?

ఆనంద:—కూడదు. అట్టి సమయములలో అవి విషములతో సమానములు.

వైద్యుడు:—అయిన అన్నముతో ఏ వస్తువులను చేర్చు కొనవచ్చును?

వేంకట:—ఏ వస్తువును చేర్చుకొనకూడదు. రోగము కుదురువఱకు సులభముగా జీర్ణమగు వరియన్నము, పాలు మొదలగు వస్తువులనే భుజింపవలయును. ఉప్పు వేసికొన వచ్చును.

వైద్యుడు:—ఇతర సంబారముల చేర్చుకొనక భుజింప లేనివాడు చేయవలసినదేమి?

ఆనంద: — ఏదియు తినక పస్తుపడియుండవలయును. అట్లుండిన రోగము తగ్గి ఆకలెత్తినపుడు సంబారములేక యే భుజించును.

వైద్యుడు: — ఈ వైద్యముకాక వేఱే మందేదయిన పుచ్చుకొనవలయునా?

వేంకట:—పైచెప్పినట్లు పథ్యమున్నంతకాలము మఱి యే మందును అక్కఱలేదు.

సేనానాయకుడు:—(లేచి నిలుచుకొని) ప్రభువులవారు చిత్తగించిన నేనును ఈ బాలుర కొన్ని ప్రశ్నలడుగ దలచు కొన్నాను. అవి పుండ్లు గాయములు వానిని మాన్చువిధ ముల సంబంధమయినవి. నా సైనికులకు కవాతుచేయు నపుడు గాయములు తగులుచున్నవి. ఆ విషయమై వీరి కేదియు వైద్యుడు నేర్పలేదు కాబోలు.

వైద్యుడు:—(చిఱునవ్వుతో) మిక్కిలి కష్టములైనవాని నడుగవలదు. సులభమయినవాని నడిగిన వారు తప్పక చెప్పుదురు.

సేనానాయకుడు:—గాయములకును పుండ్లకును మందు వేయునపుడు గమనించవలసిన ముఖ్య విషయమేమి.

ఆనంద:—వానిని శుభ్రముగా నుంచుకొనవలయును.

సేనానాయకుడు:—ఏల?

వేంకట:—శుభ్రముగానున్న వేఱు మందు అక్కఱలేక అవే ఆరిపోవును.

సేనా:—అయిన కొన్ని గాయములకేల చీముపట్టును?

ఆనంద:—గాయములను శుభ్రముగా నుంచుకొననం దున నందు పురుగులుచేరి చీముపట్టును. బాధయు ఎక్కు వగును.

సేనా: — గాయములకు కట్టు కట్టునపుడేమి చేయవల యును?

వేంకట: — ఆ గాయములను మురికిలేని శుద్ధములైన గుడ్డలతో తుడిచి శుభ్రములగు గుడ్డలతోనే కట్టవలయును.

సేనా:—నిర్మలమైన నీరెచట దొరకును?

ఆనంద:—మంచిగుడ్డలో వడియగట్టి తర్వాత కాచుట చేత.

సేనా:—వడియకట్టినమాత్రము చాలునా?

వేంకట:—చాలదు. బాగుగా కాగబెట్టవలయును.

సేనా:—ఏల?

ఆనంద:—అందులోనుండు పురుగులు చచ్చుటకు.

సేనా:—కట్టుకట్టుటకు మురికిలేని గుడ్డలెక్కడ దొరకును?

వేంకట:—గుడ్డలను నీటితోకూడ ఉడుకబెట్టి యెండలో దండెములపై ఆరవేయవలయును.

సేనా:—నేలపై ఆరవేయవచ్చునా?

ఆనంద:—కూడనే కూడదు.

సేనా:—ఎందువల్ల?

వేంకట:—మట్టిలోని పురుగులు ఆ గుడ్డలకు అంటుకొని యుండి గాయములోనికి చేరును.

సేనా:—వేఱేవిధమయిన చికిత్స ఆవశ్యకమా.

ఆనంద: — కొంచెము మంచినూనెను గాయముపై పూసిన గుడ్డ తగులుటచే పుట్టు మంట లేకుండును. అయిన ఆ నూనెయు నిర్మలముగా నుండవలయును.

సేనా:—అది శుభ్రమయినదని యెట్లు తెలియును?

వేంకట:—అదీ తెలియుట కష్టము. నూనెను వడియ కట్టి బాగుగా కాచి బుడ్డిలోపోసి బిరడావేసి ఆరబెట్టి యుంచుకొనవలయును. తర్వాత కీడేమియు నుండదు.

సేనా:—గాయమును కట్టుటకు కావలసిన వస్తువులేవి?

ఆనంద:—శుద్ధమైన నీళ్లు, నూనె, మురికిలేనిగుడ్డలు.

సేనా: — నేనడుగదలచుకొన్నదింతే. వారు చెప్పినవంతయు నాకు సమాధానముగ నున్నవి.

రాజు:—నేనే వారిని కొన్ని ప్రశ్నలడిగెదను. అన్నిరోగములకుపయోగించు మందు ఏది?

ఆనంద:—పరిశుభ్రత.

రాజు: — మన శరీరములనుమాత్రము శుభ్రముగా నుంచుకొన్న జాలునా?

వేంకట: — చాలదు. మన యిండ్లను పెరడులను శుభ్రముగా నుండవలయును.

రాజు:—అంతమాత్రము చాలునా?

ఆనంద:—అన్నిటికన్న ముఖ్యముగా గమనింపవలసిన దొకటి యున్నది.

రాజు:—అదేది.

వేంకట:—మనము త్రాగెడు నీళ్లవసతి.

రాజు:—ఏల.

ఆనంద:—పెక్కు రోగములు చెడు నీటిని త్రాగుటచేత వచ్చుచున్నవి.

రాజు:—దానికి మనమేమి చేయవచ్చును?

వేంకట:—మంచినీళ్లు తెచ్చుకొనెడి చెఱువులు బావులు శుభ్రముగా నుంచుకొనవలయును. వానిలో నెవరిని స్నానముచేయనీయకూడదు. గుడ్డలుదుకనీయకూడదు. ఆ చుట్టుప్రక్కల నెవరిని మలమూత్రముల విసర్జింపనీయకూడదు.

రాజు:—అంతేనా?

ఆనంద:—మనమే ఆపనులచేయక జాగ్రతగ నుండవలయును.

రాజు:—ఇట్టి కష్టములకు లోబడుటచే కలుగు లాభమేమి?

వేంకట:—మంచిది. అఱువది డెబ్బది సంవత్సరములకు ముందు ఇంగ్లాండులో కలరా విషజ్వరములు ఇప్పుడు ఇండియాలో ఎంత ప్రబలముగా నున్నవో అంత ప్రబలముగా నుండెను.

రాజు:—ఇప్పుడును అట్లే యున్నదా.

ఆనంద: — లేదు. కలరా విషజ్వరములు ఇప్పుడు ఇంగ్లాండులో లేనేలేవు.

రాజు:—కారణమేమి?

వేంకట: — ఆరోగ్యమార్గముల ననుసరించుటకు ఆ జనులు నేర్చుకొనిరి. దాని ప్రకారము జలదారులగుండా తమ యిండ్లదగ్గరనుండు మురికినీటిని ఊరిబయటికి పోవునట్లు చేయుచున్నారు. పెంటను ఊరికి దూరముగా పారవేయుచున్నారు. వారు త్రాగెడు జలము శుద్ధముగా నున్నది.

రాజు:—అట్లు మనకుకూడ జరుగునా?

ఆనంద: — నిస్సందేహముగా. మన మారోగ్యమార్గముల ననుసరింపవలయునని మాట్లాడుటతోను, పుస్తకములలో వాని నచ్చువేయించి చదువునట్లు చేయుటతోను

మాత్రము తృప్తిపొందియుండక వానిని అనుసరింపవలయును.

రాజు:—మనమింకను ఏమి చేయవలయును?

వేంకట: — పైచెప్పిన విషయములు మఱువక గ్రామములను శుభ్రముగా నుంచుకొనవలయును. ఇండ్లును శుభ్రముగా నుండవలయును. పెంట చేర్చిపెట్టకూడదు. మనము మంచి వడియగట్టిన నీటినే త్రాగవలయును.

రాజు:—ఇక చాలును. మీరిద్దఱు అడిగినవానికన్నిటికి తప్పక బదులు చెప్పితిరి. ఆహారవస్తువులు త్రాగెడు వస్తువుల సంబంధమైన ప్రశ్నలు వేయుటలేదు. ఇప్పటికే చాల ప్రొద్దయినది. మీ యిద్దఱికిని చెఱియొక యేబది రూపాయలు బహుమానము ఇదిగో తీసికొనుడు.

అంత ఆ బాలురా రాజుదగ్గఱికి వచ్చి యా బహుమానమును పుచ్చుకొని రాజునకు వందనములు చేసిరి.

రాజు:—ఆ పైకమును మీరేమి చేసెదరు?

ఆ బాలురు ఇరువురు వైద్యునియొద్దకు వెళ్లి నమస్కారములు చేసిరి.

బాలురు: — మీరు మాకు విద్యనేర్పినందుకై దీనిని బహుమానముగా పుచ్చుకొనుడు.

వైద్యుడు: — వలదు. వలదు. మీరు మంచి బాలురు. మీ తలిదండ్రులు మీకు సత్ప్రవర్తనమే నేర్పిరి. నాకేమియు బహుమానము వలదు. మీకు విద్య నేర్పగలిగినదే

నాకు చాలు. మంచి పుస్తకములను కొని యందు రాజు గారి చేవ్రాలుచేయించి యుంచుకొని చదువుచుండుడు.

రాజు:—చాల ఆలస్యమైనది. ఇకపై మన వైద్యుని ఆపియుంచుట మంచిదికాదు. ఈ సాయంత్రమే వారూరికి పోవుటకు తగిన పనులన్నియు తీర్చుకొనియుందురు.

(వైద్యునితో) మీరు మాకు చేసిన యుపకారమునకు ఎంతయు కృతజ్ఞులము. మీరు సదా మాతోడ నుండుటయే మాకు ఆనందము. అయిన మీ రాజుగారును మా దేశపు జనులును మిమ్మెదురుచూచుచుందురు. మీ దేశమును మీరు క్షేమముగా చేరవలయునని భగవంతుని ప్రార్థించుచున్నాము. ఇక మీరు సెలవు తీసికొనవచ్చును.

అని రాజు వైద్యునికి గొప్ప వెలగల వస్తువుల బహుమానమిచ్చి సత్కరించి యంపెను. వైద్యుడును సుఖముగా తన దేశమును చేరెను.

S. P. C. K. PRESS, VEPERY, MADRAS—1916.

END OF
TITLE